ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, జూలై 21, 2026 | సంపుటి - 22 | సంచిక 293 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## ట్రైనీ ఐపిఎస్ సస్పెండ్

- ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమే
- నిర్ధారించిన ప్రివిలేజ్ కమిటీ
- జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల వ్యవహారంలో
- ఆత్మతహత్యకు యత్నంచిన ఉదయ్



2

**హైదరాబాద్,జూలై20(నినాదం):** లైంగిక ఆరోపణల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం ఉత్కంఠగా మారింది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కేసులో ఊహించని పరిణామం ఎదురైంది. ఓ వైపు ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకోగా,మరోవైపు ఆయన ఆత్మహత్యకు పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

### బాలికపై కానిస్టేబుల్ అనుచిత ప్రవర్తన

పోలీస్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్

## మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం

- నిపుణుల నివేదికల ఆధారంగా పునరుద్ధరణ పనులు
- చివరి దశకు చేరుకున్న పరీక్షలు
- భద్రతా అనుమతుల తర్వాతే బ్యారేజీల నిర్వహణ
- శాస్త్రీయ విధానంతో కాళేశ్వరం బ్యారేజీల పునరుజ్జీవనం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,జూలై 20(నినాదం):** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నాయని, వాటి ఆధారంగా మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల రూపకల్పన జరుగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం పూర్తిగా శాస్త్రీయ విధానాన్నే అనుసరిస్తోందని స్పష్టం చేశారు.

తరువాయి 2లో..

## బహదూర్‌గూడ భూముల్లో చర్యలు తీసుకోవద్దు

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం





**హైదరాబాద్,జులై 20(నినాదం):** శంషాబాద్ మండలం, బహదూర్‌గూడ భూములపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బహదూర్‌గూడ భూముల్లో ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాలు తమవేనంటూ నలుగురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు.

# నెలకు అరకోటి.. సర్కారు సొమ్ము లూటీ...!

## అన్నీ మామూళ్లే.. అంతా మామూలే..! కోట్లు పంచుకుంటున్నారు

- అన్నీ తెలిసి అంటకాగుతున్నరు
- ఆగని అన కొండ బియ్యం స్మగ్లింగ్..!
- వెయ్యి క్వింటాళ్లు పట్టుబడ్డా..యథేచ్ఛగా దందా.?
- గత ఏడాది 1000 కోట్ల బిజినెస్ అంటే..?
- తిమింగలాలను వదిలేసి పిత్తపరిగెల పైనే చర్యలా..?
- జగిత్యాలలో కానరాని కొత్త డిజిపి మార్కు




**జగిత్యాల జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై గత కొంతకాలంగా వరుస కథనాలు వెలుగులోకి వచ్చాయి. భారీ మొత్తంలో రేషన్ బియ్యం పట్టుబడింది. కేసులు నమోదయ్యాయి. వాహనాలు సీజ్ అయ్యాయి. 6-ఏ కేసులు కూడా నమోదయ్యాయి. అయినప్పటికీ అక్రమ రవాణా పూర్తిగా ఆగలేదనే ఆరోపణలు మళ్లీ వినిపిస్తున్నాయి. దీంతో గతంలో జరిగిన చర్యలు నిజంగా ఈ నెట్‌వర్క్‌ను దెబ్బతీశాయా? లేక పైపై చర్యలకే పరిమితమయ్యాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో మళ్లీ చర్చకు వస్తున్నాయి.**

**(ప్రత్యేక ప్రతినిధి – నినాదం)**

గతంలో హనుమాన్ సాయి రైస్ మిల్లు సహా పలు ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో వందల క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు అధికారికంగా నమోదైంది. అనంతరం కేసులు కూడా నమోదయ్యాయి.అయితే ఆ కేసులు మొత్తం అక్రమ రవాణా వ్యవస్థను ఛేదించగలిగాయా? లేక కేవలం కొన్ని సంఘటనల వరకే పరిమితమయ్యాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం, ఈ అక్రమ రవాణాకు సంబంధించిన నెట్‌వర్క్ చాలా కాలంగా పనిచేస్తోందని, కఠిన చట్టాల కింద చర్యలు ఎదురయ్యే అవకాశాన్ని ముందుగానే అంచనా వేసి కొన్ని మిల్లుల యాజమాన్యాన్ని బినామీల పేర్లకు మార్చినట్లు ప్రచారం జరుగుతోందని చెబుతున్నారు. ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందో సంబంధిత దర్యాప్తు సంస్థలు సమగ్రంగా విచారించాలని సామాజికవేత్తలు కోరుతున్నారు.

### డిజిపిపై నమ్మకం

కొత్తగా డీజీపీ సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా అక్రమ రవాణా, సంఘటిత నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటారనే అంచనాలు ఉన్నాయి. జగిత్యాల జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై గతంలో నమోదైన కేసులన్నింటినీ సమగ్రంగా పునఃసమీక్షించి, నెట్‌వర్క్ స్థాయిలో దర్యాప్తు చేపట్టి, వాస్తవాలు వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు.గతంలో నమోదైన కేసులు, దాడులు, స్వాధీనం చేసుకున్న బియ్యం, సంబంధిత మిల్లుల వ్యవహారాలు, కేసుల ప్రస్తుత స్థితి, వాటి వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై సమగ్ర విచారణ జరిగితేనే ప్రజల్లో ఉన్న అనుమానాలకు సమాధానం దొరుకుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ఆ 'కొండ'కు అండ ఎవరెవరు..?

*గతంలో వెయ్యి క్వింటాళ్లకు చేరువైన బియ్యం పట్టుబడిన ఘటనలు, వరుస కేసులు నమోదైనా అక్రమ రవాణా పూర్తిగా ఆగకపోవడం వెనుక కారణాలేమిటి? అసలు నెట్‌వర్క్ ఎక్కడ ఉంది? దానికి ఆర్థికంగా, లాజిస్టిక్‌గా అండగా నిలుస్తున్నవారు ఎవరన్నది లోతుగా తేల్చాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.అక్రమ రవాణా నియంత్రణలో పోలీసు, సివిల్ సప్లైస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమని, గతంలో నమోదైన కేసుల పురోగతి, ఆర్థిక లావాదేవీలు, మిల్లుల యాజమాన్య మార్పులు, బినామీ కోణం వంటి అంశాలపై ప్రత్యేక దర్యాప్తు జరపాలని సామాజిక వేత్తలు సూచిస్తున్నారు.*



## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం

- నీట్, అయోధ్య విరాళాలపై చర్చకు విపక్షాల పట్టు
- తొలిరోజే గందరగోళ పరిస్థితులు
- వాయిదాల పర్వం




### దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది

- సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి
- విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం
- పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

వివరాలు 2లో..

## పామాయిల్ పెంపకంతో రైతులకు మేలు

- వర్షా భావంలోనూ పంటలకు ఢోకా లేదు
- ఆయిల్ పామ్ హబ్‌గా ఖమ్మం
- దేశంలోనే తొలి గోద్రెజ్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి భట్టి విక్రమార్క
- 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగు విస్తరణే లక్ష్యం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం ప్రతినిధి , జూలై 20 (నినాదం )** వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే రైతుల ఆదాయం శాశ్వతంగా పెరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో గోద్రెజ్ సంస్థ నిర్మించిన దేశంలోనే తొలి సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ఆయన ఘనంగా ప్రారంభించారు.

తరువాయి 2లో..



## నత్తనడకన సర్ డిజిటైలేషన్

కేవలం 65 శాతం మాత్రమే పూర్తయినట్లు సమాచారం



**హైదరాబాద్,జూలై20(నినాదం):** రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియకు సంబంధించిన డిజిటలైజేషన్ నత్తనడకన సాగుతున్నది. మరోవైపు అధికారులేమో 90 శాతం పూర్తయిందంటూ ప్రకటనలు ఇస్తున్నారు.

తరువాయి 2లో..

## సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 37కు పెంపు

లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి అర్జున్ రామ్‌పాల్



**న్యూఢిల్లీ,జులై 20(నినాదం):** సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను మరోసారి పెంచేందుకు కేంద్రం సిద్ధమైంది. దీనికోసం రూపొందించిన బిల్లును కేంద్రం లోక్‌సభలో సోమవారం ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ బిల్, 2026ను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌పాల్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనిప్రకారం ఇప్పటికే ఉన్న సుప్రీంకోర్టు యాక్ట్, 1956ను మార్చనున్నారు.

తరువాయి 2లో..



## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

- ప్లాట్ల కోసం పది వరకు దరఖాస్తుల స్వీకరణ
- రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి
- ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు

వివరాలు 2లో..

## జెపి నడ్డాతో కాక్రోచ్ జనతా ప్రతినిధుల భేటీ

- పరీక్షల నిర్వహణా లోపాలపై ప్రశ్నలు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టు
- వినతిపత్రం అందచేత
- దీక్ష విరమిస్తున్నట్లు సోనమ్ వాంగ్‌చుక్ వెల్లడి

**న్యూఢిల్లీ,జూలై20(నినాదం)** నీట్, ఇతర పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన ఓ లేఖను ఆయనకు అందజేశారు. సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా సుమారు పది నిమిషాల పాటు నడ్డాతో భేటీ అయ్యారు. వారి డిమాండ్లను పరిశీలించి, ప్రభుత్వంలోని సంబంధిత స్థాయిలో చర్చిస్తానని నడ్డా హామీ ఇచ్చారని సౌరవ్ దాస్ తెలిపారు.

తరువాయి 2లో..

## పెళ్లయిన మూడు నెలలకే యువకుడి ఆత్మహత్య

భార్య వేధింపులు తట్టుకోలేక బలవన్మరణం

**ఖమ్మం,జూలై20(నినాదం):** ఖమ్మం జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మగతనం లేదని నిత్యం భార్య వేధింపులు తట్టుకోలేక ఓ భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెళ్లయిన మూడు నెలలకే యువకుడు బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది.

తరువాయి 2లో..

## త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద మృతి

ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణ



వివరాలు 2లో..

## మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం

నిపుణులు భద్రతపై పూర్తి స్థాయిలో ధ్రువీకరించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకురాబోమని వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ , నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థలు నేల స్వభావం, పునాదులు, కాంక్రీట్ నిర్మాణం, ఇతర నిర్మాణ భాగాలపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని, వాటి ఫలితాలను ఐఐటీ బొంబాయికి పంపించగా, అక్కడ నిపుణులు సమగ్ర పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం దయాఫ్రం వాల్ నిర్మాణం పునరుద్ధరణలో భాగం కావచ్చని భావిస్తున్నప్పటికీ, అన్ని సాంకేతిక నివేదికలను పరిశీలించిన అనంతరమే తుది మరమ్మతుల విధానాన్ని నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ , కేంద్ర జల సంఘం సూచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. పునరుద్ధరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత సైన్యంలో సేవలందించిన అనుభవజ్ఞులైన ఇంజినీర్ల సేవలను ప్రభుత్వం వినియోగిస్తోందని, కల్నల్ పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలోని సమన్వయ కమిటీ పరీక్షలు, సాంకేతిక ప్రణాళికలను పర్యవేక్షిస్తూ పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. `రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాస్త్రీయ పరీక్షలు, నిపుణుల రూపకల్పన, చట్టబద్ధ భద్రతా అనుమతులు పూర్తయిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ కీలక ప్రాజెక్టును శాశ్వత భద్రతతో పునరుద్ధరించి రాష్ట్ర అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

## సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 37కు పెంపు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టడం విశేషం. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 33 మంది జడ్జీలున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 37కు పెరుగుతుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో నీట్ యుజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ప్రభుత్వం ఈ బిల్లును కేంద్రం సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు కొత్తదేం కాదు. దీనిపై కేంద్రం గతంలోనే ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనికి రాష్ట్రపతి కూడా ఇంతకుముందే ఆమోదం తెలిపారు. ఈ ఆర్డినెన్స్ ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను 37కు పెంచుకోవచ్చు. అయితే, దీన్ని పూర్తిస్థాయి చట్టంగా తీసుకురావాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. అందుకోసమే బిల్లును రూపొందించి, ప్రవేశపెట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 ప్రకారం సుప్రీకోర్టు జడ్జీల సంఖ్యను చట్టం ద్వారా పార్లమెంటే నిర్ణయించవచ్చు. దీనికోసం సాధారణ మెజారిటీ ఉంటే చాలు. ఇతర రాజ్యాంగ సవరణ చట్టాలలాగా మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం లేదు. దీంతో ఈ బిల్లు త్వరగానే ఆమోదం పొందే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఇప్పుడు సుప్రీంకోర్టుకు 37 మంది జడ్జీలు ఉంటారు. అదనంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా. సీజేఐతో కలిపితే మొత్తం 38 మంది జడ్జీలు అవుతారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 32 మంది జడ్జీలు పని చేస్తున్నారు. ఎన్డీయే ప్రభుత్వం గతంలో 2019లోనే జడ్జీల సంఖ్యను ఒకసారి పెంచింది. ఇప్పుడు మరోసారి పెంచేందుకు సిద్ధమైంది. భారత సుప్రీంకోర్టు జడ్జీలకు సంబంధించి గతంలో ఉన్న సంఖ్య ఇది. 1956లో సుప్రీంకోర్టులో సీజేఐతో కలిపి 10 మంది జడ్జీలు ఉండేవారు. ఆ తర్వాత దీన్ని 1960లో 13కు పెంచింది అప్పటి కేంద్ర ప్రభుత్వం. ఆ తర్వాత 1977లో 17కు, 1986లో 25కు, 2008లో 30కి, 2019లో 33కు పెంచారు.

## త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్‌ఖడ్ మృతి

**అగర్తలా,జులై 20(నినాదం):**

త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు . అగర్తలా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని ఆఫీస్ బాత్రూంలో అపస్మాకర స్థితిలో ఉన్న ఆయన్ను గుర్తించిన సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు సమాచారం. ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించి ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ఘటన గురించి తెలియగానే ముఖ్యమంత్రి మాణిక్ సాహా డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. అనురాగ్ ధన్‌ఖడ్ 1994 బ్యాచ్‌కు చెందిన త్రిపుర క్యాడర్ ఐపీఎస్. డీజీపీ మృతిపై ఆసుపత్రి సీనియర్ వైద్యుడు మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న అనురాగ్ ధన్‌ఖడ్‌ను తీసుకొచ్చారని అన్నారు. వెంటనే డ్యూటీలో ఉన్న వైద్యులు పరిశీలించగా.. అప్పటికే పల్స్ పడిపోయిందని చెప్పారు. దాదాపు 48 నిమిషాల పాటు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే ఎలా మృతిచెందారన్నదానిపై స్పష్టత వస్తుందని చెప్పారు. ఉరివేసుకున్న ఆనవాళ్లేమైనా కనిపించాయా? అని విలేకరులు ప్రశ్నించగా.. నివేదిక వచ్చిన తర్వాతే అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు. మరోవైపు డీజీపీ మృతితో సీనియర్ పోలీసు అధికారులంతా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. సంఘటన స్థలిలో ఆధారాలను సేకరించి, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## పెళ్లయిన మూడు నెలలకే యువకుడి ఆత్మహత్య

రఘునాథపాలెం మండలం రాంక్యాతండాకు చెందిన సదర్‌లాల్ (27) తండ్రితో కలిసి మేకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది మే నెలలో హర్యాతండాకు చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లయిన మ డో రోజు నుంచే నీకు మగతనం లేదంటూ భార్య అవమానించడం, మానసికంగా వేధించడం మొదలుపెట్టింది. ఇటీవల సీత్లా పండుగ సందర్భంగా అత్తారింటికి వెళ్తే.. అక్కడ తన కుటుంబసభ్యులతో కలిసి మరోసారి సదర్‌లాల్‌ను భార్య అవమానించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు ఇంటికొచ్చి బాధపడ్డాడు. తర్వాత అక్క దగ్గరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి.. బయటకు వెళ్లి చనిపోతున్నానని బావకు ఫోన్ చేసి చెప్పాడు. అలాగే అతని లొకేషన్‌ను షేర్ చేశాడు. కంగారుపడిన కుటుంబసభ్యులు వెంటనే వి.వెంకటాయపాలెం కాల్వ దగ్గరకు వెళ్లి చూడగా.. అక్కడ సదర్‌లాల్ బైక్, ఫోన్, కలుపుమందు డబ్బా కనిపించాయి. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కాల్వలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. అయితే పెళ్లికి ముందే సదరు యువతి మరో వ్యక్తితో ప్రేమలో ఉందని.. పెళ్లయ్యాక కూడా అతనితో సంబంధం కొనసాగించేందుకే సదర్‌లాల్‌కు మగతనం లేదని ఆరోపణలు చేసిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. యువతి ఆరోపణలతో పంచాయతీ పెడితే.. మెడికల్ టెస్టులు చేయించామని వారు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ట్రైనీ ఐపీఎస్ సస్పెండ్

లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ నేషనల్ అకాడమీ చర్యలు తీసుకుంది. కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. నేషనల్ పోలీస్ అకాడమీ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం మేరకు ఉదయ్ కృష్ణా రెడ్డిని ఎన్‌పీఏ నుంచి అధికారులు పంపించేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన గురించి మొదట ఎన్‌పీఏ అధికారులకు మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. సీసీటీవీ కెమెరాల ఆధారాలతో పాటు అన్ని ఆధారాలు సేకరించాక ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమేనని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. దీంతో తక్షణమే పోలీస్ అకాడమీ నుంచి నుంచి సస్పెండ్ చేస్తూ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సర్వీస్‌లో జాయినింగ్‌కు సంబంధించి డీవోపీటీ దే తుది నిర్ణయం అని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగానే ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఎర్రగడ్డలోని ఓ ఆస్పత్రిలో కృష్ణారెడ్డికి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ మరో మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. దీంతో అత్తాపూర్ పోలీసులు కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ అంశంపై ఎనిమిది రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ట్రైనీ ఐపీఎస్‌కు పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఈ ఘటన అనంతరం సొంతూరుకు వెళ్లిపోయిన కృష్ణారెడ్డి.. ఆదివారం సాయంత్రం మోతీనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించి అతన్ని ఎర్రగడ్డలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. కాగా, ఆత్మహత్యకు ముందు తన తప్పేమీ లేదని ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ స్టేటస్ పెట్టడం గమనార్హం. తనతోపాటు శిక్షణ పొందుతున్న తోటి ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఈ ఏడాది జూన్ 23 నుంచి తనను లైంగికంగా వేధిస్తున్నాడని, వాట్సాప్ ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపి బూతులు తిడుతున్నాడని ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి రహస్యంగా తన వ్యక్తిగత ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి తీవ్రంగా బెదిరిస్తున్నాడని, ఆ వీడియోలను తన భర్తకు పంపి మానసికంగా వేధించడంతోపాటు వాటిని సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తనను బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి ప్రైవేట్ భాగాలను తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడటంతోపాటు చంపేందుకు ప్రయత్నించాడని, మెడపై కత్తి పెట్టి ఆ గది నుంచి బయటకు వెళ్లకుండా నిర్బంధించాడని ఆ అధికారి ఆరోపించారు. దీంతో ఉదయ్ కృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు.. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మహిళా ఐపీఎస్ ట్రైనీ చేసిన ఆరోపణలు నిజమని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. ఈ కమిటీ నిర్ణయంతో జాతీయ పోలీస్ అకాడమీనుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. దీనికి ముందు తన తప్పేమీ లేదంటూ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. ఇప్పుడు ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.

## బాలికపై కానిస్టేబుల్ అనుచిత ప్రవర్తన

నల్లగొండ,జూలై20(నినాదం):

బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడని ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై పోక్సో కేసు నమోదైంది.ఈ మేరకు గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణను నల్గొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల సైకిల్‌పై వెళ్తున్న ఓ బాలికను నిందితుడు అడ్డగించి, ఆమెతో అసభ్యంగా వ్యవహరించాడు. అనుచితంగా తాకి వేధించాడు. ఇంటికి వెళ్లాక బాలిక ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. వారు వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఘటనాస్థలిలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. నిందితుడు మాస్క్ ధరించి, పలుచోట్ల తిరిగినట్లుగా గుర్తించారు. సదరు మాస్క్ వ్యక్తి గురించి ఎంక్వైరీ చేయగా.. గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ అని తెలిసింది. దీంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, నకిరేకల్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో కూడా సత్యనారాయణపై రెండు పోక్సో కేసులు నమోదైనట్లుగా తెలుస్తోంది. స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల కూడా అనుచితంగా ప్రవర్తిస్తాడనే ఆరోపణలు ఉన్నాయి.

## నత్తనడకన సర్ డిజిటైలేషన్

బిఎల్‌వోలు తమ ఇంటికి రాలేదని, తమకు ఫారాలు ఇవ్వలేదని పలుచోట్ల నుంచి వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. ఇకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్ ల పంపిణీ దాదాపు పూర్తయినప్పటికీ వాటికి సంబంధించిన ఆన్‌లైన్ డాటా ఎంట్రీ పక్రియ మందకొడిగా నడుస్తున్నది. ఆదివారం సాయంత్రం వరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కార్యాలయానికి అందిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 2,19,23, 435 ఈఎఫ్‌ల 64.81 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. గ్రామీణ జిల్లాలతో పోలిస్తే ఎకువ ఓటర్లున్న నగర, ఐటీ కారిడార్ పరిధిలోని జిల్లాల్లో ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ మెల్లగా సాగుతున్నది. మేడ్చల్ మలాజిగిరి జిల్లాలో అత్యంత తకువగా 37.30శాతం ఈఎఫ్‌లు మాత్రమే డిజిటలైజ్ కాగా, హైదరాబాద్ జిల్లాలో 39.59శాతం , రంగారెడ్డి జిల్లాలో 48.52శాతం ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ పూర్తయింది. వీటితో పోలిస్తే గ్రామీణ జిల్లాలు చాలా ముందంజలో ఉన్నాయి. ఇప్పటివరకు 88.43? ఈఎఫ్‌ల డిజిటలైజేషన్‌తో యాదాద్రి భువనగిరి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సిద్దిపేట (83.55శాతం), నల్లగొండ (82.74శాతం), కుమ్రంభీం ఆసిఫాబాద్ (81.63శాతం) జిల్లాలు ఉన్నాయి.

## బహదూర్‌గూడ భూముల్లో చర్యలు తీసుకోవద్దు

హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు సోమవారం ఆ పిటిషన్‌పై విచారణ జరిపింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాల భూమిలో పిటిషనర్లు 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. పిటిషనర్లుగా ఉన్న నలుగురు రైతుల పాస్ పుస్తకాల్లో అధికారుల సంతకాలు లేవని, కొన్నేళ్లుగా అక్కడ వ్యవసాయం చేస్తున్నారు కాబట్టే తమ భూమి అంటున్నారని ఆయన హైకోర్టుకు తెలిపారు. ఆ భూమి ప్రభుత్వ భూమి అని అన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నలుగురు రైతుల భూముల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు జారీ చేసింది.

# పామాయిల్ పెంపకంతో రైతులకు మేలు



ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్, గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సునీల్ కటారియా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ఫ్యాక్టరీలోని ఉత్పత్తి విభాగాలు, ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు, నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించారు అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా వ్యవసాయానికి చిరునామాగా నిలిచిందని పేర్కొన్నారు. పాలేరు జలాశయం, నాగార్జునసాగర్ ఎడమ కాలువ, వైరా రిజర్వాయర్ వంటి సాగునీటి వనరులతో ఈ ప్రాంతం వ్యవసాయపరంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగు వైపు మళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు నాలుగు సంవత్సరాల్లో ఎకరాకు సుమారు రూ.52 వేల వరకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు దేశంలో వంట నూనెల అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో దిగుమతులపై ఆధారపడకుండా దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడం అత్యవసరమని భట్టి పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో వంటనూనెల దిగుమతుల కోసం భారీగా విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వస్తోందని, ఆయిల్ పామ్ సాగు పెరగడం ద్వారా ఈ పరిస్థితిని అధిగమించవచ్చని చెప్పారు.ఖమ్మంలో ఏర్పాటైన సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ రైతులకు, యువతకు వరంగా నిలుస్తుందని పేర్కొన్న ఆయన, రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మంలో మరిన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తుందని చెప్పారు. రైతులు పండించే పంటలకు స్థానికంగానే విలువ ఆధారిత ఉత్పత్తులు తయారైతే రైతుల ఆదాయం పెరగడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని అన్నారు. కొణిజెర్లను భవిష్యత్తులో రాష్ట్రంలోనే ప్రముఖ అగ్రో ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.113 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ సమీకృత కాంప్లెక్స్‌లో సీడ్ గార్డెన్, మిల్లింగ్ యూనిట్, రిఫైనరీ, పరిశోధన, నాణ్యత నియంత్రణ వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఉండటం దేశంలోనే ప్రత్యేకమన్నారు. ఈ కేంద్రం ద్వారా భవిష్యత్తులో ఆయిల్ పామ్ విత్తనాల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని, ఖమ్మం దేశానికే నాణ్యమైన ఆయిల్ పామ్ విత్తనాల కేంద్రంగా ఎదుగుతుందని భట్టి ఆశాభావం వ్యక్తం చేశారు.

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ....**

తెలంగాణను దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు మూడు లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, వచ్చే రెండు నుంచి మూడు సంవత్సరాల్లో దానిని 10 లక్షల ఎకరాలకు పెంచుతామని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు ఉండగా, త్వరలో మరో ఆరు ఫ్యాక్టరీలను ప్రారంభిస్తామని వెల్లడించారు.
ప్రతి 10 వేల ఎకరాల ఆయిల్ పామ్ సాగుకు ఒక ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, రైతులకు నాణ్యమైన మొక్కలు, సాంకేతిక సేవలు, శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు సీడ్ గార్డెన్, పరిశోధన కేంద్రం, శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ రైతులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారని, ఇతర పంటలతో పోలిస్తే అధిక ఆదాయం ఈ పంట ద్వారా వస్తోందన్నారు.
వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్–2047 విజన్‌లో భాగంగా వ్యవసాయ రంగ ఆర్థిక విలువను 40 బిలియన్ డాలర్ల నుంచి 400 బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల్లోనే రెండు లక్షల ఎకరాల కొత్త విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు ప్రారంభమైందని వివరించారు.
గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశం వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యానికి తెలంగాణ కీలకంగా మారిందన్నారు. గోద్రెజ్ అగ్రోవెట్ ఎండీ సునీల్ కటారియా మాట్లాడుతూ ఖమ్మంలో ఏర్పాటు చేసిన సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ద్వారా 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. త్వరలోనే ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీ, సీడ్ గార్డెన్‌ను కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు.

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కల నేడు సాకారమైందన్నారు. ఫ్యాక్టరీలో ఉద్యోగాల భర్తీలో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని గోద్రెజ్ సంస్థను కోరారు.
ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సుడా చైర్‌పర్సన్ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు, ఆయిల్ పామ్ రైతులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

**హైదరాబాద్,జూలై20(నినాదం):**



క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్ధిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు. ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలనీ తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. అజఖీఇ పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు వి టర్ల విస్తీర్ణంలో ప్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ప్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోవి టర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు. చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు. ఈ పథకం ఫెయిల్ అయితే విమర్శించాలని కొందరు సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇంటి కల నెరవేర్చాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలా ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రం తమ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఆ లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం ఒఎఉ ఇళ్లను నిర్మించిందని తెలిపారు. నగరంలో చాలాచోట్ల హౌసింగ్ బోర్డు కాలనీలు ఉన్నాయని ప్రస్తావించారు. ఎంత విలువైన భూమి అయినా పేదలకు ఇవ్వాలని తాము నిర్ణయించామని చెప్పుకొచ్చారు. పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతోందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతలో 16నియోజకవర్గాల్లో 7680 ఎ `లాట్లను నిర్మిస్తామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. క్యూర్ పరిధిలోని ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో స్థలం లేని పేదలు కిరాయి ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. అజఖీఇలో పేదలకు తమ ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే పథకాన్ని ప్రారంభించామని వెల్లడించారు. గత ప్రభుత్వం హౌసింగ్ విభాగాన్నే రద్దు చేసిందని చెప్పుకొచ్చారు. తాము దాన్ని పునరుద్ధరించామని అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ బోనాల ముందు అజఖీఇలో ఈ పథకం ప్రారంభించామని వెల్లడించారు.

# దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది

**న్యూఢిల్లీ,జూలై20(నినాదం):**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోదీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్`1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్`1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్`1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

## జెపి నడ్డాతో కాక్రోచ్ జనతా ప్రతినిధుల భేటీ

అయితే.. ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన హామీలు లభించలేదని, డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని వెల్లడించారు. జేపీ నడ్డాకు సమర్పించిన లేఖలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర విమర్శలు చేసింది సీజేపీ. నీట్ యజీ`2026 ప్రశ్నపత్రం లీకేజీ సహా ఇతర పరీక్షల నిర్వహణలో తలెత్తిన లోపాలకు మంత్రి బాధ్యత వహించాలని పేర్కొంది. సీబీఎసఈ 12వ తరగతి పోర్టల్ సమస్యలు, సీయ ఈటీ పరీక్షల్లో జాప్యం వంటి పరిణామాలు వంటివి కూడా వైఫల్యాలేనని ఆరోపించింది. పరీక్షల వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టడంలో ధర్మేంద్ర ప్రధాన్ విఫలమయ్యారని సీజేపీ పేర్కొంది. ఇకపోతే ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను విరమించారు. సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు సమావేశమయ్యారు. అనంతరం సోనమ్.. తన దీక్షను విరమించారు. దీంతో గత 23 రోజులుగా ఆయన చేస్తున్న దీక్ష ముగిసినట్లు అయింది. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్, విద్యావ్యవస్థలోని లోపాలు నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేపట్టారు. జూన్ 28వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆయన ఈ దీక్ష ప్రారంభించారు. అయితే ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద ఆయన చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అనంతరం ఆయన్ని సప్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆయన తన దీక్షను కొనసాగించారు. సోనమ్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులు ఆదివారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. కాక్రోచ్ పార్టీ జులై 20వ తేదీన చేపట్టిన చలో పార్లమెంట్ యాత్రకు కూడా ఆయన మద్దతు ప్రకటించిన విషయం విదితమే.

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం

**న్యూఢిల్లీ,జులై 20(నినాదం):**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజే ఉభయసభల్లో గందరగోళం ఏర్పడింది. విపక్ష సభ్యులు పలుమార్లు స్పీకర్ పోడియం వద్దకు చేరి నిరసన తెలిపారు. దీంతో వారిని స్పీకర్ ఓంబిర్లా వారించారు. అయితే ఉభయసభలు మధ్యాహ్నం 12 గంటలకు వరకు వాయిదా పడ్డాయి. వివిధ అంశాలపై విపక్షాలు లోక్‌సభలో ఆందోళన చేశాయి. నీట్ పేపర్ లీకేజీ, అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ అంశాలపై విపక్ష సభ్యులు నినాదాలు చేశాయి. ప్రశ్నోత్తరాల సమయాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. కానీ విపక్ష సభ్యులు మాత్రం తమ నినాదాలను ఆపలేదు. దీంతో స్పీకర్ ఓం బిర్లా అసహనానికి గురయ్యారు. సభలో మొదటి రోజే ఇలా సాగితే అది చెడు సంప్రదాయాన్ని సూచిస్తుందని అన్నారు. ఆయన సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. ఇక రాజ్యసభలోనూ ఇదే తరహా సీన్ రిపీటైంది. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై విపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడారు. నీట్ ఎగ్జామ్ స్కాండిల్‌పై మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారని, విద్యార్థులు నీట్ పరీక్ష పట్ల ఆందోళనకరంగా ఉన్నారని, లక్షలాది మంది పిల్లల భవిష్యత్తు గురించి తాను మాట్లాడబోతున్నట్లు చెప్పారు. నీట్ పరీక్ష లీకేజీ నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నారని, కానీ ఆ విద్యార్థులపై ప్రభుత్వం లాఠీఛార్జ్ చేస్తోందని ఆయన ఆరోపించారు. విద్యార్థులు స్వరాన్ని అణిచివేసేందుకు ప్రభుత్వం బలగాలను ఉపయోగిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల్ని చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్‌కు తెగించారని ఖర్గే ఆరోపించారు. ఈ క్రమంలో రాజ్యసభ కూడా వాయిదా పడింది. తిరిగి ప్రారంభం అయినా అదే పరిస్థితి నెలకొనడంతో మధ్యాహ్నం 2.30 గంల వరకు ఉభయసభలు వాయిదా పడ్డాయి.

# టీజీఎస్ ఆర్టీసీ వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబం

కార్మికుల సంక్షేమానికి
ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి
రూ. 90.85 లక్షల ఆర్థికసాయం





**కుత్బుల్లాపూర్, జులై 20 (నినాదం):** టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని, వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 (తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల) భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై. నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరపున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆ కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు. గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీలోని ప్రతి సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నెలకు రూ. 300 కోట్లు ఆర్టీసీకి విడుదల చేస్తోందని, ఈ పథకం వల్ల పనిభారం పెరిగినప్పటికీ సిబ్బంది ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లోనూ మహిళా ప్రయాణికుల కోసం కార్మికులు తమ సోదరులకు రాఖీ కట్టి మరీ విధులు నిర్వహించడం వారి నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు. కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని మంత్రి స్పష్టం చేశారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌలభ్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా సంస్థను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల అనంతరం నలుగురు మంత్రులు, అధికారుల కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే క్యూర్ ఏరియా పరిధిలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మిస్తామని, గ్రామాల నుండి రాజధాని వరకు కొత్త రూట్లలో బస్సులు నడుపుతూ, మెట్రో, ఎం ఎం టి ఎస్ సర్వీసులతో ఆర్టీసీని అనుసంధానం చేసి రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ పేదవాడి గుండె చప్పుడు అని, యాజమాన్యం తీసుకుంటున్న సంక్షేమ, అభివృద్ధి చర్యల్లో ఉద్యోగులంతా మరింత బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు సంస్థలోని సిబ్బంది అంతా ఏకతాటిపైకి వచ్చి రూ. 90.85 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందించడం ఆర్టీసీ ఉద్యోగులలో ఉన్న అంతర్గత బంధానికి, పరస్పర సహకారానికి ఒక గొప్ప నిదర్శనమన్నారు. సాయం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్క ఉద్యోగికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఒక ఉద్యోగి కష్టంలో ఉంటే మొత్తం సంస్థ అండగా నిలవాలనే గొప్ప సంస్కృతి టీజీఎస్ ఆర్టీసీ సొంతమని, ఈ కార్యక్రమం ఆ విలువలను మరోసారి చాటిచెప్పిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కట్టుబడి ఉందని, సిబ్బందికి అవసరమైన భద్రత, శిక్షణ, పని పరిస్థితుల మెరుగుదల కోసం నిరంతర చర్యలు తీసుకుంటున్నామని ఎండీ స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని, ప్రతి డ్రైవర్, కండక్టర్ అత్యంత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సంస్థ ఆర్థిక బలోపేతంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కూడా సమానంగా ముఖ్యమని యాజమాన్యం విశ్వసిస్తోందని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తాము అందుబాటులో ఉంటామన్నారు. ప్రయాణికులకు నాణ్యమైన, సురక్షితమైన, సమయపాలనతో కూడిన సేవలు అందించేందుకు డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ టికెటింగ్, బస్సుల ఆధునీకరణ వంటి ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. సంస్థ అభివృద్ధికి ఉద్యోగుల క్రమశిక్షణ, సేవాభావం, టీమ్‌వర్క్ అత్యంత అవసరమని, ప్రతి ఉద్యోగి సంస్థ ప్రతిష్ఠను పెంచేలా ప్రజలకు సేవలు అందిస్తే టీజీఎస్ ఆర్టీసీ దేశంలోనే ఆదర్శవంతమైన ప్రజా రవాణా సంస్థగా ఎదుగుతుందని ఎండీ నాగిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దివంగత కోల శంకర్ సతీమణి హేమలత మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ కుటుంబానికి అండగా నిలిచి సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబాన్ని నిలబెడుతున్న ఆర్టీసీ ఉద్యోగులకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న తన భర్త శంకర్‌గౌడ్ కోరికను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ( ఈ డి ఎస్ ) సిహెచ్. వెంకన్న, రాజశేఖర్, సోలోమన్, ఏచూరి శ్రీధర్, ఫైనాన్షియల్ అడ్వైజర్ (ఎఫ్ ఏ) విజయపుష్ప, సీపీఎం ఉషాదేవి, సీటీఎం శ్రీదేవి, సీసీఓఎస్ ప్రభులత, సీఎంఈ జనీరెడ్డి, ఆర్టీసీ యూనియన్ నాయకులు, పలువురు ఉన్నతాధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# గాయత్రి షుగర్స్ లిమిటెడ్

GAYATRI

రిజిస్టర్డ్ & కార్పొరేట్ కార్యాలయం: బి-2, 2వ అంతస్తు, 6-3-1090, టి.ఎస్.ఆర్. టవర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్ - 500082. TG, IN

టెలి: 040-23414823 /4826 ఇ-మెయిల్: gayatrisugars@gmail.com

CIN: L15421TG1995PLC020720

## పోస్టల్ బ్యాలెట్ మరియు ఇ-ఓటింగ్ నోటీసు

కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 108 & 110, కంపెనీల (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014లోని రూల్స్ 20 & 22, వాటి సవరణలతో సహా, మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 44, ఎప్పటికప్పుడు సవరించబడిన విధంగా, వాటికి అనుగుణంగా సభ్యులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. 8 ఏప్రిల్, 2020, 13 ఏప్రిల్, 2020, 5 మే, 2020 తేదీల సాధారణ సర్క్యులర్‌లు మరియు ఇతర సంబంధిత సర్క్యులర్‌ల ప్రకారం, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ("MCA") జారీ చేసిన ఇటీవలి సాధారణ సర్క్యులర్ 22 సెప్టెంబర్, 2025 గలది ("MCA సర్క్యులర్‌లు"), మరియు SEBI (LODR) రెగ్యులేషన్స్, 2015తో కలిపి చదివిన ప్రకారం, పోస్టల్ బ్యాలెట్ ద్వారా సభ్యుల ఆమోదం కోరడం కొరకు, కంపెనీ ఈ క్రింది వాటి కోసం డిపాజిటరీ పార్టిసిపెంట్ల రికార్డులలో ఇ-మెయిల్ ఐడీలు నమోదు చేయబడిన సభ్యులకు, కటాఫ్ తేదీ శుక్రవారం, 10 జూలై 2026 నాటికి, వివరణాత్మక ప్రకటనతో కూడిన పోస్టల్ బ్యాలెట్ నోటీసును సోమవారం, 20 జూలై 2026న ఎలక్ట్రానిక్ విధానం ద్వారా పంపించడాన్ని పూర్తి చేసింది :

| క్ర.సం. | వివరాలు | తీర్మానం రకం |
|---|---|---|
| 1 | శ్రీమతి సరితా దండా (DIN: 11732470) గారిని కంపెనీ స్వతంత్ర డైరెక్టర్‌గా నియమించడాన్ని పరిశీలించి, ఆమోదించడం | ప్రత్యేక తీర్మానం |

MCA జారీ చేసిన సాధారణ సర్క్యులర్ల ప్రకారం, కంపెనీ పోస్టల్ బ్యాలెట్ నోటీసు మరియు పోస్టల్ బ్యాలెట్ ఫారం యొక్క హార్డ్ కాపీని పంపలేదు, కానీ తన సభ్యులు NSDL ఇ-ఓటింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఎలక్ట్రానిక్‌గా తమ ఓట్లను వేయడానికి వీలుగా వారికి ఇ-ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించింది. ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటింగ్ మంగళవారం, 21 జూలై 2026 ఉ. 09:00 గంటలకు (09:00 గంటలు IST) ప్రారంభమై, బుధవారం, 19 ఆగస్టు 2026 సా. 5:00 గంటలకు (17:00 గంటలు IST లకు) ముగుస్తుంది. పోస్టల్ బ్యాలెట్/ఇ-ఓటింగ్ ప్రక్రియను నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా నిర్వహించడానికి, డైరెక్టర్ల బోర్డు ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీ (CP నెం. 7427) అయిన శ్రీ వై. కోటేశ్వర రావును పరిశీలకుడిగా నియమించింది. ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటింగ్ బుధవారం, 19 ఆగస్టు 2026 సా. 5:00 గంటలకు ముగుస్తుందని సభ్యులు గమనించగలరు. కటాఫ్ తేదీ అయిన శుక్రవారం, 10 జూలై 2026 నాటికి మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు, ఆ తేదీ తర్వాత ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటింగ్ అనుమతించబడదు. పోస్టల్ బ్యాలెట్ నోటీసును అందుకోని ఏ సభ్యుడైనా cs.gsl@gayatri.co.in కు ఇ-మెయిల్ పంపవచ్చు లేదా info@vccipl.com వద్ద కంపెనీ రిజిస్ట్రార్ మరియు షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్‌కు దరఖాస్తు చేసుకొని డూప్లికేట్ పోస్టల్ బ్యాలెట్ నోటీసును పొందవచ్చు. పోస్టల్ బ్యాలెట్ నోటీసును మా వెబ్‌సైట్ www.gayatrisugars.com నుండి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా జరిగిన ఓటింగ్ ఫలితాన్ని, ఇ-ఓటింగ్ ముగిసిన రెండు పనిదినాలలోగా, అనగా 21 ఆగస్టు 2026న లేదా అంతకు ముందు, కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయంలో ప్రకటించడం జరుగుతుంది. అంతేకాకుండా, ఈ ఫలితాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీలు, రిజిస్ట్రార్ మరియు షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్‌కు తెలియజేయడంతోపాటు, కంపెనీ వెబ్‌సైట్ www.gayatrisugars.com లో కూడా ప్రదర్శించడం జరుగుతుంది. రిమోట్ ఇ-ఓటింగ్‌తో సహా పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు / ఫిర్యాదులు ఉంటే, వాటాదారులు కంపెనీని cs.gsl@gayatri.co.in వద్ద లేదా షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్‌ను info@vccipl.com వద్ద సంప్రదించవచ్చు.

బోర్డు ఆదేశానుసారం
గాయత్రి షుగర్స్ లిమిటెడ్ తరపున
సం/- టి. సరితా రెడ్డి,
మేనేజింగ్ డైరెక్టర్
DIN 00017122

తేదీ: 20 జూలై, 2026
ప్రదేశం : హైదరాబాద్



## BRANCH SHIFTING

మా విలువైన కస్టమర్ల కోసం, మా
SECUNDERABAD – LALAPET
బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి 22.10.2026 నుండి మార్చబడుతుంది. నూతన చిరునామా క్రింద ఇవ్వబడినది;

Muthoot Finance Ltd
Elevated Ground Floor, H NO:-12-41-21, Lalapet, Beside Lalapet Fly Over, Lalapet, Secunderabad, Hyderabad District, Telangana State, Pin - 500017.
Phone No : 9188903672, 9567262362.
Email id : mglal3440@muthootgroup.com

"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".

మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.

Muthoot Finance
A Muthoot M George Enterprise

## BRANCH SHIFTING

మా విలువైన కస్టమర్ల కోసం, మా
UPPAL - SARASWATHI NAGAR
బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి 22.10.2026 నుండి మార్చబడుతుంది. నూతన చిరునామా క్రింద ఇవ్వబడినది;

Muthoot Finance Ltd
Elevated Ground Floor,
H NO:-2-1-1/38 & 44/NC, LN Complex, Main Road, Uppal, Hyderabad, Pin - 500039, State Telangana State.
Phone No : 09188903664.
Email id : mgsar3112@muthootgroup.com

"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".

మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.

Muthoot Finance
A Muthoot M George Enterprise


# ఎల్‌నోవా ప్రభావంతో ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..

- జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**నల్లగొండ ప్రతినిధి, జులై 20( నినాదం):** ఎలనినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలు తాగునీరు, విద్యుత్తు, వ్యవసాయం, తదితర విషయాల్లో ఇబ్బందులు పడకుండా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలోని ఉదయాదిత్య భవన్లో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే సంసిద్ధత, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, తదితర అంశాలపై ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహిస్తూ ఎల్ నినో వల్ల ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎల్ నినో వల్ల రాబోయే రోజుల్లో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నందున ప్రత్యేకించి వ్యవసాయం, సాగునీరు, తాగునీరు అన్నింటికి సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. రాబోయే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు అన్ని రకాలుగా ప్రజలకు అండగా నిలబడాలని, ముఖ్యంగా రైతులు పంటల మార్పిడి, ఆరుతడి పంటల వైపు వెళ్లేలా అవగాహన కల్పించాలని, ప్రస్తుతం వేసుకున్న పంటలు కాపాడేందుకు ప్రయత్నించాలని, వర్షపాతంపై ఎప్పటికప్పుడు ప్రజలను, రైతులను అప్రమత్తం చేసి నష్టపోకుండా చూడాలని, భూగర్భ జల, వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇది వరకే వరి వేసుకున్న రైతులను ఆదుకునే విధంగా చూడాలని, సాగునీటి కోసం ప్రత్యేకంగా బోర్లు వేయకుండా నియంత్రించాలని, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే పరిస్థితులను ఎదుర్కోవడంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా ప్రజలకు అండగా నిలబడాలని కోరారు. ఎల్ నినో వల్ల ఏర్పడ్డ కరువు పరిస్థితులతో ప్రజలు అధైర్య పడవద్దని, రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, కరువు పరిస్థితిలో ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని, ఎస్ఎల్ బిసీ 600 మీటర్లు పూర్తయిందని, ఆగస్టు 2028 నాటికి ఎస్ఎల్బీసీ పూర్తి అయితే ఉమ్మడి నల్గొండ జిల్లా మొత్తం సస్యశ్యామలమవుతుందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాగునీటిని దృష్టిలో ఉంచుకొని ఉదయ సముద్రం లో నీళ్లు నింపాలని, మూసి నుండి తిప్పర్తి మండలానికి సాగునీటిని వదలాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవరకొండ నియోజకవర్గం లోని మూడు మండలాలలో తాగునీటి సమస్య గడిచిన మూడు నెలలుగా ఉన్నందున అక్కడ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమస్యను పరిష్కరించాలని, వెంటనే గ్రామాల ప్రజలకు తాగునీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. నల్గొండ నియోజకవర్గంలో ఇదివరకే వరి నాట్లు వేసుకున్న రైతులకు ఓవర్ లోడ్ కాకుండా అవసరమైతే అదనపు పవర్ కు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించాలని ,బడ్జెట్ మెటీరియల్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ,లో వోల్టేజ్ ఉన్నచోట ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, ఇప్పటి వరకు వేసిన పంటలు కాపాడాల్సిన అవసరం ఉందని, ఇందుకు ప్రతిరోజు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య శాసనసభ్యులు మందుల సామేలు జైవీర్ రెడ్డి కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి రెడ్డి , దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్, సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రభుత్వ విప్ , నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, స్పెషలాఫీసర్, రాష్ట్ర కార్మిక మరియు ఉపాధి కల్పన సెక్రటరీ దాసరి హరిచందన, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్లు, నల్గొండ రెవెన్యూ, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ యా జిల్లాల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయం, నీటిపారుదల, ఉద్యాన, విద్యుత్తు, మిషన్ భగీరథ ,భూగర్భ జల ,గ్రామీణ అభివృద్ధి, పశుసంవర్ధక శాఖలపై సమీక్షించారు.

# రోడ్డు విస్తరణలో ధ్వంధ్వ ప్రమాణాలా..?

40 అడుగుల స్థానంలో 35 అడుగుల నిర్మాణం

రోడ్డు విస్తరణలో అవకతవకలపై విచారణ జరపాలి



**పెబ్బేరు, జులై 20 (నినాదం):** పెబ్బేరు--వనపర్తి ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ రోడ్డు విస్తరణలో స్థలాలు, ఇళ్లు కోల్పోయిన బాధితుల తరపున సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్"కు, వి. శ్రీధర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. రహదారికి ఇరువైపులా 40 అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినప్పటికీ, కొందరు అధికారుల నిర్లక్ష్యం, అక్రమాలకు పాల్పడటంతో ఒకవైపు మాత్రమే 35 అడుగుల మేర పనులు చేపడుతున్నారని ఆరోపించారు. బాధితుల కథనం ప్రకారం, పెబ్బేరు సుభాష్ చౌక్ నుంచి ఎడమవైపు పి.జె.పి. కెనాల్ వరకు డ్రైనేజీ, రహదారి నిర్మాణ పనులు 40 అడుగుల మేర పూర్తి చేశారు. అయితే కుడివైపు సుభాష్ చౌక్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు 40 అడుగులుగా పనులు చేపట్టిన అధికారులు, అక్కడి నుంచి పి.జె.పి. కెనాల్ వరకు మాత్రం 35 అడుగులకు కుదించి నిర్మాణం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్, టీపీఓ, ఏఈ, ఆర్అండ్‌బీ ఏఈలు కొందరు ప్లాట్లు, ఇళ్ల యజమానులతో కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగానే కొలతలు మార్చి రహదారి విస్తరణను 35 అడుగులకు పరిమితం చేశారని బాధితులు ఆరోపించారు. దీంతో రోడ్డు విస్తరణలో ఇప్పటికే స్థలాలు కోల్పోయిన తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు

# కోదాడలో కరపత్రాల రాజకీయం..

## ఉత్తమ్‌కు మల్లయ్య సవాల్!




**కోదాడ ప్రతినిధి (నినాదం):** మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ "ఉత్తమ్.. బహిరంగ చర్చకు సిద్ధమా!" పేరుతో కరపత్రాలను విడుదల చేసి కోదాడ నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా పంపిణీ చేశారు. కోదాడ అభివృద్ధి, రైతు సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, ఎన్నికల హామీల అమలు తదితర అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని కరపత్రం ద్వారా సవాల్ విసిరారు. ఆదివారం ఉదయం వివిధ దినపత్రికల ద్వారా కరపత్రాలను గ్రామాల్లో పంపిణీ చేయడంతో ప్రజలు ఆసక్తిగా చదువుతూ చర్చించుకుంటున్నారు. దీంతో కోదాడ నియోజకవర్గంలో ఈ కరపత్రాలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.


IN THE COURT OF THE HON'BLE ADDITIONAL JUNIOR CIVIL JUDGE: IBRAHIMPATNAM RANGA REDDY DISTRICT.AT: IBRAHIMPATNAM
OS.No. 140 OF 2026

BETWEEN:
1.Dandetikar Bharathi Bai W/o. Late. Narsingh Rao, aged about 55 years, Occ: House-wife, (Aadhar No.380656949364).
2.Jamalpur Praveena W/o. J.P.Mahender, (D/o. Late. Narsingh Rao) aged about 39 years, Occ: House-wife, R/o. Plot.No.57, H-No.7-233/5/B, Tirumala Hills Colony, Ibrahimpatnam Municipality, Ranga Reddy District-501506. (Aadhar No.472579608179).
3.Dandetikar Rajesh S/o. Late. Narsingh Rao, aged about 36 years, Occ: Business, (Aadhar No. 905845479785).
4.Dandetikar Mahesh S/o. Late. Narsingh Rao, aged about 34 years, Occ: Business, (Aadhar No. 620869351840). Plaintiff's No.1 & 3, 4 are R/o. H-No.1-98/C, Manchal Village and Mandal, Ranga Reddy District.
......Plaintiffs.

AND

1.The Tahasildar Manchal.
2.All Concerned. ...... Defendants.

NOTICE

Please take notice that the above mentioned case Plaintiffs **Dandetikar Bharathi Bai** & Others filed suit for Declaration. The Plaintiffs to declare that the legal heirs of **Late. Dandetikar Narsingh Rao**. The above said case has been posted on **03.08.2026** All concerned if anybody has got any bjection or claim in respect of the above matter may appear before the above Court at, **10.30** am and file objection in accordance with law. Failing such appearance, the matter shall be proceeding with as per law.

"BY ORDER OF THE COURT"
**M/s. J.P.MAHENDER,** Advocate,
# Plot No.57,H-No.7-233/5/B, Tirumala Hills Colony, Ibrahimpatnam Municipality, Ranga Reddy Dist-501506.
Cell:9912546709

IN THE COURT THE HON'BLE Addl JUNIOR CIVIL JUDGE CUMVII Addl MMRANGA REDDY DISTRICT, AT: HAYATHNAGAR
O.S.NO.326 OF 2026

BETWEEN:
MANDHA PADMA And others ... PLAINTIFFS

AND

THE TAHSILDAR, Abdullapurmet Mandal And another ... DEFENDANTS
D-2 ALL CONCERNED

PUBLIC NOTICE

The Plaintiffs had filed the above suit for Declaration to Declare themas legal heirsof deceased Mandha Srinivas Reddy who died on **24.05.2025** and successorsof SuitSchedule Property i.e., Open Plot **No.86**, admeasuring 200 sq.yds or 167.23sq. mts in Sy. Nos.274, 285, situated at Turkayamjal Village, Abdullapurmet Mandal (erst while Hayathnagar Mandal), Ranga Reddy District and bounded on North: Plot No.87, South: Plot No.85, East: 25 Feet Wide Road, West: Plot No.97. The Hon'ble Court waspleased to order for publication of this notice for your appearance in the abovesuitand the matter is posted to **27.08.2026 at 10.30 a.m.** Therefore, you may appearbefore the Hon'ble Court either personally or through your authorized counsel orotherwise the matter will be adjudicated in due process of Law.

(BY ORDER OF THE COURT)
Sd/-
**M.RAMA KRISHNA, M.CHETHAN,** Advocates,
# 7-4-12/27, Thirumala Colony, Sagar Ring Road, Bairamalguda, L.B.Nagar, Hyderabad


# ప్రభుత్వం కరువు నివారణలో పూర్తిగా విఫలం


- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



**నల్గొండ ప్రతినిధి, జులై 20 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమైందని, పాలకులకు చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శించారు. సోమవారం నల్గొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో 15 రోజుల్లో రాష్ట్రంలోని రిజర్వాయర్లలో ఉన్న నీరు పూర్తిగా అయిపోతుందని, గోదావరి నదిలో నుంచి సముద్రంలోకి వృథాగా వెళ్తున్న నీటిని వినియోగించుకునే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో తీవ్ర కరువు పరిస్థితుల్లో కూడా నాగార్జునసాగర్ కింద రైతులకు సాగునీరు అందించామని గుర్తు చేశారు. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా కూడా సక్రమంగా జరగడం లేదని, విద్యుత్‌ను రోజుకు 12 గంటలు కూడా సరిగా అందించడం లేదని ఆరోపించారు. 2014కు ముందు ఉన్న దుర్భిక్ష పరిస్థితులు మళ్లీ రాష్ట్రంలో కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు నాగార్జునసాగర్ నుంచి భారీగా నీరు తరలిపోయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని, నల్గొండతో పాటు హైదరాబాద్‌కు కూడా తాగునీటి ఎద్దడి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం ఆలస్యంగా మేల్కొని ఇప్పుడు జిల్లా సమీక్షల పేరుతో హడావుడి చేస్తోందని విమర్శించారు. రైతులకు ఇంకుడు గుంతలు, ఫామ్‌పాండ్లు తవ్వాలని చెప్పి మభ్యపెడుతున్నారని, విత్తనాలు, ఎరువుల కొరతపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేసిన జగదీష్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. తాను ఉపయోగించిన ల్యాప్‌టాప్, సిస్టమ్‌ను ఇస్తే కాళేశ్వరం ప్రాజెక్టు సామర్థ్యం, కన్నెపల్లి పంపులను ఆన్ చేసి నీటిని అందించే అవకాశాలు, ఎస్సారెస్పీతో పాటు ఇతర ప్రాంతాలకు నీటిని అందించగలమని ఆధారాలతో నిరూపిస్తానని సవాల్ విసిరారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు బాగానే ఉన్నాయని, వాటిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం విద్యుత్ బిల్లుల భారం పేరుతో పక్కన పెట్టి రైతులను బలి చేస్తున్నారని విమర్శించారు. బస్వాపూర్ వరకు నీటిని అందించగలమని, కన్నెపల్లి రిజర్వాయర్‌ను తమకు అప్పగిస్తే చేసి చూపిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వందల టీఎంసీల నీటిని సముద్రంలోకి వదిలేసిందని, ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ సమావేశంలో శాసనమండలి సభ్యులు ఎంసీ కోటి రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్ట మల్లికార్జున్ రెడ్డి, నల్గొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్, సింగం రామ్మోహన్, అభిమన్యు శ్రీనివాస్, మారగొని గణేష్, పెరిక యాదయ్య, పేర్ల అశోక్, రత్నగిరి శ్రీనివాస్, కుందూరు ప్రవీణ్ రెడ్డి, బాణావత్ దీప్లా, దొడ్డి రమేష్, రావుల శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ జాఫర్, కొండూరు సత్యనారాయణ, బొజ్జ వెంకన్న, మెరుగు గోపి, కందుల లక్ష్మయ్య, బొజ్జ శ్రీనివాస్, కోట్ల జయపాల్ రెడ్డి, బొమ్మరబోయిన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


# పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

- సర్పంచ్ పెదపంగ సైదులు



**వేములపల్లి, జులై 20 (నినాదం):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని శెట్టిపాలెం గ్రామ సర్పంచ్ పెదపంగ సైదులు అన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి మొక్కలను విరివిగా నాటాలని కోరారు. సోమవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఆయన పర్యటించి, ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న తీవ్ర వాతావరణ మార్పులకు విచ్చలవిడిగా చెట్లను నరికివేతయే ప్రధాన కారణమన్నారు. పర్యావరణంలో సమతుల్యత ఏర్పడి, సకాలంలో వర్షాలు కురవాలన్నా, పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించాలన్నా చెట్ల పెంపకం ఒక్కటే సరైన మార్గమని స్పష్టం చేశారు. అందుకే గ్రామంలోని ప్రతి ఇంటా కనీసం నాలుగు మొక్కల చొప్పున నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామీణ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని మొక్కల పంపిణీని ముమ్మరంగా నిర్వహించారు. ఉప సర్పంచ్ కంచర్ల సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్‌రెడ్డి, వార్డు సభ్యులు ఎర్రబెల్లి చంటి, బంటు శ్రీను, మజ్జిగపు శ్యామల, పెంటమల్ల సుకన్య, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, పెదపంగ సంపత్ పాల్గొన్నారు.

# సదాశివపేట లో జగన్నాథ రథయాత్రను ప్రారంభించిన డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి బ్యూరో , జులై 20 ( నినాదం ):** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. ఈ రథయాత్ర సదాశివపేట దుర్గమ్మ గుడి నుండి ప్రారంభమై శాస్త్రి రోడ్, హైవే, సుభాష్ రోడ్, గాంధీ చౌక్ మీదుగా బసవ సదన్ వరకు సాగింది. రథం కదిలిన వెంబడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జగన్నాథ్ కీ జై' అంటూ హరినామ స్మరణ చేశారు. యాత్ర పొడవునా భక్తులు చేసిన భజనలు, ఆధ్యాత్మిక నాట్యాలు, సంకీర్తనలతో పట్టణ వీధులన్నీ భక్తిపారవశ్యంతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వీక్షకులను అలరించాయి. భక్తులకు ఎక్కడికక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. సదాశివపేట పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తూ, ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను నిర్మలా జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం లో సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లె అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, నాయకులు సత్యనారాయణ, పృథ్వీ రాజ్, ఇస్కాన్ ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం బొడ్రాయికి మహిళల ప్రత్యేక పూజలు



**కోదాడ, జులై 20 (నినాదం):** అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామ బొడ్రాయికి సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపూర్వకంగా మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి మంచి వర్షాలు కురవాలని ప్రార్థనలు చేశారు.

## ఆగస్టు 3లోగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలి

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ జూలై 20 (నినాదం):** నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిని పరిశీలించిన ఆయన, అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఓటరికి ఈ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించాలని, ఆగస్టు 3వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించకపోతే వారి వివరాలు ఓటర్ల జాబితాలో నమోదు కాకపోవచ్చనే విషయాన్ని ప్రతి ఓటరికి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా నమోదు ప్రక్రియకు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు డిజిటలైజేషన్ ప్రక్రియలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, అనర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగకుండా చూడడంతో పాటు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటరు నమోదు (డూప్లికేట్ నమోదు) జరగకుండా అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేలా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్డీవో అర్పన, బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో, బీఎల్‌వోలు, డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న అధికారులు తదితరులు ఉన్నారు.

### బ్యాంకుల వద్ద అమాయక ప్రజలను

## మోసం చేసే వారిపై అప్రమత్తత

**బాన్సువాడ పోలీసుల ఆకస్మిక తనిఖీలు, అవగాహన కార్యక్రమం**



**కామారెడ్డి రూరల్ జూలై 20 (నినాదం):** బాన్సువాడ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తులా శ్రీధర్ పోలీసు సిబ్బందితో కలిసి బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ బ్యాంకుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల భద్రత దృష్ట్యా బ్యాంకు పరిసరాలను పరిశీలించారు. ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తుల వివరాలను అవసరమైన మేరకు పరిశీలించారు, వారి రాకపోకల ఉద్దేశ్యాన్ని ఆరా తీశారు. అదేవిధంగా బ్యాంకుల బయట పార్కింగ్ చేసిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం బ్యాంకుల వద్ద అమాయక ప్రజలను మాటల్లో పెట్టి మోసాలకు పాల్పడే వారిపై అప్రమత్తత పెంచడం. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చదువురాని లేదా అమాయక ఖాతాదారులను లక్ష్యంగా చేసుకుని నగదు ఉపసంహరణ సమయంలో సహాయం పేరుతో మోసాలకు పాల్పడే ఘటనలను నివారించేందుకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకులకు వచ్చిన ప్రజలకు నగదు డ్రా చేసిన తర్వాత అపరిచితుల సహాయం తీసుకోవద్దని, ఏటీఎం పిన్, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని సూచించారు. తాము బ్యాంకు అధికారులము లేదా సైబర్ అధికారులు అని చెప్పి ఫోన్ చేసే వ్యక్తులను నమ్మవద్దని, అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలకు స్పందించవద్దని వివరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రజల భద్రత కోసం బ్యాంకుల్లో జరిగే చోరీలు, మోసాలు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఇన్‌స్పెక్టర్ తులా శ్రీధర్ తెలిపారు. బ్యాంకులకు వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి వ్యాఖ్యలపై

## వినయ్ కుమార్ రెడ్డి మండిపాటు

**హామీలు విస్మరించి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు**



**ఆర్మూర్ , జులై 20 (నినాదం) :** బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఎన్నికల హామీలను విస్మరించి, రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఎమ్మెల్యే ఇటీవల చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఛలో అంకాపూర్ వెళ్లేందుకు సిద్ధమైన వినయ్ కుమార్ రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాకేష్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలతో రాజకీయ సంస్కృతిని దిగజారుస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రూపాయికే వైద్యం, ప్రతి గ్రామంలో పేదలకు పది ఉచిత ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై విమర్శలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తుంటే, వాటిని జీర్ణించుకోలేక బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అన్ని గ్రామాల విద్యార్థులకు అందుబాటులో ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సి ఉండగా, స్వప్రయోజనాల కోసం అంకాపూర్ వైపు తరలించారని ఆరోపించారు. దీనివల్ల వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడిగా నరేష్ చారి



**నాగర్ కర్నూల్ జులై 20 (నినాదం) :** నాగర్ కర్నూల్ జిల్లా భారతీయ జనతా యువమోర్చ అధ్యక్షునిగా రాష్ట్ర నాయకత్వం దన్నోజు నరేష్ చారి ని నియమించడం జరిగింది. గత 16 సంవత్సరాలుగా ఏబీవీపీ నాయకునిగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా బీజేపీ యువ నాయకుడిగా పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ యువకులకు ఆదర్శంగా నిలవడమే కాక పార్టీ కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. సామాన్య కార్యకర్తగా మొదలైన తన ప్రయాణం అంచలంచలుగా ఎదిగి భారతీయ జనతా యువమోర్చా కార్యదర్శిగా రెండు పర్యాయాలు సోషల్ మీడియా కనెక్టర్ గా నేడు యువ మోర్చా అధ్యక్షునిగా ఎన్నిక కావడం జరిగింది. గతంలో అనేక సేవా కార్యక్రమాలు చేసినప్పటికీ కరోనా కష్ట సమయంలో పేదలకు చేసిన సహాయ సహకారాలు విద్యార్థులకు ఆర్థిక సహాయం దేవాలయాలకు తన వంతు సహాయ సహకారాలు అందించడం లాంటి కార్యక్రమాలు చేసి భారతీయ జనతా పార్టీ జెండాను అన్ని గ్రామాలకు చేరవేయాలనే దృఢ సంకల్పాన్ని గుర్తించిన బిజెపి రాష్ట్ర నాయకత్వం నాగర్ కర్నూల్ జిల్లా భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షునిగా నియమించింది ఈ సందర్భంగా నరేష్ చారి మాట్లాడుతూ. పార్టీ తమ పై నమ్మకం ఉంచి ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ పార్టీని నా వంతు కృషిగా ముందుకు తీసుకెళ్లి విద్యార్థుల పేద ప్రజలకు అండగా ఉంటూ బిజెపి యువమోర్చా ను జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేస్తానని పూర్తి సమయాన్ని ప్రజలకు కేటాయిస్తూ ప్రజల సమస్యల పై నిరంతరం పోరాడుతూ జిల్లాలో తిరుగులేని శక్తిగా బిజెపిని నిలబెట్టడమే తన లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో బీజేవైఎం ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రభుత్వం ప్రజలకు యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గత పది సంవత్సరాలు బి ఆర్ఎస్ చేసిన అవినీతిని ప్రజలకు ఎండగట్టనున్నామని అన్నారు. నాకు ఈ బాధ్యత రావడానికి సహకరించిన బిజెపి జిల్లా రాష్ట్ర నాయకులకు అందరికీ పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


## 22న గద్వాలలో జాబ్ మేళా

**గద్వాల బ్యూరో, జులై 20 (నినాదం ):** నిరుద్యోగ యువతకు గద్వాల, ఐజ, మహబూబ్ నగర్, హైదరాబాద్ లోని పలు కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించుటకు ఈ నెల 22న ఉదయం 11:00 గంటలకు ఐడిఓసి లోనీ తమ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండి, పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీటెక్, తదితర విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులకు అవసరమైన శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. పుష్కళ్ అగ్రోటెక్ లిమిటెడ్, పిఎంకెకే, ఆర్ సెటి గద్వాల, జిడిఏ సెక్యూరిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు పాల్గొని ప్రతిభగల నిరుద్యోగులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారన్నారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# సమయపాలన పాటించని అధికారులు...!

### సర్ సర్వేపై చిత్తశుద్ధి లేని అధికారులు

**కార్యాలయం ముందు పడి కాపులు కాస్తున్న ప్రజలు.. సిబ్బంది లేక వేలవేల పోతున్న రెవెన్యూ కార్యాలయం...**



**ఆర్మూర్, జులై 20(నినాదం ):** బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన ఏర్గట్ల గ్రామంలో గల రెవెన్యూ కార్యాలయం లో ఏ ఒక్క అధికారి గాని సిబ్బంది గాని సమయపాలన పాటించకపోవడం, కార్యాలయానికి వచ్చే ప్రజలు సైతం అధికారుల తీరు పట్ల ఆగ్రహాలు వ్యక్తం చేస్తున్నారు. 11 గంటలు దాటిన ఉదయం వేళ రెవెన్యూ కార్యాలయం తెరిచి ఉన్నప్పటికీ ఏ ఒక్క అధికారి గాని సిబ్బంది గాని లేకపోవడంతో, కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ విద్యార్థులకు సర్టిఫికెట్ లు, ఇతరాత్ర పనుల నిమిత్తం వచ్చే ప్రజలు చేసేదేమీ లేక తిరుగు ముఖం పడుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఏ ఒక్క అధికారి లేరు అని అడిగితే సర్ సర్వే అని చెప్పడం అధికారులకు పరిపాటిగా మారిందని స్థానికులు రెవెన్యూ అధికారుల పేర్లు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారుల కోసం పాడి కాపులు కాస్తూ వేచి చూస్తున్నారు. ఇసుక మొరం మట్టి అనే వాటి పైనే అధికారులకు దృష్టి ఉండడంతో ఇతరత్రా పనులపై చిత్తశుద్ధి లేదని స్థానికులు వాపోతున్నారు. సమయపాలన పాటించని, మరోపక్క సర్ సర్వే కొనసాగుతున్న చిత్తశుద్ధి లేని అధికారులపై, ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండేలా, అప్పటికే రైతులు సైతం పట్టా పాస్ బుక్ ల కోసం విచ్చేసి తిరుగు ముఖం పట్టారు. ప్రస్తుతం విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు అందించేలా చర్యలు చేపట్టి ఆదుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులు, రైతులు, స్థానికులు కోరుతున్నారు.




## పత్రికా విలేకరులపై దాడి అత్యంత బాధాకరం

**బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి**



**నారాయణపేట ప్రతినిధి, జులై 20, (నినాదం):** నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న విషయం తెలుసుకొని ఫోటోలు తీసుకునేందుకు అక్కడికి వెళ్లిన ఓ పత్రిక విలేకరి డి. రాము, జిల్లా ఫోటోగ్రాఫర్ తాహేర్ పై ఇసుక మాఫియా దాడికి పాల్పడడం అత్యంత బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అత్యంత విలువైన హక్కు అని తెలిపారు. సమాజానికి నిజమైన సమాచారాన్ని అందించేందుకు విధులు నిర్వహిస్తున్న పత్రికా విలేకరులపై జరిగిన దాడి అత్యంత బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టులకు తగిన భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను కోరుతున్నామన్నారు. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జర్నలిస్టులపై దాడులను ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యులపై నిష్పాక్షిక విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## మీ సేవ కేంద్రం మంజూరుకు కృషి చేయాలి.

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీని కలిసిన కాంగ్రెస్ నాయకులు.



**కామారెడ్డి రూరల్ జూలై 20 ( నినాదం ) :** బీబీపేట్ మండలంలోని మాందాపూర్ గ్రామంలో మీ సేవ కేంద్రం మంజూరు కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ కి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రొడ్డ రాజు తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, రైతులు, మహిళలు ఆయా సర్టిఫికెట్లు నమోదుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు రాష్ట్ర ప్రభుత్వం యూరియాను యాప్ ద్వారా అందిస్తుందని గ్రామంలో స్మార్ట్ ఫోన్ లేని రైతులు యూరియా నమోదుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వివరించామన్నారు అనంతరం వార్డ్ సభ్యులు శివనూరి నర్సింలు, రొడ్డ లావణ్య బాబు లతో కలిసి గ్రామంలో పలు వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశామన్నారు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తక్షణమే స్పందించి మీ సేవా కేంద్రం ఏర్పాటుకు ఆయా అధికారులతో మాట్లాడి గ్రామంలో మీ సేవ కేంద్రం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. త్వరలోనే సీసీ రోడ్లు డ్రైనేజీలకు కూడా నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు నాయకులు శ్యామ్ లాల్, శివ కుమార్, సామేల్ పాల్గొన్నారు

## సర్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలి

**ఓటర్ల ఎన్యూమరేషన్‌పై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముత్యాల సునీల్ కుమార్ స్పష్టత**




**ఆర్మూర్ , జులై 20 (నినాదం) :** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో కొనసాగుతున్న సర్ నమోదు ప్రక్రియను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సోమవారం రోజున సుడిగాలి పర్యటన జరిపి పరిశీలించారు. మోర్తాడ్, భీంగల్ కమ్మర్ పల్లి మండల కేంద్రాల్లో సర్ నమోదు సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. 100 శాతం ఎన్యూమరేషన్ లక్ష్యం అనంతరం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో పర్యటించి, ఇంకా మిగిలిపోయిన ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును, దివంగత నేత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 18 ఏళ్ల నిండిన యువకులకు ఓటు హక్కు కల్పించిన ఆశయాలకు అనుకూలంగా మిగిలిపోయిన అర్హులైన ఓటర్ల ఎన్యూమరేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, (బూత్ లెవల్ ఏజెంట్లు) (బూత్ లెవల్ ఆఫీసర్లు) దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గంలో వంద శాతం ఓటర్ల ఎన్యూమరేషన్ పూర్తయ్యేంత వరకు ఎవరూ విశ్రమించవద్దని, ప్రతీ ఒక్క అర్హులైన పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 56 ఏళ్ల పాత పంచాయతీ భవనం శిథిలావస్థలోకి..!

**డిస్మాంటిల్ చేయాలని పంచాయతీరాజ్ ఏఈ ఆదేశాలు**

**డీపీఓకు వినతిపత్రం అందజేసిన నెల్లిపాక బంజర సర్పంచ్ ముంద్రు రామకృష్ణ**



**అశ్వాపురం, జూలై 20(నినాదం):** అశ్వాపురం మండలం నెల్లిపాక బంజర గ్రామపంచాయతీకి అత్యవసరంగా నూతన గ్రామపంచాయతీ భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ముంద్రు రామకృష్ణ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీఓ)కు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ ముంద్రు రామకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యాలయంగా ఉపయోగిస్తున్న భవనం 1970 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రిగా ఉన్న జలగం వెంగళరావు ప్రారంభించిన భవన మని తెలిపారు. ఆనాటి నిర్మాణ విధానంలో డంగ్ సున్నంతో నిర్మించబడిన ఈ భవనం కాలక్రమేణా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుం దని పేర్కొన్నారు. ప్రస్తుతం భవనం గోడలు పగుళ్లు ఏర్పడి, పైకప్పు బలహీనపడటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే పరిస్థితి నెలకొందని తెలిపారు. భవనం శిథిలావస్థలో ఉండటంతో ప్రజాప్రతినిధులు, సిబ్బంది, గ్రామస్తుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) భవనాన్ని పరిశీలించి, అది వినియోగానికి అనుకూలంగా లేదని నిర్ధారించి, డిస్మాంటిల్ చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. అయితే పాత భవనం స్థానంలో కొత్త భవనం లేకపోవడంతో



గ్రామపంచాయతీ పరిపాలన తీవ్ర ఇబ్బందులకు గురవుతోందన్నారు. గ్రామసభలు, పాలకవర్గ సమావేశాలు నిర్వహించడానికి తగిన స్థలం లేకపోవడంతో పాటు, పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ధ్రువపత్రాల జారీ, పన్నుల వసూళ్లు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి నిత్య పరిపాలనా కార్యక్రమాలు కూడా ఇబ్బందికరంగా మారాయని వివరించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన పాలన అందించాలంటే అన్ని వసతులతో కూడిన ఆధునిక గ్రామపంచాయతీ భవనం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. నూతన భవనం నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని డీపీఓను కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా పంచాయతీ అధికారిణి సమస్యను సానుకూలంగా పరిశీలిస్తామని, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధికి గ్రామపంచాయతీ కార్యాలయం కేంద్రబిందువుగా ఉండే నేపథ్యంలో, దాదాపు ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన పాత భవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని నెల్లిపాక బంజర గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### అనుమతులు లేని ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఎస్ఐ కురుమూర్తి

**కల్వకుర్తి జులై 20 (నినాదం):** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ నీ పట్టుకున్నట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ నీ తోటపల్లి గ్రామ శివారులో పట్టుకొని ట్రాక్టర్ యజమాని , డ్రైవర్ పై కేసు నమోదు చేసి ట్రాక్టర్ నీ పోలీసు స్టేషన్ కి తరలించినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.




### ఎల్లారెడ్డిలో హెచ్‌డీఎఫ్‌సీ

## బ్యాంక్ గోల్డ్ లోన్ సేవలు

**ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్**



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 20(నినాదం):** ఎల్లారెడ్డి పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో గోల్డ్ లోన్ విభాగాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు తక్కువ వడ్డీతో వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించడం అభినందనీయమన్నారు. బ్యాంకు మేనేజర్ అశోక్ మాట్లాడుతూ, కేవలం 5 నిమిషాల్లోనే బంగారంపై రుణాలు మంజూరు చేసే గోల్డ్ లోన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 8 వ వార్డ్ ఇండిపెండెంట్ కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, కో – ఆప్షన్ సభ్యుడు పప్పు వెంకటేశం, బ్యాంకు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలపై ఆర్డీఓకు అధికార కాంగ్రెస్ పార్టీ నేత వినతి



**కామారెడ్డిప్రతినిధి, జూలై 20(నినాదం):** గత వారంరోజులుగా ఎల్లారెడ్డి మండల కేంద్రంలో కొనసాగుతున్న తరచూ... విద్యుత్ కోతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని కోరుతూ... కాంగ్రెస్ నేత, ఎల్లారెడ్డి మాజీ జడ్పిటిసి షేక్ గయాజుద్దీన్ సోమవారం ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, నిరంతర విద్యుత్ అంతరాయాల వల్ల విద్యార్థులు, వృద్ధులు, వ్యాపారులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల విద్యుత్ కోతల వల్ల ఏర్పడిన ఉక్కపోత కారణంగా ఎల్లారెడ్డిలో ఒక క్యాన్సర్ రోగి మృతి చెందారన్నారు. ప్రజల ప్రాణ భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి, ఎల్లారెడ్డి మండల కేంద్రం లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, అనవసర విద్యుత్ కోతలను నివారించాలని ఆయన ఆర్డీఓ ను కోరినట్లు చెప్పారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఆర్డీఓ సమస్యను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం..

## జ్వర బాధితులకు వైద్య సేవలు



**బిక్కనూరు,జూలై 20 (నినాదం):** బిక్కనూర్ మండల కేంద్రంలోని కొత్తపేట హనుమాన్ మందిరం సమీపంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ హేమీమా ఆదేశాల మేరకు జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం శ్యామల మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు శ్యామల,వనజ, సంతోషి, సుకన్య పాల్గొని ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ విక్టర్.**



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 20(నినాదం):** ప్రతి సోమ వారం నిర్వ హించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ విక్టర్. ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 121 దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులను అదనపు కలెక్టర్ స్వయంగా వారి సమస్య లను తెలుసుకున్నారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని ప్రాధాన్యతతో పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ పాండు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు జాబితా సవరణ

## వేగవంతం చేయాలి

**డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్**




**భిక్కనూర్, జూలై 20 (నినాదం)** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు అయ్యేలా గ్రామ పాలన అధికారులు కృషి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం భిక్కనూర్ తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ పాలన అధికారులతో నిర్వహించిన సమావేశంలో గ్రామాల వారీగా ఓటరు జాబితా సవరణ పురోగతిని సమీక్షించారు. ఇంటింటికి పంపిణీ చేసిన దరఖాస్తు ఫారాలను సకాలంలో సేకరించి, గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, రెవెన్యూ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామ పాలన అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# చినుకు కోసం చింత.. పంటలపై ఎండ పంజా!

**రైతన్న ఆశలపై వరుణుడి నిరాశ**

**మొలక దశలోనే ఖరీఫ్ పంటలకు కష్టాలు**

**వర్షాభావంతో సాగుపై పెరుగుతున్న ఆందోళన**



**కోదాడ ప్రతినిధి ( నినాదం):**
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు బలహీనపడడంతో ఈసారి ఖరీఫ్ సాగు అనిశ్చితిలో పడింది. వర్షాలు కురుస్తాయన్న ఆశతో ఆకాశం వైపు చూస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. నల్లని మేఘాలు కమ్ముకుంటున్నా చినుకు జాడ కనిపించకపోవడంతో పంటల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే మెట్ట ప్రాంత రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. తొలకరి జల్లులను నమ్ముకుని పత్తి, మిరప, మొక్కజొన్న, వరి పంటలు సాగు చేసిన రైతులకు ప్రస్తుతం నీటి కొరత సమస్యగా మారింది. మొలకెత్తిన పంటలు ఎండ వేడికి వాడిపోతుండగా, కొన్ని ప్రాంతాల్లో మొక్కలు ఎదుగుదల లేక గిడసబారుతున్నాయి.

**మేఘాల సందడి.. వాన జాడ లేదు**

జిల్లాలో పలుచోట్ల ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతంగా కనిపిస్తోంది. దీంతో వర్షం కురుస్తుందన్న ఆశతో రైతులు పొలాల వైపు చూస్తున్నారు. అయితే పొడి గాలుల కారణంగా మేఘాలు చెదిరిపోతుండడంతో వరుణుడి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు లేక భూగర్భ జలాలు తగ్గిపోతుండగా, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు పెరగడం లేదు.

**మొలక దశలోనే పంటలకు దెబ్బ**

తొలకరి వర్షాలతో విత్తనాలు వేసిన రైతులకు ప్రస్తుతం కష్టాలు తప్పడం లేదు. పత్తి మొక్కలు ఎదుగుదల లేక వాడిపోతుండగా, మిరప మొక్కల్లో ఆకులు ముడుచుకుంటున్నాయి. వరి నారుమడులకు సైతం నీటి అవసరం పెరిగింది. సరైన సమయంలో వర్షాలు లేకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**పెట్టుబడులు పోతాయేమోనని భయం**

విత్తనాలు, ఎరువులు, దుక్కి దున్నడం, కూలీల ఖర్చులతో ఇప్పటికే రైతులు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం వర్షాలు ముఖం చాటేయడంతో పెట్టుబడులు తిరిగి వస్తాయా లేదా అనే భయం నెలకొంది. కొందరు రైతులు పరిస్థితి ఇలాగే కొనసాగితే మళ్లీ విత్తనాలు వేసే పరిస్థితి రావచ్చని చెబుతున్నారు.

**మెట్ట రైతుకు ఆకాశమే దిక్కు**

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు ప్రాంతాలు మినహా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కువ భాగం వర్షాధార సాగు ప్రాంతాలే. బోర్లు, బావుల్లో నీటి మట్టాలు తగ్గిపోవడంతో రైతులు పూర్తిగా ప్రకృతిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రతి మేఘాన్ని ఆశగా చూస్తూ.. ప్రతి నిరాశను మౌనంగా భరిస్తున్నారు.వర్షాభావం ప్రభావం పంటలకే పరిమితం కాలేదు. పచ్చిక బయళ్లు ఎండిపోవడంతో పశుగ్రాస కొరత మొదలైంది. పశువులకు మేత అందించడం రైతులకు భారంగా మారుతోంది. రానున్న రోజుల్లో వర్షాలు లేకపోతే గ్రామాల్లో తాగునీటి సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# విద్యార్థులకు అన్ని సౌకర్యాలు నాణ్యంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు**

గద్వాల బ్యూరో జూలై 20 (నినాదం): జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు నాణ్యంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి.నర్సింగ్ రావు ఆదేశించారు. సోమవారం మల్దకల్ మండలం బిజ్జారం (పరమాల) గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంటశాల,భోజనశాల,పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం,విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఆహార నాణ్యత, పారిశుధ్యం,తాగునీటి సౌకర్యాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన అదనపు కలెక్టర్, వారి విద్యాభ్యాసం,వసతి సౌకర్యాల గురించి తెలుసుకొని వారికి నోట్‌బుక్స్,బెడ్‌షీట్లు పంపిణీ చేసి,బాగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాలికల ఉన్నత విద్యకు భరోసా

**అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌ల పంపిణీ, విద్యార్థినిలకు సన్మానం... బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్పీ**



పెద్దపల్లి రూరల్,జూలై 20(నినాదం): ఉన్నత విద్యను అభ్యసిస్తున్న బాలికలకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ అందిస్తున్న స్కాలర్‌షిప్‌లు ఆర్థికంగా ఎంతో బలాన్నిస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,ఐపీఎస్ (రిటైర్డ్) డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉన్నత విద్యను కొనసాగిస్తున్న విద్యార్థినులకు ఈ ఉపకార వేతనాలు గొప్ప భరోసాగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.పెద్దపల్లి పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో స్వేరోస్ ఇంటర్నేషనల్, స్వేరోస్ విస్డం సంయుక్త ఆధ్వర్యంలో అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థినులకు అభినందన, సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విద్యార్థినులను శాలువాలతో సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,డిగ్రీ, బీటెక్, బీఎస్సీ నర్సింగ్‌తో పాటు వివిధ అండర్‌గ్రాడ్యుయేట్,డిప్లొమా కోర్సులు అభ్యసిస్తున్న అర్హులైన విద్యార్థినులకు కోర్సు పూర్తయ్యే వరకు ఏడాదికి రూ.30 వేల చొప్పున ట్యూషన్ ఫీజు, ఇతర విద్యా ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఈ విద్యా సంవత్సరానికి 100 మందికి పైగా విద్యార్థినులు ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారని, వారి కోసం దాదాపు రూ.కోటి మేర నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యలో రాణించాలని ఆయన సూచించారు. జీవితంలో విజయాలను సాధించాలంటే క్రమశిక్షణ,పట్టుదలతో పాటు నిరంతర అధ్యయనం అవసరమని పేర్కొన్నారు.ప్రముఖుల జీవిత చరిత్రలను చదవడం ద్వారా స్ఫూర్తి పొందాలని,భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్వేరోస్ విస్డం రాష్ట్ర నాయకులు కన్నూరి శ్రీశైలం,దాసరి ఉష,మేకల రవీందర్,స్వేరోస్ ఇంటర్నేషనల్ నాయకుడు వేల్పుల సురేందర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మల్లారపు మహేందర్,జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్,ఫిట్ అండ్ ఫ్యూచర్ జిల్లా అధ్యక్షుడు మచ్చ రాహుల్‌తో పాటు పలువురు నాయకులు,విద్యార్థినులు పాల్గొన్నారు.



# విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కాలే యాదయ్య కృషి

చేవెళ్ల జులై 20 (నినాదం): చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో అంబేద్కర్ నగర్ కాలనీలో గత అనేక సంవత్సరాలుగా ఇండ్ల మధ్యలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య గారి దృష్టికి తీసుకువచ్చారు,ఈ సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య గారు విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై ప్రజల ఇబ్బందులపై సమగ్రంగా చర్చించారు. ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ఎమ్మెల్యే చొరవతో చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 19 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే 10 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లు పూర్తయ్యాయి. మిగిలిన 9 ట్రాన్స్‌ఫార్మర్ల పనులను కూడా అత్యంత త్వరలో పూర్తి చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు ఎమ్మెల్యే గారికి తెలిపారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య గారు మాట్లాడుతూ, "ప్రజల సమస్యల పరిష్కారమే నా మొదటి ప్రాధాన్యత. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు లేకుండా ప్రతి వార్డులో అవసరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజల భద్రత, సౌకర్యాల కోసం ప్రభుత్వం తరఫున అన్ని విధాలా కృషి చేస్తాం" అని తెలిపారు.స్థానిక ప్రజలు తమ సమస్యను పరిష్కరించే దిశగా చొరవ తీసుకుని ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, పనుల వేగవంతానికి కృషి చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్,మాజీ సర్పంచ్ ప్రస్తుత కౌన్సిలర్, బండారి శైలజ ఆగిరెడ్డి, కౌన్సిలర్లు మధ్యల శ్రీనివాస్, మంగలి కళ్యాణి యాదగిరి, కృష్ణా నాయక్, అధికారులు AD, AE, మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా,మాజీ వార్డు సభ్యులు మల్గారి మల్లారెడ్డి, జంగన్నోళ్ల హరికృష్ణ,చాకలి శ్రీనివాస్,నాయకులు మధ్యల చింటూ, అత్తిలి రవీందర్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పొట్ట దయాకర్, సుశాంత్, లియాకత్, వడ్ల శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.



# ఓట్లు ఉన్న ప్రతి ఒక్కరికి సమాచారం చేరేలా సర్ కార్యక్రమం నిర్వహించాలి

**మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**

మల్కాజిగిరి, జులై 20 (నినాదం): ఓట్లు ఉన్న ప్రతి ఒక్కరికి సమాచారం చేరేలా సర్ కార్యక్రమంను సమర్థవంతంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సోమవారం ఆనంద్ బాగ్ లోని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి క్యాంపు కార్యాలయం లో మల్కాజిగిరి కాంగ్రెస్ నాయకులు, ఇంచార్జి లు, కార్యకర్తలు, బిఎల్ఎ లు ప్రతి ఒక్కరూ ఆగస్టు 3వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ పని చేయాలని అవగాహనా కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ సమీర్ కౌశల్, మాజీ కార్పొ రేటర్లు వై ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, కాంగ్రెస్ మల్కాజిగిరి నియోజకవర్గం ఇంచార్జి తోట లక్ష్మీకాంత్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ బి కే శ్రీనివాస్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్, జి ఎన్ వి సతీష్ కుమార్, ఎస్ ఆర్ ప్రసాద్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, వినోద్ యాదవ్, పిట్టల నాగరాజు, యూసుఫ్ భాయ్, పిట్టల నాగరాజు, శ్రీకాంత్, ఆశా, ఇందిర ప్రియదర్శిని, శారద, సుమలత యాదవ్, కనకలక్ష్మి , పుష్పలత, సిరిగిరి రాజు, సనాది శంకర్, సందీప్ గౌడ్, పార్థు, బాలరాజు యాదవ్, వెంకటేష్, చుంకూ శ్రీనివాస్,కుట్టి శ్రీనివాస్,బాబు, సత్యనారాయణ,బ్రహ్మయ్య, శ్రీరామ్, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.



# బాలికల భవిష్యత్ ఆరోగ్యానికి హెచ్‌పీవీ వ్యాక్సిన్ అవసరం

పెబ్బేరు, జూలై 20 (నినాదం): పెబ్బేరు పట్టణ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో భాగంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన 14 నుంచి 15 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్‌పీవీ వైరస్ కారణంగా వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడంలో ఈ వ్యాక్సిన్ అత్యంత ప్రభావంతంగా పనిచేస్తుందని తెలిపారు. సరైన వయస్సులో వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ బారినపడే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ కుమార్తెల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వ్యాక్సిన్ వేయించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు లీలమ్మ, పార్వతి, స్వరూపరాణి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, ఫార్మసిస్ట్ కుమారి, ఏఎన్ఎంలు శారద, లావణ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 7 నెలల చిన్నారి హత్యాయత్నం కేసును ఛేదించిన బీర్కూర్ పోలీసులు

**తండ్రి,సవతి తల్లి ఇద్దరు అరెస్ట్.. కుక్కలు ఎత్తుకెళ్లాయంటూ నమ్మించే ప్రయత్నం విఫలం**

**చిన్నారిని అంతమొందించేందుకు తండ్రి–సవతి తల్లి పన్నిన పథకం బట్టబయలు**

**నేరాన్ని ప్రమాదంలా చిత్రీకరించి తప్పించుకోవాలన్న యత్నం విఫలం**

**సాంకేతిక ఆధారాలు,శాస్త్రీయ దర్యాప్తుతో అసలు నిజాలను వెలికితీసిన పోలీసులు**

**కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర**

**వివరాలు వెల్లడించిన బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి**

కామారెడ్డి రూరల్,జూలై 20 (నినాదం): బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 నెలల చిన్నారి వైష్ణవిపై జరిగిన హత్యాయత్నం ఘటనను బీర్కూర్ పోలీసులు శాస్త్రీయ దర్యాప్తు,సాంకేతిక ఆధారాలు మరియు నిందితుల విచారణ ఆధారంగా ఛేదించి,చిన్నారి తండ్రి మరియు సవతి తల్లిని అరెస్ట్ చేసినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి వెల్లడించారు.ఫిర్యాదుదారురాలు సంకు సంధ్య, నివాసం బీర్కూర్,తన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం,సుమారు రెండేళ్ల క్రితం తన అక్క శైలజ భర్త టేకు సతీష్ను రెండో వివాహం చేసుకుంది.వీరికి 7 నెలల కుమార్తె వైష్ణవి జన్మించింది.అనంతరం దాంపత్య విభేదాల కారణంగా పెద్దల సమక్షంలో విడిపోయి,చిన్నారి వైష్ణవిని తండ్రి సతీష్ వద్దే ఉంచాలని నిర్ణయించారు.తేది 15-07-2026 ఉదయం చిన్నారి ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా,ఇంటి సమీపంలోని ముళ్ల పొదల్లో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో లభించింది.చిన్నారిని వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి,అక్కడి నుండి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై చిన్నారి తల్లి సంధ్య,తన కుమార్తెను హత్య చేయాలనే ఉద్దేశంతో తన అక్క శైలజ ఈ దారుణానికి పాల్పడిందని అనుమానం వ్యక్తం చేస్తూ బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా,పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు,బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి పర్యవేక్షణలో,బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య,బీర్కూర్ ఎస్ఐ.రాములు మరియు పిట్లం ఎస్ఐ.ఆంజనేయులు మరియు సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం శాస్త్రీయ దర్యాప్తు చేపట్టింది. కేసు వివరాల్లోకెళ్తే. దర్యాప్తులో టేకు సతీష్‌కు మొదటి భార్య శైలజతో ముగ్గురు పిల్లలు ఉన్నట్లు,అనంతరం అతను శైలజ చెల్లెలైన సంధ్యను రెండో వివాహం చేసుకొని వైష్ణవికి తండ్రి అయినట్లు తెలిసింది.విడాకుల అనంతరం చిన్నారి వైష్ణవి తండ్రి వద్దే ఉండగా,ఆమెను పోషించడం భారంగా



మారిందనే భావనతో,అలాగే కుటుంబ విభేదాల నేపథ్యంలో చిన్నారిని అడ్డు తొలగించుకోవాలని టేకు సతీష్ మరియు శైలజ కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది.తేది 14-07-2026 అర్ధరాత్రి సమయంలో ఇంటి బయట నిద్రిస్తున్న చిన్నారి వైష్ణవిని ఇద్దరూ కలిసి తీసుకెళ్లి,సీసీ రోడ్డుపై ఈడ్చుకుంటూ కొంత దూరం తీసుకెళ్లి, అనంతరం గడ్డి ఉన్న ప్రదేశంలో పడుకోబెట్టి, వెంట తీసుకెళ్లిన బ్లేడ్లతో చిన్నారి శరీరంపై పలుచోట్ల గాయాలు చేసినట్లు దర్యాప్తులో తేలింది.చిన్నారి ఏడుపు ఆగిపోవడంతో చనిపోయిందని భావించి అక్కడే వదిలేసి ఇంటికి తిరిగి వెళ్లినట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.మరుసటి రోజు ఉదయం చిన్నారి కనిపించడం లేదని గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చి,గ్రామస్తులతో కలిసి వెతుకుతున్నట్లు నటించారు.చిన్నారి ఉన్న ప్రదేశం ముందుగానే తెలిసి కూడా,అక్కడికి వెళ్లి కనిపించినట్లు చెప్పి,ఎలాంటి అనుమానం రాకుండా బంధువులతో కలిసి ఆసుపత్రికి తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఘటన అనంతరం చిన్నారిని రాత్రి సమయంలో కుక్కలు ఎత్తుకెళ్లి గాయపరిచినట్లు గ్రామస్తులు,బంధువులు మరియు పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసినట్లు విచారణలో తేలింది. అయితే సాంకేతిక ఆధారాలు, శాస్త్రీయ పరిశీలన,సాక్షుల వాంగ్మూలాలు మరియు నిందితుల విచారణ ఆధారంగా అసలు వాస్తవాలను పోలీసులు వెలికితీశారు.అనంతరం నిందితులు తమ నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**అరెస్టు చేసిన నిందితులు**

1.టేకు సతీష్ (చిన్నారి వైష్ణవి తండ్రి) 2. సంకు శైలజ (చిన్నారి సవతి తల్లి)

**స్వాధీనం చేసుకున్న వస్తువులు**


ఒక రెడ్మీ క్రీమ్ కలర్ స్మార్ట్‌ఫోన్ 2.ఒక కార్బన్ కీప్యాడ్ మొబైల్ ఫోన్ ఈ సంచలన కేసును అత్యంత సమర్థవంతంగా ఛేదించిన బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య గారు,బీర్కూర్ ఎస్ఐ రాములు,పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు దర్యాప్తులో పాల్గొన్న పిట్లం ఏస్సై ఆంజనేయులులను జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర అభినందించినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి తెలిపారు

# ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో విద్యార్థుల హరిగోస

**హాస్టల్ నుంచి ల్యాబ్‌ల వరకు అవస్థలే... విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన**

**శుభ్రత లోపం.. మెస్‌లో నాణ్యతలేని భోజనం.. కంప్యూటర్లు, ల్యాబ్ పరికరాల కొరత.. అత్యవసర వైద్య సేవలు కూడా కరువు**






**లక్ష్మీదేవిపల్లి, జూలై 20 (నినాదం):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం సమీపంలోని కేఎస్ఎం కలెక్టర్ కార్యాలయం పక్కనే ఉన్న మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ విద్యార్థులకు విద్యాలయంగా కాకుండా సమస్యల నిలయంగా మారిందని విద్యార్థులం హరిగోసపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయంలో కనీస వసతులు లేక విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపిస్తున్నారు. సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషద్ (ఏబీవీపీ) విద్యార్థి సంఘం మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ముందు ధర్నా చేశారు.ఈ సందర్భంగా పలువురు చెబుతున్న వివరాల ప్రకారం హాస్టళ్లలో శుభ్రత పూర్తిగా గాలికొదిలేయడంతో బాత్రూములు అపరిశుభ్రంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని బాత్రూములకు తలుపులు కూడా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాత్రూములలో పురుగులతో నిండిపోయి ఉండటంతో ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.అత్యాధునిక విద్య అందిస్తామని చెప్పిన యూనివర్సిటీలో ల్యాబ్‌ల పరిస్థితి కూడా దారుణంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లో సక్రమంగా పనిచేసే కంప్యూటర్లు లేకపోవడంతో ప్రాక్టికల్స్ నిర్వహించడం కష్టంగా మారిందని తెలిపారు. వర్క్‌షాప్‌లలో అవసరమైన ల్యాబ్ పరికరాలు లేకపోవడంతో సాంకేతిక విద్యపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. మెస్ చార్జీలు క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నప్పటికీ, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని ఆరోపిస్తున్నారు. మెస్‌కు అవసరమైన సరుకులు కూడా సక్రమంగా రావడం లేదని, దీంతో నాసిరకం ఆహారం వడ్డిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య భద్రత విషయంలోనూ యాజమాన్యం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పగలు గానీ, రాత్రి గానీ అత్యవసర పరిస్థితుల్లో డాక్టర్ లేదా వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఏదైనా అనారోగ్య సమస్య వచ్చినప్పుడు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. విద్యార్థుల శారీరక దృఢత్వానికి అవసరమైన క్రీడా కార్యకలాపాలకూ ఆంక్షలు ఉన్నాయని వారు చెబుతున్నారు. గ్రౌండ్‌కు వెళ్లేందుకు కూడా అనుమతులు తీసుకోవాల్సి వస్తోందని, దీనివల్ల మానసిక ఒత్తిడి పెరుగుతోందని వాపోతున్నారు. యూనివర్సిటీలో చేరిన నాటి నుంచి ఇప్పటి వరకు విద్యా, వసతి, మౌలిక వసతుల అభివృద్ధిలో ఎలాంటి మార్పు కనిపించలేదని విద్యార్థులు చెబుతున్నారు. సమస్యలపై పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్పందన లేదని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చదువుకునేందుకు పంపిన తమ పిల్లలు కనీస వసతులు కూడా లేక ఇబ్బందులు పడటం బాధాకరమని పేర్కొంటున్నారు. ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ అధికారులు వెంటనే యూనివర్సిటీలో ప్రత్యేక విచారణ నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**హాస్టల్‌లో ఒక పూట భోజనం నిలిచిపోయిన ఘటన నిజమే**

యూనివర్సిటీ ప్రిన్సిపల్ జగన్మోహన్ రాజు వివరణ కోరగా మెస్ నిర్వహణకు అవసరమైన నిధులు సరిపడా అందడం లేదని, అయినప్పటికీ ఇప్పటివరకు రూ.54 లక్షల వరకు అప్పు చేసి విద్యార్థులకు భోజనం అందించడంతో పాటు సిబ్బందికి జీతాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు. బాయ్స్ హాస్టల్‌లో ఒక పూట భోజనం నిలిచిపోయిన ఘటన నిజమేనని, అయితే గర్ల్స్ హాస్టల్‌లో అలాంటి పరిస్థితి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం, సిబ్బంది కొరత కారణంగా



కొంత మేర పారిశుధ్య నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అయినప్పటికీ హాస్టళ్లు, తరగతి గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించేందుకు యాజమాన్యం నిరంతరం ప్రయత్నిస్తోందని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

# ప్రజాగొంతుకపై అంకుశం !

సంపాదకీయం

దేశంలో ఆందోళనలను పట్టించుకునేందుకు పాలకులకు తీరిక లేకుండా పోయింది. కేంద్రంలోని ప్రభుత్వమైనా, రాష్ట్రాల్లోని వివిధ పార్టీల నేతృత్వంలో ఉన్న ప్రభుత్వాలకైనా ఇది కనపడడం లేదు. అన్నా హజారే లాంటి వారు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే స్థితిలతో పాలకులు లేరు. రాజకీయ అవినీతిపై ఆయన యుద్ధం చేస్తున్నా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణ దీక్షలో ఉన్నారు. ఆయన ఎందుకు దీక్ష చేస్తున్నారు..ఎందుకు నిరసనలకు దిగారన్న కనీస ఆలోచన కూడా చేసే పరిస్థితిలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లేదు. ఎన్‌డిఎకు మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా కిమ్మనడం లేదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో పనికిరాదు. మొత్తంగా పోటీ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినివున్న పరిస్థితుల్లో ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్న సంస్కరణలపై మాట్లాడటా నికీ, తగిన చర్యలు చేపట్టడానికీ ప్రభుత్వానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ప్రజల పక్షాన నిరశనలు, ఉద్యమాలు చేయడం వాంగ్‌చుక్‌కు కొత్తకాదు. రేపోమాపో ఆయన దీక్ష విర మించినా ఎవరూ దానిని వైఫల్యంగా భావించరు. కానీ, నెలన్నరనుంచి సాగుతున్న ఈ ఉద్యమాన్ని బేఖాతరు చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ఠతెస్తుంది, మానవత్వం, జవాబుదారీతనం కొరవడ్డాయన్న అభిప్రాయానికి తావిస్తుంది. శాంతియు తంగా సాగుతున్న నిరసనను అలాగే ముగిసేట్టు చూడాల్సిన బాధ్యత ఇరుపక్షాలపైనా ఉంది. కొందరు నిస్వార్థ పరులు దేశం కోసం ఏదో చేయాలన్న తపనలో ఉంటారు. వారు తమ ఆకాంక్షను నిరసలన ద్వారా తెలియచేస్తారు. వాటిని గుర్తించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. తాజాగా సోనమ్ వాంగ్ చుక్ దీక్ష ఈ కోవలోకే వస్తుంది. నీట్ తప్పిదాలకు బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో వాంగ్‌చురక్ దీక్షకు దిగారు. నిజానికి సోనమ్ ను పిలిచి మాట్లాడ వచ్చు. లూఏదా ఆయన దీక్షను విరమించేలా, ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించ వచ్చు. కానీ ప్రభుత్వం అలా చేయకుండా యాన దీక్ష భగ్నానికి యత్నించింది. అంటే దీక్షలను కూడా తట్టుకునే స్థితిలో పాలకులు లేరని గుర్తించాలి. 1984లో లద్దాఖ్ వాసులకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ వాంగ్‌చుక్ తండ్రి వాంగ్యాల్ ఇలాగే దీక్షకు దిగితే నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా లెహ్ వెళ్ళి, డిమాండ్లు నెరవేరుస్తానని హామి ఇచ్చి దీక్ష విరమింపచేసిన విషయం మరచిపోరాదు. 2011లో సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దీక్ష సంద ర్భంలోనూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మానవతా దృక్పథంతో వ్యవహరిం చారు. అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ చర్చించడం ద్వారా పెద్దమనసు చాటుకు న్నారు. వాంగ్‌చుక్ ఈ దీక్షకు దిగడానికి బీజేపీవి ద ఆయనకు ఉన్న పాతకక్షలే కారణమంటూ కొన్ని హిందీ చానెళ్ళలోనూ, సోషల్ వి డియాలోనూ బురదజల్లే పని జోరుగా సాగడం దారుణం కాక మరోటి కాదు. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, పదికేజీలకు పైగా బరువు తగ్గారని, దీక్షసాగితే కీలక అవయవాల పై దుష్ప్రభావాలు తప్పవని వైద్యబృందం హెచ్చరించడంతో పోలీసులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఈ పనిచేసే ముందు వాంగ్‌చుక్‌తో మాట్లాడి వుంటే పాలక పార్టీ పెద్దల గౌరవం తగ్గేది ఏవి లేదు.. ఆయన ప్రాణానికి ప్రమాదం ఉన్నది కనుక, దీక్ష విరమింపచేయా లంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ, ప్రతీ పౌరుడి ప్రాణమ విలువైనదేనని, వాంగ్‌చుక్‌కు ప్రభుత్వ వైద్యులతో నిరంతర పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యపరమైన చర్యలన్నీ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఆయనతోపాటుగా ఆమర ణదీక్షలో ఉన్న ముగ్గురు విద్యార్థినేతల ఆరోగ్యం బాగా దిగజారిందని, తక్షణమే దీక్షవిరమించా ల్సిందిగా ఒకరిని వైద్యులు హెచ్చరించినట్టుగా వార్తలు వస్తున్నాయి. వాంగ్‌చుక్ మాత్రం తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోన గట్టిగానే ఉన్నానని హామి ఇస్తున్నారు. తనను దీక్ష విరమించుకోవాలని ఒత్తిడి చేయవద్దని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, పార్లమెంట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభిం అయినా, ఎన్‌డిఎ పక్షనేతలు ఎవ్వరు కూడా వాంగ్‌చుక్‌ను పలకరించలేదు. ఆయన పక్షాన నిల వడానికి వారికి ధైర్యం లేకుండాపోయింది. దీక్షాస్థలిని సందర్శించి మద్దతు ప్రకటిస్తున్న ప్రముఖులు, నేతలు లేకపోలేదు. కొందరు స్వయంగా వచ్చి సంఘీభావం ప్రకటిస్తే, బీజేపీ ప్రభుత్వ కఠినవైఖరిని పలు వేదికలద్వారా మరికొందరు ప్రశ్నిస్తున్నారు. నీట్ వైఫల్యం వి ద స్వయంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ, ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ, కాస్తంత ఆలస్యంగానైనా వాంగ్‌చుక్ పక్షాన మాట్లాడుతోంది. ఇకపోతే లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, ఆరో షెడ్యూల్ రక్షణల కోసం గత ఏడాది వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు కూడా ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో, ఆయన వి ద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివిడత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదలచేసింది. దానితోపాటు, ఆయనను అరెస్టుచేయడానికి ప్రాతిపదికలుగా వాడిన పాకిస్థాన్‌తో సంబంధాలు, అనుమానస్పద విదేశీపర్యటనలు, అక్రమ విరాళాల సేకరణ ఇత్యాది ఆరోపణలను కూడా గాలికి వదిలేసింది. ఓ రకంగా ప్రజల గొంతుకపై పాలకులు అంకుశం దింపుతున్నారు. తాముకోరుకున్నట్లుగా పాలన సాగిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య లపై స్పందించడం లేదు. ఇందుకు తాజా ఘటనలే నిదర్శనం.

# ఆహారానికి ఆధునిక రూపం... ఆరోగ్యానికి విఘాతం!



**జంక్ ఫుడ్ కారణంగా సంప్రదాయ వంటల విలువను మరవద్దు**

**జూలై 21...జాతీయ జంక్ ఫుడ్ డే**

**ప్రతి సంవత్సరం జూలై 21వ తేదీన జరుపుకునే జాతీయ జంక్ ఫుడ్ డే, ఆధునిక జీవనశైలిలో భాగమైన ప్రత్యేకమైన రోజు. ఈ రోజున ప్రజలు సాధారణంగా పాటించే ఆరోగ్య నియమాలకు స్వల్ప విరామం ఇచ్చి, తమకు ఇష్టమైన రుచిక రమైన, ఆకర్షణీయమైన ఆహార పదార్థాలను తినేందుకు సమయం కేటాయిస్తారు. ఇవే 'జంక్ ఫుడ్'గా పిలవబడే పదార్థాలు. వీటిలో అధికంగా చక్కెర, కొవ్వు, ఉప్పు ఉండటంతో పాటు, విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు వంటి పోషకాల స్థాయి తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ రుచిలో ప్రబలమైన ఆకర్షణ ఉండటంతో ప్రజలు వీటిని మక్కువతో స్వీకరిస్తారు. ఈ రోజు ద్వారా అలాంటి పదార్థాలను మితంగా తినుతూ ఆనం దించడానికి ఒక అవకాశం లభిస్తుంది.**

'జంక్ ఫుడ్' అనే పదాన్ని 1972లో అమెరి కాకు చెందిన శాస్త్రవేత్త మైఖేల్ జాకబ్‌సన్ మొదట ఉపయోగించారు. అయితే, 1950ల నాటికే అమెరికాలో ప్యాకెట్ ఫుడ్‌లు, రెడీ టు ఈట్ స్నాక్స్, కార్బొనేటెడ్ పానీయాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. కాల క్రమంలో ఈ వినియోగం అంతర్జాతీయంగా వ్యాపించి, పట్టణ జీవనశైలిలో ఒక భాగంగా మారింది. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో తినగలిగే వీలుతో పాటు రుచిలో విశేషమైన ఆకర్షణ కలిగి ఉండటం వల్ల జంక్ ఫుడ్ విపరీతంగా ప్రాచుర్యం పొందింది.

జాతీయ జంక్ ఫుడ్ డే ఒక సామాజిక భావో ద్వేగానికి ప్రతీక. ఇది రోజూ కఠినమైన ఆహార నియమాలకు కట్టుబడి జీవించే వారికి ఒక మితమైన విరామం. మితమైన తినడం ద్వారా రుచికి విలువ ఇచ్చేలా ఉండడం, ఆరోగ్యపర మైన నియమాలు పూర్తిగా విస్మరించకుండా ఆనందించడమనే భావన దీనిలో నిక్షిప్తమై ఉంటుంది. 'తినడం తప్పే' అనే తపన లేకుండా, ఒక్కరోజైనా మన ఇష్టమైన పదార్థా లను నిరాకరణ లేకుండా ఆస్వాదించ గలగడం దీనివల్ల సాధ్యమవుతుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన గణాంకాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు 39 శాతం మంది వయోజనులు అధిక బరువుతో బాధ పడుతున్నారు. వారిలో 13 శాతం మంది ఊబకాయానికి లోనవుతున్నారు. భారత దేశంలో ఈ సమస్య వేగంగా పెరుగు తోంది. 2020 నాటికి భారత దేశ బాలలలో సుమారు 14 శాతం మంది అధిక బరువుతో బాధపడుతున్నారని అధ్యయనాలు తెలుపు తున్నాయి. దీని ముఖ్య కారణాలలో జంక్ ఫుడ్ వినియోగం ప్రధానమైనది.

ఈ రోజున ప్రజలు ఇంట్లోనే తాము ఇష్టపడే వంటకాలను తాయారు చేసుకుని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. కొంతమంది రెస్టారెంట్లకు వెళ్లి ప్రత్యేకమైన డిష్‌లను ఆస్వాదిస్తారు. స్నేహితులతో కలిసి జంక్ ఫుడ్ పార్టీలు ఏర్పాటు చేస్తారు. మరి కొందరు స్థానిక స్ట్రీట్ ఫుడ్‌లు, కొత్త రుచుల కోసం అన్వేషణ చేస్తారు. సామాజిక మాధ్య మాలలో ఫోటోలు, వీడియోలు పంచుకుంటూ ఈ రోజు ఆనందోత్సవంగా మారుతుంది.

అయితే, జంక్ ఫుడ్‌ను అతి మోతాదుగా తీసు కోవడం వల్ల శరీరానికి తీవ్రమైన హానులు కలుగుతాయి. గుండె సంబంధిత రుగ్మతలు, మధుమేహం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఎక్కువ. తరచూ జంక్ ఫుడ్‌కు అలవాటు పడటం శరీరాన్ని మాత్రమే కాకుండా మనో వ్యవస్థను కూడా ప్రభావితం చేస్తుంది. అందుకే ఈ రోజును పురస్కరించుకుని "మితమే మానవత్వం" అన్న దృష్టితో వినియోగాన్ని పరిమితం చేయడంపై దృష్టిపెట్టాలి.

జంక్ ఫుడ్‌ను పూర్తిగా తిరస్కరించాల్సిన అవసరం లేదు. కొన్ని సందర్భాల్లో మన ఇష్టమైన ఆహారాన్ని ఆనందంగా తినడం జీవ నానందాన్ని ఇస్తుంది. అయితే ఇది రోజువారీ అలవాటుగా మారకూడదు. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మితంగా తినే అలవాటు పెంపొందించు కోవాలి. ఒకరోజు ఆనందం, మిగతా రోజులు ఆరోగ్యం అనే భావన ఈ దినోత్సవానికి దిక్సూచి కావాలి.

ఈ సందర్భంగా మనం సమకాలీన సమస్య లను కూడా పరిశీలించాలి. ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, రెడీమేడ్ స్నాక్స్‌కి పట్టణ ప్రాంతాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఉద్యోగం, విద్య, ప్రయాణం వంటి కారణాలతో వేగంగా తినగలిగే ఆహారాలపై ఆధార పడడం పెరిగింది. ఫుడ్ డెలివరీ యాప్స్, రెస్టారెంట్ సంస్కృతి, స్ట్రీట్ ఫుడ్ కల్చర్—"ఈ పరిస్థితు లన్నీ కలసి, తాత్కాలికంగా రుచికోసం తినడమూ, దానికి బానిసలుగా మారి పోవడమూ మధ్య గల స్పష్టతను తొలగించే శాయి."

ఇది పిల్లల్లో శారీరక చలనం లోపించి అకాల బరువు పెరుగుదలకు దారి తీస్తోంది. స్కూల్ క్యాంటీన్లలో, టిఫిన్ బాక్సుల్లో జంక్ ఫుడ్ స్థానం పెరగడం భవిష్యత్ తరాలకు హానికరం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ఆహారపు అలవాట్లపై శ్రద్ధ వహించాలి. పాలకులు ఆరోగ్య విద్యను పాఠ్యాంశాల్లో కలపాలి.

పర్యావరణానికి కూడా జంక్ ఫుడ్ వినియోగం వల్ల హాని కలుగుతోంది. అధికంగా ప్లాస్టిక్ ప్యాకేజింగ్, డిస్పోజబుల్ వస్తువుల వాడకం వల్ల మానవాళికే కాక ప్రకృతికి కూడా ముప్పు ఏర్పడుతోంది. ఇది వ్యర్థాల సంచయాన్ని పెంచుతుంది. అందుకే బాధ్యతాయుతమైన వినియోగం మార్గాన్ని అవలంబించాలి.

అలాగే మన సంప్రదాయ వంటల్లోనే రుచికర మైన, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. మిలెట్స్‌తో తయారు చేసే చిప్స్‌లు, జొన్న గారెలు, పప్పు వడలు, శనగల మిక్చర్‌లు —— ఇవన్నీ ఆరోగ్యానికి మంచివి. వీటిని ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యపరమైన ఆహార సంస్కృతిని కాపాడ వచ్చు. అంతేకాదు, మన యువతకు ఆరోగ్యపరమైన ఆహారపట్ల అవగాహన పెంపొందించవచ్చు.

ఆహారం అనేది కేవలం ఆకలి తీరుస్తూ శరీరా నికి ఇంధనం ఇచ్చే ప్రక్రియ కాదు. అది మన కుటుంబ బంధాలను, సంస్కృతిని ప్రతిబిం బించే అనుబంధం. జంక్ ఫుడ్‌తో మమేకమ వుతూ మన సంప్రదాయ వంటల విలువను మర్చి పోకూడదు. పిల్లలలో చిన్ననాటి నుంచే ఆహారపట్ల సరైన అవగాహన కలిగించాలి.

ఈ నేపథ్యంలో జాతీయ జంక్ ఫుడ్ డే మనకు ఒక ఆత్మపరిశీలనకు దారి చూపుతుంది. ఆహారాన్ని శాస్త్రీయంగా, సమతుల్యంగా చూసే దృష్టిని పెంపొందించాలి. ఆరోగ్యాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటూనే, ఒకరోజు అయినా ఇష్టమైన రుచులను ఆస్వాదించడా నికి అవకాశం కల్పించాలి.

ఈ జూలై 21న, ఒక్కరోజు సంతోషంగా గడపండి – కానీ మిగతా 364 రోజులు ఆరోగ్యంగా గడపాలని సంకల్పించండి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# పదవిలో పవిత్రత, కలంలో కవిత్వం కలబోసిన జీవితం



**జూలై 21...జె. బాపురెడ్డి జయంతి**

ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అనే గంభీరమైన వ్యవస్థలో ఒక మానవీయ హృదయం కలిగిన అధికారి కావడం అరుదైన విషయం. అదే విధంగా, పదవీ బాధ్యతలపై నిబద్ధతతో పాటు సాహిత్య తపస్సులో అంతర్నిర్మితంగా జీవించడం అద్భుతం. ఈ రెండు గుణాల సమన్వయ రూపమే జె. బాపురెడ్డి. పాలనా రంగంలో భద్రతతో, సమర్థతతో సేవలందించినా... అంతర్గతంగా మౌన తత్వవే త్తగా, చింతనా పరుడిగా, లోతైన కవిత్వ స్పర్శ కలిగిన రచయితగా అభివృద్ధి చెందారు.

జె. బాపురెడ్డి 1936, జూలై 21న కృష్ణారెడ్డి – రామలక్ష్మి దంపతులకు తెలంగాణ రాష్ట్రం, రాజన్న సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట మండలం, సిరికొండ గ్రామంలో జన్మించారు.

పాఠశాల దశ నుంచే పఠనానికీ, భావ ప్రపంచా నికీ ఆసక్తి కలిగి ఉన్న ఆయన, విద్యాభ్యాసాన్ని హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో కొనసాగించారు. పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రే షన్ లాంటి ప్రజాసేవకు సంబంధిత విషయాలలో ప్రత్యేక నైపుణ్యం కలిగించుకుని ఐఏఎస్‌కి ఎంపిక య్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మరియు కేంద్ర ప్రభుత్వాలలో వివిధ కీలక పదవుల్లో పనిచేశారు. జిల్లా కలెక్టర్‌గా ప్రజల మధ్యకు వెళ్ళిన తొలి శ్రేణి అధికారిగా గుర్తింపు పొందారు. కార్యాలయం గదిలో కాకుండా గ్రామాల్లో, సమస్యల మధ్య ప్రజలతో కలిసి పనిచేసిన సేవా నిరతి, నిబద్ధత కలిగిన శ్రేష్ఠమైన పరిపాలకుడు ఆయన.

అయితే, ఆయన పాత్ర ఒక్క పరిపాలనా వ్యవస్థతో పరిమితమవ్వలేదు. పదవిలో ఉన్నప్పుడే కాక, పదవీ విరమణ అనంతరం పూర్తిగా సాహిత్య సేవకు తన జీవితాన్ని అంకితం చేశారు. మౌనంగా, ఆంతర్య చింతనతో, భాషపై పదును పెట్టిన ఆయన కవిత్వం, సమకాలీనతను తేటతెల్లంగా ప్రతిబింబించే వచన రచనలు, పరిపాలన లోని లోతులను తాత్వికంగా విశ్లేషించే వ్యాసాలు – అన్నీ ఆయన భావ ప్రపంచాన్ని పటిష్టంగా చాటాయి.

''చెట్టు నీడ'' అనే కవితలో –
"నాలోన సేదతీర్చిన నీడలకు
నేం చేయలేకపోయాను,
కానీ నా నీడను మాత్రం
ఎవరికైనా పంచుకుంటాను''
అనే పంక్తులు ఆయన సేవాధర్మాన్ని, నిర్లౌకికతను ప్రతిబింబించేవి. ఇదే కవితలో కనిపించే ఆత్మీయత, మౌనం, త్యాగ భావన ఆయన్ని అధికారిలో ఓ ఆత్మ వేదన గల కవిగా నిలబెట్టాయి.

''కలల దారులు'' కవితా సంపుటిలో ఆయన వ్యక్తిగత అనుభవాలనే కాక, సామూహిక స్పందనల్ని పదాల్లో బంధించారు. కలలు చూసే మనిషి యథార్థానికి ఎలా ఎదురవుతాడో, ఆశలు ఎలా విరగ బెడతాయో, ఆశయాలు ఎలా రూపమి స్తాయో స్పష్టంగా ఆ కవిత్వంలో కనిపిస్తుంది. ''వా స్తవం ఎదురయ్యే దారులే చివరికి పయనం'' అనే వాక్యం జీవిత చాతుర్యాన్ని ప్రతిబింబించే అక్షర సత్యం.

ఇక పరిపాలన మీద ఆయనకు ఉన్న లోతైన అవ గాహన అనేక వ్యాస రూపాల్లో వెలువడింది. ''పరి పాలనా ధ్యానాలు'', ''ఆలోచనా పథాలు'' వంటి వ్యాస సంకలనాలు అధికార వ్యవస్థల్లోని నైతికత, సమర్థత, ప్రజల జీవన ప్రమాణాల మధ్య సంబంధాన్ని విశ్లేషించాయి. ''పదవులు పాలక అధి కారాలుగా కాక, బాధ్యతల నెరపుగా ఉపయోగ పడాలి; ప్రజాస్వామ్యంలో శాసక వర్గం కాక, సేవక వర్గంగా రూపాంతరం చెందాలి'' అన్న ఆయన భావన, నిజంగా ప్రజాహిత పరిపాలనకు మార్గద ర్శిని.

ఆయన వ్యక్తిత్వాన్ని వ్యక్తీకరించే అంశం – మౌనం. ఆ మౌనం భయంకరమైన ఖాళీగా కాక, లోతైన తత్వవ్యాఖ్యానంగా మారేది. ఆయన మాట్లాడిన మాటలు కన్నా – మౌనంగా చెప్పిన సందేశాలు ఎక్కువ. ఆత్మగౌరవం, నిగ్రహం, వినయం – ఇవన్నీ ఆయన జీవన ధ్యానం.

ఆయనను సన్నిహితంగా చూసినవారు, కలిసి పని చేసిన అధికారులు, సాహితీ వేత్తలు చెప్పే మాటలు ఇదే చెబుతాయి. ''ఆయన గదిలో కుర్చీలో అధికారి... కానీ బయట సాహితీవేత్త... ప్రజల్లో మానవతా వాదిగా కనిపించేవారు'' అంటారు మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. నాయుడు. ''ఆయన వచనంలో పదం పదంగా వేదార్థం ఉంటే, వాక్యాల్లో సాధ్వీ లక్ష్యం ఉండేది'' అంటారు రచయిత శివరామకృష్ణ.

ఇలాంటి విశిష్టమైన జీవితం – నేటి యువతకు, అధికారులకు, రచయితలకు ఒక మార్గదర్శనం. పదవిలో ఉండగలిగినా, పదంలో పరిమళించ గలిగిన వ్యక్తి చాలా అరుదు. జె. బాపురెడ్డి అలా ఇద్దరినీ సమన్వయపర్చిన అద్భుత జీవనం గడిపారు. కేవలం పదవిలో కాక, పదాల్లోనూ ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోయే వ్యక్తి అయి పోయారు.

**ఆయన కవితలోనే చెప్పినట్లు –**
**"జీవితమే ఒక దీపమైతే,**
**నిగ్రహమే ఆ వెలుగు.**
**ఆ వెలుగే పయనమవుతుంది**
**మరణానంతర మార్గాల్లోనూ."**

ఈ వెలుగు, ఈ మౌనం, ఈ సేవా తత్త్వం – ఇవన్నీ కలిసిన వ్యక్తిత్వమే జె. బాపురెడ్డి. తెలుగు భూమికి, భారత సర్వీసుల ప్రపంచానికి ఆయన సాహిత్యం ఒక విలక్షణ అభిషేకం.

# డ్రీమ్ గర్ల్ హేమ మాలిని 6-దశాబ్దాల అద్భుత నట ప్రస్థానం

**(హేమ మాలిని 60 ఏళ్ల సినీ ప్రస్థానం పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా)**

ప్రముఖ నటి హేమ మాలిని భారతీయ చిత్ర పరిశ్రమలో 60 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఒక అసాధారణ మైలురాయిని చేరుకున్నది. హేమ మాలిని 1963లో తమిళ చిత్రం "ఇదు సత్యం"తో తన నటనా జీవితాన్ని ప్రారంభించి, 1965లో "పాండవ వనవాసం"లో ఒక చిన్న పాత్ర పోషించారు. ఈ "డ్రీమ్ గర్ల్" రాజ్ కపూర్ యొక్క 1968 క్లాసిక్ చిత్రం "సప్నో కా సౌదాగర్"తో బాలీవుడ్‌లో అడుగుపెట్టి, ఆ తర్వాత బాలీవుడ్‌లోనే అత్యంత ప్రసిద్ధి చెందిన మరియు చిరస్థాయిగా నిలి చిపోయిన ఐకాన్‌గా ఎదిగారు. మాలిని తన కెరీర్ మొత్తంలో "జానీ మారా నామ్ (1970)", "అందాజ్ (1971)", లాల్ పత్తర్ (1971), సీతా ఔర్ గీతా (1972) వంటి అనేక విజయవంతమైన చిత్రాలలో ప్రధాన పాత్రలు పోషించారు. 1970, 1980వ దశకాలలో హేమ, ధర్మేంద్రల జంట కలిసి 28 చిత్రాలలో నటించారు. షోలే, సన్యాసి, దస్ నంబారి, నసీబ్, సత్తె పిడి సత్తా, సీతా ఔర్ గీతా, అందాజ్, డ్రీమ్ గర్ల్, రజియా సుల్తానా, త్రిశూల్, దిల్లగి, ప్రతిగ్య, షరాఫత్, బర్నింగ్ ట్రైన్, దుల్హన్, స్వామి, అమీర్ గరీబ్, ప్రేమ్ నగర్, మరియు మరెన్నో కమర్షియల్ హిట్ సినిమాల్లో కొన్ని మాత్రమే. నటనకు స్వల్ప విరామం తర్వాత, హేమ తిరిగి బాగ్బన్, వీర్-జారా, లాగా చునరీ మే దాగ్, ఏక్ థీ రాణి ఐసీ భీ(2017)లో నటించింది.

6 దశాబ్దాల వెండితెర ప్రయాణం:

ఆమె ఆరు దశాబ్దాల వెండితెర ప్రయాణం కేవలం ఆమె తెరపై మాయాజాలం వరకే పరిమితం కాలేదు. 'షోలే'లో వాచాల, ఉత్సాహభరితమైన బసంతి పాత్ర నుండి, 2003లో వచ్చిన 'బాగ్బాన్' చిత్రంలో పూజ పాత్రతో ఆమె చేసిన అద్భుతమైన సినీ పునరాగమనం వరకు, ఆమె పాత్రలు హిందీ సినిమా చరిత్రపై చెరగని ముద్రను వేశాయి. ఆరు దశాబ్దాల పాటు సాగిన తన సుదీర్ఘ సినీ కెరీర్‌లో దాదాపు 200 చిత్రాలలో వరకు నటించారు. ఇటీవల ఆమె ముంబైలో ఒక భారీ ఛారిటీ కార్యక్ర మంతో తన కెరీర్ వజ్రోత్సవాన్ని జరుపుకున్నారు. ఆమె 1992లో 'దిల్ ఆష్నా హై', 2011లో 'టెల్ మీ ఓ ఖుర్దా' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆమె శాస్త్రీయ నృత్యంతో పాటు టీవీ కార్యక్రమాలపై కూడా దృష్టి సారించారు. ఆమె ధర్మేంద్ర, శశి కపూర్, దేవ్ ఆనంద్, రాజేష్ ఖన్నా, సంజీవ్ కుమార్, అమితాబ్ బచ్చన్ వంటి బాలీవుడ్ అగ్ర కథానాయకులతో తెరపై జంటగా నటించి మెప్పించారు. హిందీ చిత్రాలలో బెల్-బాటమ్ ప్యాంటు, షర్టులు ధరించిన తొలి నటి ఆమెనే. 'డ్రీమ్ గర్ల్' అని కూడా పిలువబడే హేమ, ఇప్పటికీ అప్పుడ ప్పుడు చిత్రాలలో నటిస్తూనే ఉన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి హేమ మాలిని:

"హేమ మాలిని ఆర్. చక్రవర్తి" 1948 అక్టోబర్ 16న మద్రాసులో ఒక తమిళ అయ్యంగార్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి పేరు వి.ఎస్. చక్రవర్తి, తల్లి పేరు జయలక్ష్మి చక్రవర్తి, ఆమె స్వయంగా ఒక నిర్మాత. ఆమె 11వ తరగతి వరకు చదివి, నటనారంగంలోకి ప్రవేశించారు. 1961లో ఒక ప్రాంతీయ చిత్రంలో నర్తకిగా నటించిన తర్వాత, కథానాయికగా నటించడానికి చాలా సన్నగా ఉన్నారనే కారణంతో తమిళ దర్శకుడు సి.వి. శ్రీధర్ ఆమెను తిరస్కరించారు. హేమ మాలిని ఒక ప్రముఖ నటి, బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆమె నటి, దర్శకురాలు, శాస్త్రీయ నృత్య కారిణి (భరతనాట్యం, కూచిపూడి, మోహిని యాట్టం), నిర్మాత, రాజకీయ నాయకురాలు. ఆమె 2014లో ఉత్తరప్రదేశ్ నుండి బీజేపీ లోక్‌సభ ఎంపీగా ఎన్నికై, 2019లో తిరిగి లోక్‌సభకు ఎన్నిక య్యారు. ఆమె 2011లో కర్ణాటక నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆమె ధర్మేంద్రతో హీరోగా అనేక చిత్రాలలో నటించారు. వివాహం కోసం ఇస్లాం మతంలోకి మారిన తర్వాత, 1979లో ఆయనను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఈషా, అహనా డియోల్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె ముంబైలో 'నిత్యా విహార్ కళాకేంద్రం' అనే శాస్త్రీయ నృత్య కేంద్రాన్ని స్థాపించారు. 2000వ సంవత్సరంలో, ఆమెకు నాల్గవ అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీతో పాటు, ఫిల్మ్‌ఫేర్ జీవిత సాఫల్య పురస్కారం, ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ నటి పురస్కారం, సర్ పి.ఎస్. విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. హేమ మాలిని 11 సార్లు ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డుకు నామినేట్ అయ్యారు. 2024లో అయోధ్య రామ మందిరంలో జరిగిన ప్రణాప్రతిష్ఠ కార్యక్రమానికి ముందు ప్రదర్శించిన ఒక నాటక ప్రదర్శనలో ఆమె సీత పాత్రను పోషించారు.

"హేమ మాలిని: ది ఆథరైజ్డ్ బయోగ్రఫీ" అనేది 2007లో సినీ పాత్రికేయురాలు మరియు రచయిత్రి భావనా సోమయ్యచే వ్రాయబడిన ఒక భారతీయ జీవితచరిత్ర పుస్తకం. ఇది భారతీయ నటి హేమ మాలిని జీవితం మరియు వృత్తిని వివరి స్తుంది. హేమకు నృత్యం చేయడం, డ్రైవింగ్ చేయడం మరియు యోగా చేయడం అభిరుచులు.

**ఆచార్య : మధుసూదన్ రెడ్డి బుర్ర**
**9949700037**

# న్యాయానికి వీఐపీ గేట్లు ఎందుకు?

**భారత రాజ్యాంగం 14వ అధికరణం "చట్టం ముందు అందరూ సమానులే'' అని స్పష్టంగా ప్రక టిస్తుంది. కానీ న్యాయవ్యవస్థలో వీఐపీ కల్చర్, భాషా అడ్డంకులు, అవినీతి ఆరోపణలు, పారదర్శకత లోపం వంటి సమస్యలు ఈ హామీని కేవలం కాగితపు మీదే మిగిల్చాయి. పేదవాడి కేసు సంవత్సరాల తేదీల్లో ఆల స్యమవుతుంటే, ప్రభావవంతులు రాత్రికి రాత్రే బెయిలు పొందుతున్నారు. ఈ అసమానతలు ప్రజల న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. సుప్రీం కోర్టు సీజేఐ డి.వై. చంద్రచూడ్ 2023లో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా 9,423 తీర్పులను 14 ప్రాంతీయ భాషల్లోకి అనువదించినట్లు ప్రకటించారు. ఇది సానుకూల అడుగు అయినప్పటికీ, జిల్లా-మండల స్థాయి కోర్టుల్లో ఇంకా ఆచరణలోకి రాలేదు. సామాన్యుడికి న్యాయం అందుబాటులో ఉండాలంటే వ్యవస్థాగత సంస్కరణలు తప్పనిసరి.**

వ్యవస్థ ఎక్కడ తడబడుతోంది?

న్యాయం అందించడంలో భాషా అడ్డంకి ప్రధాన సమస్య. చాలా తీర్పులు ఆంగ్లంలో ఉండటం వల్ల సామాన్య ప్రజలకు అర్థం కాక పోవడం, లాయర్లపై ఆధారపడటం తప్పనిసరి అవుతోంది. అవినీతి కేసుల్లో కోర్టు ఫీజు, లాయర్ ఖర్చులు పేదలను ఇంకా దోచుకుం టున్నాయి. e-Courts ప్రాజెక్ట్ ద్వారా కేసు స్టేటస్ ఆన్‌లైన్ చూడవచ్చు కానీ, గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అక్షరాస్యత లోపం, సరైన అవగాహన లేకపోవడం సమస్యను కొనసాగి స్తున్నాయి. మరోవైపు, న్యాయవ్యవస్థ భారీ బ్యాక్‌లాగ్‌తో పోరాడుతోంది. ఇది కేవలం ఉద్యోగుల కొరత కాదు, నిర్మాణాత్మక సమస్య. గ్రామ న్యాయాలయాల చట్టం 2008 ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేగవంతమైన న్యాయం అందించాలని లక్ష్యం పెట్టుకున్నా, 2019 నాటికి కేవలం 208 మాత్రమే కార్యకలాపాలు సాగుతున్నాయని గణాంకాలు చెబుతు న్నాయి. ఇది ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని, అధికా రుల నిరాసక్తిని బయటపెడుతుంది.

ఒకే చట్టం, ఒకే న్యాయం

"ఒకే చట్టం – ఒకే న్యాయం" సూత్రంతో అరెస్టు నుంచి బెయిలు వరకు ఏకరూప ప్రక్రియ అమలు చేయాలి. వీఐపీలకు ప్రత్యేక సౌకర్యాలు లేకుండా సాధారణ లాకప్‌లు వర్తింపజేయాలి. ప్రతి తీర్పుకు తెలుగు సారాంశం, ఆడియో రూపం కోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలి. ఈ-కోర్ట్స్ 2.0 ద్వారా కేసు స్టేటస్, తేదీలు ఎస్ఎమ్ఎస్/వాట్స్ అప్ ద్వారా నేరుగా ప్రజలకు చేరాలి. ప్రతి మండల కేంద్రంలో నెలవారీ గ్రామ న్యాయ సదస్సులు నిర్వహించి, జడ్జి, లాయర్లు, పోలీసులు కలిసి ప్రజల సమస్యలు పరిష్కరించాలి. సుప్రీం కోర్టు ఇప్పటికే ప్రారంభించిన భాషా అనువాద కార్య క్రమాన్ని అన్ని హైకోర్టు, జిల్లా కోర్టులకు విస్త




రించాలి. ఇవి అమలైతే మాత్రమే న్యాయం సామాన్యుడి చేతికి చేరుతుంది.

న్యాయం సుస్థిరమైతేనే ప్రజాస్వామ్యం బలప డుతుంది

చట్టం గ్రంథాల్లో కాకుండా ప్రజల మనసుల్లో బతకాలి. "నాకు న్యాయం జరుగుతుంది" అనే ధైర్యం ప్రతి పౌరుడిలో కలగాలి. ఇది కేవలం సంస్కరణల విషయం కాదు, ప్రజాస్వామ్యాన్ని రక్షించే జాతీయ కర్తవ్యం. ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ, సమాజం కలిసి పనిచేస్తే మాత్రమే రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం నిజం అవుతుంది. అప్పుడు అడవుల మధ్యనైనా, నగరాల మధ్యనైనా ప్రతి ప్రజలకు న్యాయం అందుబాటులో ఉంటుంది. ఇదే అసలైన స్వాతంత్ర్యం.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

# బొప్పాయి గింజలను పడేస్తున్నారా..?

బొప్పాయి పండ్ల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అందరికీ తెలిసిందే.. ఎన్నో పోషకాలున్న బొప్పాయి.. జీర్ణవ్యవస్థకు, దంత సమస్యలకు, రక్త సరఫరాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే, చాలామంది పడేసే బొప్పాయి విత్తనాలలోనూ అద్భుతమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. వీటిని నిర్భయంగా తినవచ్చని, ముఖ్యంగా పరగడుపున తీసుకోవడం వల్ల ఎన్నో లాభాలు కలుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. బొప్పాయి గింజలు పోషకాల నిధి. వీటిలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి శరీరంలో వాపులను తగ్గించడంతోపాటు.. పేగుల్లోని క్రిములను నాశనం చేయడంలో సహాయపడతాయని పేర్కొంటున్నారు.



**బొప్పాయి విత్తనాల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు:**
వ్యాధి నిరోధక శక్తి: బొప్పాయి విత్తనాలలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర రోగ నిరోధక శక్తిని పెంపొందించి, జ్వరం, జలుబు, దగ్గు వంటి ఇన్‌ఫెక్షన్లు దరిచేరకుండా కాపాడతాయి.

**జీర్ణక్రియ మెరుగుదల:**
బొప్పాయి విత్తనాలు జీర్ణవ్యవస్థకు అత్యంత ప్రయోజనకరం. ఇవి జీర్ణాశయంలో ఉండే క్రిములను నాశనం చేసి, ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకుంటాయి. కడుపులో ఉండే పలు రకాల పురుగులను నశింపజేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

**విష పదార్థాల నిర్మూలన**
: ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున బొప్పాయి విత్తనాలను తీసుకోవడం వల్ల శరీరంలో పేరుకుపోయిన విష పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రపడి, అవయవాల్లోని వ్యర్థాలు తొలగింపబడతాయి.

**బరువు నియంత్రణ:**






బొప్పాయి విత్తనాలలో ఉండే ఔషధ గుణాలు శరీర బరువును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి శరీర మెటబాలిజం రేటును పెంచి, త్వరగా బరువు తగ్గేందుకు దోహదపడతాయి.

**క్యాన్సర్ నివారణ**
: ఓ యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం.. బొప్పాయి విత్తనాలు క్యాన్సర్ కణాలు, ట్యూమర్ల వృద్ధిని అడ్డుకుంటాయి. పలు క్యాన్సర్లను నివారించే శక్తి వీటికి ఉంది. కడుపు, పేగుల్లో వృద్ధి చెందే హానికర బ్యాక్టీరియాలను ఇవి నిర్మూలిస్తాయి.

మధుమేహం, గుండె జబ్బుల నియంత్రణ: బొప్పాయి విత్తనాలు మధుమేహం, గుండె జబ్బుల వంటి ప్రమాదకర వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలోని ఔషధ గుణాలు ఈ వ్యాధుల తీవ్రతను తగ్గిస్తాయి.

**కాలేయం, కిడ్నీ ఆరోగ్యం:**
రోజు ఓ స్పూన్ బొప్పాయి విత్తనాలను తీసుకోవడం వల్ల కాలేయం, కిడ్నీ సంబంధిత వ్యాధులు దరిచేరవని హామీ ఇస్తున్నారు. నెల రోజుల పాటు 5 లేదా 6 విత్తనాలను పండ్ల రసం లేదా నిమ్మరసంతో కలిపి తీసుకోవడం వల్ల కాలేయం శుభ్రపడుతుంది.

**కండరాల దృఢత్వం:**



బొప్పాయి విత్తనాలు కండరాలను దృఢంగా మార్చడంలో సహాయపడతాయి. మనం తినే ప్రోటీన్లు సక్రమంగా వినియోగపడి, కండరాల సమస్యలు తొలగిపోయి, కండరాలు చక్కగా నిర్మాణం అవుతాయి.

**నొప్పి నివారణ, వాపుల తగ్గింపు:**
బొప్పాయి విత్తనాలలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. ముఖ్యంగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఇవి ఎంతగానో మేలు చేస్తాయి.

**యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు:**
బొప్పాయి విత్తనాలకు యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ ధర్మాలు ఉన్నాయి. ఇవి ఈ. కోలి వంటి బ్యాక్టీరియాలను నిర్మూలించడంలో సమర్థవంతంగా పనిచేస్తాయి. డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకుంటాయి.

**పురుషుల సంతానోత్పత్తి:**
బొప్పాయి విత్తనాలు పురుషులలో వీర్య నాణ్యతను పెంచి, శృంగార సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తాయి.

**ఎలా తీసుకోవాలి?**
ఎవరైనా రోజుకు రెండు టేబుల్ స్పూన్ల మోతాదులో బొప్పాయి విత్తనాలను తీసు కోవచ్చు. నేరుగా తినలేని వారు వాటిని పొడి చేసుకొని మజ్జిగ లేదా సలాడ్లలో కలుపుకొని తినవచ్చు. 5 లేదా 6 బొప్పాయి విత్తనాలను నలిపి ఏదైనా పండ్ల రసం లేదా నిమ్మరసంతో కలిపి తీసుకోవడం కూడా ప్రయోజనకరమే..

### తక్కువ తీసుకుంటున్నామని

# సంబర పడకండి..

### ఈ అలవాటే ఆ డేంజర్ వ్యాధికి పునాది!

అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. ఎక్కువ స్వీట్స్, అది కూడా షుగర్‌తో తయారు చేసినవి తీసుకోవడం వల్ల మెదడు పనితీరు తగ్గడం, జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం తగ్గి, మతిమరుపు రావడానికి అవకాశాలు ఉన్నాయని తేలింది. స్వీటెనర్లలో తక్కువ క్యాలరీలు ఉన్నప్పటికీ.. ఇవి దీర్ఘకాలంగా తీసుకోవడం వల్ల మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని యూనివర్సిటీ ఆఫ్ సావో పాలో పరిశోధకురాలు డాక్టర్ క్లాడియా కిమీ సుమోటో తెలిపారు.



**పరిశోధన ప్రకారం..**
ఈ అధ్యయనం కోసం పరిశోధకులు అస్పార్టేమ్, సాకరిన్, ఎసిసల్ఫేమ్ కె, ఎరిత్రిటాల్, జైలిటాల్, సోర్బిటాల్, టాగటోస్ వంటి ఏడు రకాల తక్కువ క్యాలరీలు కలిగిన స్వీటెనర్లను వాడిన సుమారు 13,000 మంది పెద్దల డేటాను పరిశీలించారు. అయితే ఎక్కువ మొత్తంలో ఈ స్వీటెనర్లను తీసుకున్న వారిలో మెదడు పనితీరు తగ్గే వేగం 62 శాతం ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ముఖ్యంగా షుగర్ ఉన్నవారిలో దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఓ మోతాదులో స్వీటెనర్లను తీసుకున్న వారిలో మెదడు పనితీరు తగ్గుదల వేగం 35 శాతం ఉన్నట్టు తేలింది. డయాబెటిస్‌తో బాధపడే చాలా మంది షుగర్ తీసుకుంటే ఇంకా ప్రమాదమని.. ఇలాంటి తక్కువ క్యాలరీలు కలిగిన స్వీటెనర్లను ఎక్కువగా వాడుతూ ఉంటారు. కానీ వయసుతో సంబంధం లేకుండా ఇవి మెదడు పనితీరుపై ప్రభావం చూపుతున్నాయని పరిశోధకులు పేర్కొన్నారు.

### కేబుల్, డీటీహెచ్ ఛార్జీలు

# 6 రెట్లు పెరగనున్నాయా?

ఈ రోజుల్లో టీవీల నిలిపివేత సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మోదీ ప్రభుత్వం నిర్ణయంతో త్వరలో 11 కోట్ల టీవీలు మూగబోనున్నాయని, దీనివల్ల టీవీ ప్రసారాలు గణనీయంగా ఖరీదైనవిగా మారతాయని ఒక వైరల్ పోస్ట్ పేర్కొంటోంది.

**దీని వెనుక అసలు నిజాలు ఏంటో తెలుసుకుందాం..**

వైరల్ అవుతున్న ఆ పోస్ట్‌లో ఇలా ఉంది. "మోదీ ప్రభుత్వం తీసుకునే మరో నిర్ణయంతో 11 కోట్ల టీవీలు మూతపడతాయి. ఇప్పటికే మొబైల్ ఫోన్ల కారణంగా కోట్ల టీవీలు మూతపడ్డాయి. టీవీ పరిశ్రమ తీవ్ర ప్రమాదంలో ఉంది. ప్రభుత్వం దానికి ఘోరమైన దెబ్బ కొట్టింది." సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ జూన్ 12న కొత్త నిబంధనల ముసాయిదాను సమర్పించింది. టీవీ ప్రసార, టెలికాం కంపెనీలకు ఏకరూప నిబంధనలు ఉంటాయి. ఈ ఏకరూప నిబంధనల ద్వారా ప్రభుత్వానికి గణనీయమైన లైసెన్స్ ఫీజులు సమకూరుతాయి.

దీని కారణంగా టీవీ ప్రసారాలు చాలా ఖరీదైనవిగా మారతాయని కూడా ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.




సర్వీస్ ప్రొవైడర్లు, కేబుల్ ఆపరేటర్లు తమ ఛార్జీలను నాలుగు నుంచి ఆరు రెట్లు పెంచుతారు. డిటిహెచ్, కేబుల్ టీవీలు కనుమరుగవుతాయి. ఒక్క దెబ్బతో టీవీ సేవలు నిలిచిపోవడమే కాకుండా, లక్షలాది మంది ప్రజలు తమ ఉద్యోగాలను కోల్పోతారంటూ ఓ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**అసలు నిజం ఏంటంటే..**

కేబుల్, డీటీహెచ్చా ర్జీలు 4 నుంచి 6 రెట్లు పెరగనున్నాయనే వార్తల్లో ఎలాంటి నిజం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ప్రకటన ఏదీ చేయలేదు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఈ వార్తలను కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ




ఆధ్వర్యంలోని (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) పూర్తిగా ఖండించింది. దేశంలో టీవీ సేవలను మూసివేసేలా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిబంధనలను అమలు చేయలేదని పీఐబీ తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో స్పష్టంగా పేర్కొంది.

టెలికమ్యూనికేషన్స్ (టెలివిజన్, రేడియో, సంబంధిత సేవలు) నియమాలు, 2026 ముసాయిదాను ఎంఐబి విడుదల చేసిందని, దీనిపై 2026 జూలై 27 వరకు ప్రజలు, భాగస్వాముల నుండి అభిప్రాయాలను కోరుతున్నారని పిఐబి కూడా రాసింది. ఈ ముసాయిదా నియమాలలో ఎలాంటి రుసుము పెంపునకు సంబంధించిన నిబంధన లేదు. టీవీ, రేడియో సేవల కోసం జారీ చేసిన వివిధ మార్గదర్శకాలను ఏకీకృతం చేయడమే ఈ నియమాల లక్ష్యం. ప్రస్తుత వ్యవస్థను సరళీకరించి, సమన్వయం చేయడం ద్వారా టీవీ, రేడియో ప్రసార రంగం సజావుగా పనిచేయడానికి వీలు కల్పించడం వీటి ఉద్దేశ్యం.

## బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు..

### సెన్సెక్స్ 443 పాయింట్లు డౌన్



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా మళ్లీ క్రూడాయిల్ ధరలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, దేశీయంగా బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి తదితర కారణాలు సూచీలపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లు కోల్పోగా.. ఆఖర్లో కోలుకుంది. నిఫ్టీ ఫార్మా, మెటల్ స్టాక్స్ రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 88 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4021 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

సెన్సెక్స్ ఉదయం 78,151.45 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఆపై నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా నష్టంతో 77,368.29 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 442.93 పాయింట్ల నష్టంతో 77,708.52 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 95.80 పాయింట్ల నష్టంతో 24,238.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.44గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ట్రెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమనడంతో క్రూడాయిల్ ధరలకు రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఇంట్రాడేలో 4 శాతం పెరిగి 91 డాలర్ల స్థాయికి చేరింది. దీంతో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి.
ఆసియా మార్కెట్లు కూడా బలహీనంగా ప్రారంభం కావడం మన మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పీ 4 శాతం చొప్పున నష్టపోయాయి.
దేశీయంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. శనివారం త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన ఈ బ్యాంకుల మార్జిన్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5 శాతం, యాక్సిస్ బ్యాంక్ 6 శాతం మేర పతనమయ్యాయి

### ఈక్విటీలపై LTCG రద్దు

## ప్రతిపాదన లేదు: కేంద్రం

ఈక్విటీల్లో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడంలో భాగంగా దీర్ఘకాల మూలధన లాభాల పన్నును (LTCG Tax) పూర్తిగా తొలగించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్న వేళ.. కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎల్‌టీసీజీ ట్యాక్స్ రద్దు చేసే అంశంపై ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టంచేసింది. బడ్జెట్ ప్రక్రియలో భాగంగా మూలధన లాభాల రేట్లు సహా పన్ను విధానాలను క్రమానుగతంగా సమీక్షిస్తామని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పార్లమెంట్‌లో వెల్లడించారు.

2024–25 మదింపు సంవత్సరంలో రూ. 72,249 కోట్లు ఎల్‌టీపీజీ ట్యాక్స్‌ను వసూలు చేసినట్లు పంకజ్ చౌదరి వెల్లడించారు. 2025–26 మదింపు సంవత్సరంలో ఈ పన్ను వసూళ్లు 78 శాతం పెరిగి రూ. 1,29,158 కోట్లకు చేరినట్లు తెలిపారు. రెండేళ్లలో మూలధన లాభాలపై పన్ను రూపేణా రూ. 2.01 లక్షల కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు.

సాధారణంగా షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్స్‌ను దేశీయ, రిటైల్ ఇన్వెస్టర్లు 12 నెలల కంటే ఎక్కువకాలం పాటు హోల్డ్ చేస్తే వాటిని లాంగ్ టర్మ్ అసెట్స్‌గా పరిగణిస్తారు. వీటిపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్నును వసూలు చేస్తారు. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 1.25 లక్షల కంటే ఎక్కువ ఆర్జించిన మొత్తానికే ఈ పన్ను వర్తిస్తుంది. అయితే, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను పెద్దమొత్తంలో తరలించుకుపోయిన నేపథ్యంలో లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ విషయంలో కేంద్రం కీలక మార్పు చేసింది. ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎఫ్‌పీఐల పెట్టుబడులపై పన్నును పూర్తిగా మినహాయింపు ఇస్తూ కేంద్రం ఓ ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈక్విటీ పెట్టుబడులపై మాత్రం దేశీయ పెట్టుబడిదారులతో సమానంగా విదేశీ మదుపర్లు కూడా 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది.



### చంద్రుడిపై కాలు మోపిన తొలి వ్యక్తి

# 'నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్'

అమెరికాకు చెందిన నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) సాధించిన అద్భుత విజయ చరిత్రగా 20 జూలై 1969 నిలుస్తున్నది. ఇదే రోజు నాసా ప్రయోగించిన "అపోలో 11" అంతరిక్ష నౌకలో "నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్" చందమామ ఉపరితలంపై తొలి మానవ కాలు మోపడం జరిగింది. ఈ అపూర్వ ఘటనకు గుర్తుగా ప్రతి ఏట 20 జూలై రోజున "అంతర్జాతీయ చందమామ దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ మూన్ డే" నిర్వహించాలని నాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ చేసిన ప్రతిపాదనతో 1975 నుంచి పాటించడం కొనసాగుతున్నది.

అపోలో 11 చంద్రుడి ఉపరితలంపై దిగిన ఆరు గంటల తర్వాత బయటకు వచ్చి చంద్రుడి ఉపరితలంపై కాలు మోపి రెండున్నర గంటల పాటు తిరుగుతూ అధ్యయనం చేయడం విశేషం. అదే అంతరిక్ష నౌకలో ఉన్న బజ్ ఆల్డ్రిన్ అనే వ్యోమగామి చందమామపై కాలు మోపిన రెండవ వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారు. వీరిరువురు కలిసి చంద్ర మండలంపై కలియ తిరుగుతూ, 47.5 పౌండ్ల పదార్థాలను పరిశోధనల నిమిత్తం సేకరించడం జరిగింది. అపోలో 11లో ప్రయాణించిన మూడో వ్యక్తి పైలెట్ మైఖేల్ కోలిన్స్ చంద్రమండలంపైకి దిగకుండా ఆ ఇరువురు వచ్చేంతవరకు నౌకలోనే వేచి ఉన్నారు. ఈ అంతరిక్ష అద్భుత ఘటనను అమెరికన్లు, ప్రపంచ మానవాళి తమ తమ టీవీల్లో చూసి ఆశ్చర్యచకితులు కావడం జరిగింది.

**నాటి ఓ చిన్న అడుగు,**
**నేటి ఓ భారీ ముందడుగు:**
చందమామ ఉపరితలంపై ప్రథమ అడుగు వేసిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వెంటనే మాట్లాడుతూ "నేడు మనిషి వేసిన ఓ చిన్న అడుగు, రేపటి తరం మానవాళికి భారీ ముందడుగు" అంటూ అభివర్ణించడం సముచితంగా ఉన్నది. 1969–72 మధ్య ఆరు అంతరిక్ష వ్యోమనౌకలు అపోలో 11తో పాటు అపోలో–12, 14, 15, 16, 17ల ద్వారా 12 మంది వ్యోమగాములు చంద్రమండల ఉపరితలంపై కాలు మోపడం జరిగింది. అంతర్జాతీయ చందమామ దినం–2026 ఇతివృత్తంగా "వన్ మూన్, వన్ విజన్, వన్ ఫ్యూచర్ (ఒకే చంద్రుడు, ఒకే లక్ష్యం, ఒకే భవిష్యత్తు)" అనబడే అంశాన్ని తీసుకొని




ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది.

**చందమామ పుట్టుక, మనుగడ:**
స్వయం ప్రకాశిత అతి భారీ అంతరిక్ష గోళాలను నక్షత్రాలు అని, సూర్యుడి లాంటి నక్షత్రం చుట్టు తిరిగే స్వయం ప్రకాశితం కాని అంతరిక్ష గోళాలను గ్రహాలు అని, గ్రహాల చుట్టూ తిరిగే స్వయం ప్రకాశితం కాని అంతరిక్ష గోళాలను ఉప గ్రహాలు అని పిలుస్తున్నాం. శాస్త్రీయ పరికల్పన ప్రకారం, 4.6 బిలియన్ సంవత్సరాల క్రితం భూమి, అంగారక గ్రహం ఢీకొనడం ఫలితంగా చంద్రుడు అనే శాశ్వత ఉపగ్రహం ఏర్పడింది. భూమితో పోల్చితే నాలుగు రెట్లు చిన్నదైన చందమామ వ్యాసార్థం 3,479 కిమీలు, ద్రవ్యరాశి భూమి కన్న 80 రెట్లు తక్కువగా ఉంటూ, సాంద్రత ఘనపు మీటర్‌కు 3,340 కేజీలు ఉంటుంది. భూమి నుండి 2.39 లక్షల కిమీ దూరంలో ఉన్న చంద్రుడి ఉపరితలంపై సగటు ఉష్ణోగ్రత 107 డిగ్రీల సెల్సియస్, రాత్రి పూట –153 డిగ్రీలతో ఉంటూ, 27.3 రోజులకు ఒకసారి భూమి చుట్టు తిరుగుతుంది. చందమామ స్వయం ప్రకాశితం కానప్పటికీ సూర్యుడి కిరణాలు చంద్రుడిపై పడి పరావర్తనం చెందడంలో రాత్రి వేళల్లో చల్లని వెన్నెలల వర్షాలు కురిసినట్లు చక్కటి అనుభూతి పొందుతాం. సౌర మండలంలో 5వ అతి పెద్ద ఉపగ్రహమైన చందమామ, భూమి చుట్టూ తిరిగే అతి పెద్ద సహజ ఉపగ్రహంగా పేరుగాంచింది. భూకంపాలను పోలిన చంద్ర కంపనాల్లో పలు వాయువులు విడుదల అవుతాయని గమనించారు.

**ఇస్రో చంద్రయాన్ ప్రయాణ ప్రయోగాలు:**
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ అయిన ఇస్రో తలపెట్టిన చంద్రయాన్–1 వ్యోమనౌక చంద్రుడి కక్ష్యలో 22 అక్టోబర్ 2008 నుంచి 28 ఆగష్టు 2009 వరకు పరిశోధించడం జరిగింది. చంద్రయాన్–2 ప్రయోగంలో 20 ఆగస్టు 2019 రోజున చంద్రుడి కక్ష్యలోకి విజయవంతంగా చేరిన తర్వాత హార్డ్ ల్యాండింగ్ కారణంగా ప్రయోగం పూర్తి కానప్పటికీ 98 శాతం వరకు ప్రయోగ లక్ష్యాలను చేరుకుందని ఇస్రో తెలపడం గమనార్హం. 23 ఆగష్టు 2023న చంద్రయాన్–3 వ్యోమనౌక చంద్రుడి దక్షిణ ధృవ , బైనాక్యులర్స్ లేదా టెలిస్కోప్ వంటి ఉపకరణాల సహాయంతో సూర్య, చంద్రులను గ్రహణాలను చూడడం, మానవాళి శ్రేయస్సుకు ఉపయోగపడే పరిశోధనల మాలాలను అర్థం చేసుకోవడం లాంటి అంశాలను నిర్వహించవచ్చు. ఖగోళ, అంతరిక్ష శాస్త్రాలను వృత్తిగా నేర్చుకొని అంతరిక్ష అద్భుతాలను ఆవిష్కరించే ప్రయత్నాలకు నేటి యువత పూనుకోవాలని ఆశిద్దాం, అంతరిక్ష శాస్త్రవేత్తలను అభినందిద్దాం.


– ఆచార్య: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037


# హైదరాబాద్‌లో హామ్‌స్టెక్ క్రియేటర్స్ కలెక్ట్ 2026





**హైదరాబాద్ బ్యూరో, జూలై 20 (నినాదం ):** హామ్ స్టెక్ కాలేజ్ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్ నిర్వహించిన హామ్ స్టెక్ క్రియేటర్స్ కలెక్ట్ 2026" ఘన విజయాన్ని సాధించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సృజనాత్మక వేడుకకు 10 వేల మందికి పైగా సందర్శకులు హాజరయ్యారు. లిలి900 మందికి పైగా గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులు తమ ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, ఫోటోగ్రఫీ, మేకప్, కులినరీ ఆర్ట్స్ రంగాల్లో రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. జాతీయ అవార్డు గ్రహీత ఫ్యాషన్ డిజైనర్ నీతా లుల్లా, ప్రముఖ సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అవినాష్ గోవారికర్ జ్యూరీ సభ్యులుగా పాల్గొని విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు.

ఈ సందర్భంగా హామ్ స్టెక్ ఏ ఐ ఆధారిత కొత్త పాఠ్యాంశం, లైఫ్‌టైమ్ కెరీర్ సపోర్ట్, హామ్ స్టెక్ లాంచ్‌ప్యాడ్ పేరుతో స్టార్టప్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రకటించింది. అలాగే సంజయ్ ఘోడావత్ యూనివర్సిటీ (కొల్హాపూర్), ఎస్ఆర్ యూనివర్సిటీ (వరంగల్)తో భాగస్వామ్యంలో రెండు కొత్త స్కూల్స్ ఆఫ్ డిజైన్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. హామ్ స్టెక్ సీఈఓ అజితా యోగేష్ మాట్లాడుతూ, సృజనాత్మక విద్యను సాంకేతికత, పరిశ్రమ అవసరాలు, పారిశ్రామిక అవకాశాలతో అనుసంధానం చేసి విద్యార్థులను భవిష్యత్‌కు సిద్ధం చేయడమే తమ లక్ష్యమనీ తెలిపారు.









## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**దుబ్బాక,జులై 20( నినాదం):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుబ్బాకలో 2026--27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని తెలిపారు. కళాశాలలో కామర్స్ -- 2, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ -- 1, తెలుగు -- 1, మ్యాథమెటిక్స్ -- 1, రాజనీతి శాస్త్రం -- 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను జత చేసి జులై 22వ తేదీ సాయంత్రం లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుబ్బాక అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. పీజీ (గ్రే+) అర్హతతో పాటు రాజు, చీజు లేదా ప్లాస్ట్.ఇ. అర్హతలు కలిగిన అభ్యర్థులకు నియామక ప్రక్రియలో ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని తెలిపారు.

## విద్యార్థినికి ఆర్థికసాయం అందజేత



**సిద్ధిపేట బ్యూరో, జూలై 20( నినాదం):** అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో బిట్ల శ్రీనిధి అనే అమ్మాయి 4వ తరగతి చదువుతుంది. గత కొంతకాలంగా అప్లాస్టిక్ అమ్నిషియా శరీరంలో రక్త కణాలు ఉత్పత్తి కాకపోవడం (రక్తహీనత )వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకుంటుంది. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో వారు గత కొంతకాలంగా హైదరాబాద్ లోనే ఉంటూ అమ్మాయికి చికిత్స చేస్తున్నారు. ఈ చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్నది కావడం తో దానికోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను ఆ పాఠశాలలో గతం లో పని చేసిన పూర్వ ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్న ప్రతిభా నేస్తం ఫౌండేషన్ సిద్ధిపేట వారు ఆ చిన్నారికి ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకుని వైద్య ఖర్చుల నిమిత్తం తమ వంతు సహాయంగా 20వేల రూపాయల ఆర్థిక సహాయం సోమవారం రోజున అందజేయడం జరిగింది. భవిష్యత్తులో కూడా ఆ చిన్నారి వైద్యానికి అయ్యే ఖర్చును కోసం స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభా నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోల రాజు , ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్ , కోశాధికారి నరసింహ చారి, పూర్వ ఉపాధ్యాయులు ర్యాకం మల్లేశం, అందె రామచంద్రశీ ,మద్దికుంట బాలకృష్ణ ,ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట రాజం, అనిల్, తో పాటు టి పి టి ఎఫ్ మండల అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి యొక్క తల్లిదండ్రులు ఫౌండేషన్ సభ్యులకు ఉపాధ్యాయులకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక

### సౌకర్యాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**వికారాబాద్, జూలై 20(నినాదం ):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల, హకీంపేట్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ పనులతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్న నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఐ ఏ ఎస్, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ లు సోమవారం భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి ముఖ్యమంత్రి పర్యటన మార్గం, హెలిప్యాడ్, ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర ప్రాంతాలను సందర్శించి, సంబంధిత శాఖల అధికారులతో భద్రతా, ట్రాఫిక్, పార్కింగ్ ఇతర ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పోలీసు అధికారులకు పలు కీలక సూచనలు చేస్తూ, ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని పేర్కొన్నారు. బందోబస్తును ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, హెలిప్యాడ్ నుంచి కార్యక్రమ ప్రాంగణాల వరకు ప్రతి ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ, యాంటీ సాబొటాజ్ తనిఖీలు, యాక్సెస్ కంట్రోల్, బారికేడింగ్, పార్కింగ్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా ఐ పి ఎస్, డీఎస్పీలు శ్రీనివాస్, జానయ్య, అంజయ్య, యాదయ్య, శ్రీనివాస్ లు కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర పోలీసు అధికారులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన స్వర్ణావధానం విజయోత్సవ సభ

### తెలుగు భాషా చైతన్యానికి నడుం బిగించిన అక్షర కౌముది సంస్థ



**అల్వాల్, జూలై 20 (నినాదం):** తెలుగు భాషా వికాసాన్ని నలుదిశలా వ్యాపింప చేస్తూ అక్షర సేద్యం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ అక్షర కౌముది సేవలు అభినందనీయం అని ప్రముఖ కవి రచయిత సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మల్కాజ్ గిరి పద్మావతి ఫంక్షన్ హాల్ జులై 18 19 తేదీల్లో శని ఆదివారాల్లో జరిగిన స్వర్ణావధానం విజయోత్సవ సభకు విచ్చేసి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నేటి రోజుల్లో సమాజంలో ఒక రంగంలో సేవలు చేయడమే భారంగా మారినాగాని అక్షర కౌముది సంస్థ సామాజిక సాంస్కృతిక సాహిత్య రంగాల్లో సేవలందిస్తూ సాహిత్య సేవల్లో భాగంగా అవధాన కార్యక్రమం నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా నామోజు బాలాచారి మాట్లాడుతూ పద్య సాహిత్యం వల్ల భాష వికాసం అవుతుందన్నారు, అవధాని నవయువకుడు అవధాన కౌముది నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అవధాని అవధాన కార్యక్రమంలో విచ్చేసిన ప్రాశ్నికులు అందరూ దాదాపు శతావధానులు అష్టావధానాలు పాల్గొనడం ఈ సభకి గర్వకారణం అన్నారు, ఈ అవధానంలో ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో భాషా కౌశలాలు పెంపొందుతాయన్నారు. అవధాని ధారణ శక్తి అమోఘం అని అన్నారు, అవధాన కార్యక్రమం లో సాధు వాస్యాని పాఠశాల విద్యార్థుల కు అవధాన వైశిష్ట్యాన్ని అవధాని సాహిత్ విద్యార్థులకు అర్థవంతంగా వివరించడం ప్రశంసనీయం అన్నారు. అక్షర కౌముది సంస్థ ప్రతి సంవత్సరం సంస్థ పక్షాన ఇచ్చే విశిష్ట పురస్కారాలు సందర్భంగా ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి కి సినారె సాహిత్య పురస్కారం ఇవ్వడం సంస్థకే కాకుండా సమాజానికి గర్వకారణమన్నారు, సాంస్కృతిక రంగంలో విశేష సేవలు అందించిన చక్కటి ప్రతిభావంతుడు హాస్యనటుడు బాబూమోహన్‌కు సంస్థ పక్షాన గురుసౌభాగ్య పురస్కారం ఇచ్చి సత్కరించడం అభినందనీయమన్నారు. అవధాన కార్యక్రమానికి సంచకత్వం వహించిన గురు సహస్రావధాని డా కడిమిళ్ళ వరప్రసాద్ కు,అవధాని సాహిత్ ను శాలువ తో సత్కరించి గౌరవ పారితోషికం అందచేశారు. సంస్థ అధ్యక్షురాలు తులసి విజయ లక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించడానికి సంస్థ సభ్యులు నిరంతరం ప్రణాళిక సిద్ధం చేసుకొని చక్కగా నిర్వహించాం అని అన్నారు, భాష పరిరక్షణకు సంస్థ ముందుంటుందని అన్నారు, ఈ కార్యక్రమంలో మధురభారతి మల్లాప్రగడ శ్రీమన్నారాయణ ,మారుమాముల దత్తాత్రేయ శర్మ, కంద్లకుంట యాదగిరా చార్యులు, చిలకమర్రి లక్ష్మీనాథ చార్యులు,మేడ్చల్ మల్కాజ్ గిరి బి జె పి కోశాధికారి జీడి బాలచందర్ గౌడ్ తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బదే సాబ్,శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం అర్చకులు ముదుంబై వెంకట రమణా చార్యులు, వేదాల గాయత్రి, సరస్వతి, వెలుదండ సత్యనారాయణ, వాసుదేవరావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా తులసి వెంకట రమణా చార్యులు, ప్రధాన కార్యదర్శి మూర్తి శ్రీదేవి, కోశాధికారి బచ్చుల మాధవి సంయుక్త కార్యదర్శి పోచం సుజాత, తాళ్లూరి వెంకట కృష్ణ,గూటూరి సత్యనారాయణ , సూర్యకుమారి, పలువురు సాహితీ వేత్తలు కవులు రచయితలు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోపు ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలి





### నాణ్యతకు ప్రాధాన్యత
### ఆస్పత్రి పనులపై ఎమ్మెల్యే కసిరెడ్డి సమీక్ష

**ఆమనగల్లు, జూలై 20(నినాదం):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో రూ. 17.50 కోట్లతో నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తన స్వగృహంలో కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఈఈ రామ్మోహన్ రెడ్డి, డిఈ కోటయ్య, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు,ఎచ్ఈఓ తిరుపతి రెడ్డి,పిఆర్ఓ దేవేందర్ రెడ్డి తదితర అధికారులు హాజరయ్యారు. పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు, వివిధ విభాగాల ఏర్పాట్లు, పనుల వేగంపై ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, నిర్ణీత గడువులోపు ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వైద్య పరికరాలు, లిఫ్టు, మార్చురీ ఏర్పాటుతో పాటు భవనాన్ని రోడ్డు కన్నా ఎత్తుగా నిర్మించాలని సూచించారు. అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేసి, నాణ్యమైన టైల్స్‌తో భవనాన్ని అప్పగించాలని గుత్తేదారుని ఆదేశించారు. ఆస్పత్రికి కావాల్సిన స్టాఫ్ క్యాడర్ స్ట్రెంత్ గురించి మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించేందుకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్ బాబా, ఆమనగల్లు మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, జూనియర్ అసిస్టెంట్ సాయి,సిఎచ్సీ సైట్ ఇంచార్జ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే..

### డాక్టర్ మెతుకు ఆనంద్



**వికారాబాద్, జూలై 20(నినాదం ):** వికారాబాద్ నియోజకవర్గం, కోటపల్లి మండలం, బీరోల్, జిన్నారం గ్రామాలలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమ వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. తదనంతరం పార్టీ నాయకులతో కలిసి సమావేశమై ఈ విధంగా స్పందించారు. రాబోయేది కెసిఆర్ ప్రభుత్వమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వము వచ్చిన తరువాత ఏమేమి కోల్పోయారో ప్రజలకు అర్థమైందని గ్రామాలలో మంచినీళ్లు, విద్యుత్ సరఫరా సక్రమంగా ఇవ్వలేకపోతున్న చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన దుయ్యాబట్టారు. రైతులను పూర్తిగా విస్మరించిన ఏకైక ప్రభుత్వమని అన్నారు. ఎల్ నినో వస్తుందని వాతావరణ శాస్త్రవేత్తలు ముందే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని అన్నారు. రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి భవిష్యత్ లో తగిన గుణపాఠం చెబుతారని చెప్పారు. పలుమార్లు రైతుబంధు ఎగ్గొట్టి, ఇటీవల కొద్ది మందికి వేసి, చేతులు దులుపుకున్నట్లు ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తగిన శాస్తీ చేస్తారాని అన్నారు. తొందరలో భారత రాష్ట్ర సమితి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీరోల్ గ్రామ సర్పంచ్ మూల సుధాకర్, జిన్నారం గ్రామ సర్పంచ్ మహమ్మద్ హుస్సేన్, పీఏసీఎస్ చైర్మన్ రామ్ చంద్ర రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు సుందరి అనిల్, మండల సర్పంచ్ ల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, కరీంపూర్ సర్పంచ్ సాదత్ పటేల్, ఆయా గ్రామాల బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచులు మాజీ ఎంపిటీసీలు తదితరులు పాల్గొన్నారు.

### సిఎం రాకకై ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**కొడంగల్, జులై 20(నినాదం):** కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల, హకీంపేట్ లలో నిర్మాణం లో ఉన్న పలు అభివృద్ధి పనులను పరిశీలించుటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా లు పరిశీలించారు. హెలిప్యాడ్, ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర ప్రాంతాలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో భద్రతా, ట్రాఫిక్, పార్కింగ్, వంటి ఇతర ఏర్పాట్లు పై సమీక్షించారు. కట్టుదిట్టమైన భద్రతా కల్పించాలని, ట్రాఫిక్ నియంత్రణ, యాంటీ సాబొటాజ్ తనిఖీలు, యాక్సెస్ కంట్రోల్, బారికేడింగ్, పార్కింగ్ నిర్వహణ ను సమర్థవంతంగా చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డిఎస్పీ లు శ్రీనివాస్, జానయ్య, అంజయ్య, యాదయ్య, శ్రీనివాస్, కడ అధికారి వెంకట్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వానల కోసం బొడ్రాయికి ప్రత్యేక పూజలు





**ఆమనగల్లు, జూలై 20(నినాదం):** కడ్తాల్ గ్రామంలో వర్షాలు కురవాలని, రైతుల కష్టాలు తీరాలని కోరుతూ సోమవారం గ్రామ దేవత బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, గ్రామస్తులు, రైతులు కలిసి బొడ్రాయికి నీళ్లతో అభిషేకాలు చేశారు. ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని గ్రామస్థులంతా వేడుకున్నారు. ప్రస్తుత సాగు కాలంలో సరైన వర్షాలు లేక ఆందోళన చెందుతున్న రైతన్నలకోసం, గ్రామ ప్రజలు వాన దేవుడినికి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. పంటలు సమృద్ధిగా పండి, రైతులు సంతోషంగా ఉండాలని కోరుకుంటూ గ్రామ దేవత బొడ్రాయికి గ్రామ పెద్దలు, మహిళలు కలిసి ప్రత్యేక పూజలు, నీళ్లతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత కొంతకాలంగా వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని. సాగునీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రకృతి కరుణించి, వానలు సమృద్ధిగా కురివాలని, తద్వారా రైతుల కష్టాలు తీరాలని మనస్ఫూర్తిగా గ్రామ దేవతకు ప్రత్యేక పూజలతో వేడుకున్నట్లు తెలిపారు. బొడ్రాయి సాక్షిగా వాన దేవుడు కరుణిస్తాడని, త్వరలోనే వర్షాలు కురిసి రైతుల ముఖాల్లో సంతోషం చూడాలని గ్రామస్థులంతా ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి నర్సింహా రెడ్డి, ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, గూడ రాములు, ఎలగమోని సత్యం, మూడ అశోక్, బోసు బుచ్చయ్య, లక్ష్మీ నరసింహారెడ్డి, సురేష్, అమృతం పాండు, మీగడి అంజయ్య, సిరిగిరి రవి, జంగా చారి, దేవమ్మ, చంద్రకళ,నవీన్, సురేష్ గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 19న పటాన్చెరు యాదవ సంఘం ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవం





### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, జూలై 20 (నినాదం):** పటాన్చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ లో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన యాదవ సంఘం కళ్యాణ మండపాన్ని ఆగస్టు 19న ప్రారంభించబోతున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం మాజీ ప్రజా ప్రతినిధులు, యాదవ సంఘం ప్రతినిధులు, బల్దియా ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఫంక్షన్ హాల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఫంక్షన్ హాళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో నియోజకవర్గం వ్యాప్తంగా కళ్యాణ మండపాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పటాన్చెరు పట్టణంలోని యాదవుల కోసం ఆధునిక హంగులతో, పూర్తి సౌకర్యాలతో కళ్యాణ మండపాన్ని నిర్మించినట్లు తెలిపారు. అందరి అభిప్రాయాలకు అనుగుణంగా ఆగస్టు 19న కళ్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపానదేవ్, మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, డిఈ కృష్ణవేణి, యాదవ సంఘం అధ్యక్షులు దేవయ్య యాదవ్, వైస్ ప్రెసిడెంట్ మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, యాదగిరి యాదవ్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించండి


### కలెక్టర్ మను చౌదరి ఆదేశం
### మేడ్చల్ మల్కాజిగిరి(ఐడిఓసి) లో ప్రజావాణి అర్జీల స్వీకరణ



**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 20 (నినాదం):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (ఐ డి ఓ సి) సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి ఐఏఎస్ అధ్యక్షతన జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) మాలతి ఆధ్వర్యంలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ప్రజలతో పాటు పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి కలెక్టర్ స్వయంగా వినతులను స్వీకరించారు. ఈ రోజు ప్రజావాణిలో మొత్తం 84 అర్జీలు దాఖలయ్యాయి. అనంతరం కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందరి దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

# రూ. 90.20 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన


### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, జూలై 20( నినాదం):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం అభివృద్ధి పనులను పరుగులు తీస్తోంది. ఇందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొత్తం రూ. 90.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న రెండు ప్రధాన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ సోమవారం శంకుస్థాపన చేశారు. రాజేంద్రనగర్ డివిజన్ వార్డ్ నెం. 120 పరిధిలోని న్యూ గ్రీన్ సిటీ కాలనీలో రూ. 67.80 లక్షల, బుద్వేల్ సిగ్నేచర్ అపార్ట్మెంట్ సమీపంలో రూ. 22.40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులు మెరుగుపరచడమే తమ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు. కాలనీవాసులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా, నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అభివృద్ధి పనుల పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# రావిచేడ్ అభివృద్ధికి హామీ

### ఎమ్మెల్యేను కలిసిన సర్పంచ్ బృందం



**ఆమనగల్లు, జూలై 20(నినాదం):** కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు, రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ బందరి యాదయ్య, వార్డు సభ్యులు రవికుమార్, హనుమంతు నాయక్, భూపతి, అనిల్ కుమార్ తదితరులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, త్వరలో నిధులు కేటాయించి గ్రామాభి వృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.


## లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి



**కొడంగల్, జులై 20(నినాదం):** హకీంపేట్, లగచర్ల లో నిర్మించే ఫార్మా కంపనీ కి వ్యతిరేకంగా పోరాడిన 72 మంది రైతుల పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని బిఆర్ ఎస్ పార్టీ యూత్ నాయకుడు మడిగె శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని డిమాండ్ చేశారు. భూములు ఇచ్చిన రైతులలో కొందరికీ ఇంకా భూపరిహారం అందలేదని, తక్షణమే రైతులకు భూపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్-నారాయణ పేట ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎందుకు పరిశీలించడం లేదని, కొడంగల్-నారాయణ పేట్ ఎత్తిపోతల పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన కాల్వల నిర్మాణం పూర్తి చేసి, రైతులకు సాగునీరందించి, తన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### డా. హేమరాజ్ సింగ్



**దుబ్బాక, జులై 20 (నినాదం):** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. హేమరాజ్ సింగ్ ప్రజలకు సూచించారు. సోమవారం దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ, గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా విషజ్వరాలు, వాంతులు, విరేచనాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సాధ్యమైనంత వరకు మాంసాహారానికి దూరంగా ఉండాలని, కూరగాయలు, ఆకుకూరలను బాగా శుభ్రపరిచి వండుకుని తినాలని, తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. దుబ్బాక ప్రభుత్వ 100 పడకల ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా భయపడకుండా వెంటనే ఆసుపత్రికి రావాలని అన్నారు. అవసరమైన వారికి నాణ్యమైన వైద్య సేవలు అందజేయడానికి ఆసుపత్రి సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో నిజమైన ఓటర్లకు ఇబ్బంది ఉండదు

### మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి



**అల్వాల్, జూలై 20( నినాదం):** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సర్ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్) పక్రియలో నిజమైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు సహాయ కేంద్రాల ద్వారా ప్రజలకు అండగా నిల్వాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారంరాజీవ్ వీకర్ సెక్షన్ పాద యాత్ర చేసిన మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి. బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి అల్వాల్ లోని రాజు వీకర్ సెక్షన్ లో ఇంటింటికి తిరుగుతూ పలు సమస్యల పై ఆరా తీశారు. సర్ ప్రక్రియ పై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఓటర్ నమోదు కాని కొత్త ఓటర్ల పేర్లను నమోదు చేయాలని బి ల్ఏలకు సూచించారు. ఈ కార్యక్రమంలో లడ్డు,,అరుణ్, యాదగిరి గౌడ్, రహమత్ ఖాన్, హనుమంతు,సాజిద్ రాజేందర్, అఫ్జల్,రేణుక కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, జూలై 20(నినాదం):** సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఇ.వెంకటా చారి, డిఆర్ఓ స్వర్ణలత, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) పూజ, జడ్పీ సీఈఓ సుధీర్, డిఆర్డిఓ శ్రీనివాస్ లతో కలిసి ప్రజల నుండి 104 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల్లో పెండింగ్ లో ఉన్న 150 ప్రజావాణి అర్జీలను అధికారులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించే దిశగా పని చేయాలన్నారు. ప్రజావాణిలో హౌసింగ్, పెన్షన్, విద్యుత్తు, గురుకుల ప్రవేశాలు తదితర అంశాలపై విజ్ఞప్తులు అందాయి.

## సప్తగిరి రైస్‌మిల్లులో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల సోదాలు



**జమ్మికుంట, జూలై 21 (నినాదం):** మిల్లులలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిల్వలు ఎక్కువగా ఉంచినట్లయితే చర్యలు తప్పవని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఆర్ వి ఈ ఓ బసవ రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో రాష్ట్ర డిజిపి డిఎస్ చౌహాన్ ఆదేశాల మేరకు సివిల్ సప్లై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సోమవారం సప్తగిరి రైస్ మిల్లులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లులలో నిల్వ ఉంచిన ధాన్యం, ప్రభుత్వానికి సప్లై చేసిన ధాన్యం నిలువలు, రికార్డులు ,ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిల్వ ఉన్న వివరాలను గురించి పూర్తిగా వివరాలను సేకరించారు. అనంతరం విజిలెన్స్ అండ్ ఫోర్స్మెంట్ అధికారి బస్సు రెడ్డి మాట్లాడుతూ నియమ నిబంధనలను అతిక్రమించి అక్రమ లావాదేవీలను చేసినట్లయితే చర్యలు తీసుకుంటామని తప్పకుండా నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మిల్లుల నిల్వలు ఉండాలని అక్రమ నిల్వలు నాణ్యత లోపాలు కనక ఉన్నట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన వెల్లడించారు. జమ్మికుంట పట్టణం తో పాటు మిగతా మండలాలలో ఉన్న రైస్ మిల్లులో కూడా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.



## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే రీ సర్వే లక్ష్యం

### నడికుడలో రీ సర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్





**మల్లాపూర్, జూలై 20 (నినాదం):** భూముల రీ సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని నడికుడ గ్రామంలో జరుగుతున్న నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఇప్పటి వరకు పూర్తయిన రీ సర్వే విస్తీర్ణం, మిగిలిన పనులు, వాటి పురోగతిపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రీ సర్వే కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. గ్రామ సరిహద్దులను నిర్ధారించి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సర్వే పరికరాలతో వ్యవసాయ భూములను సర్వే చేసి, అనంతరం భూ వివరాలను ప్రజలకు వెల్లడిస్తామని చెప్పారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా రీ సర్వే నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా గ్రామ బౌండరీని లైసెన్స్ సర్వేయర్లు, మండల సర్వేయర్లు కలిసి నిర్ధారించి, అనంతరం రైతుల వారీగా రీ సర్వే చేపడతారని వివరించారు. జగిత్యాల జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రస్తుతం ఏడు గ్రామాల్లో ఎంజాయ్‌మెంట్ రీ సర్వే కొనసాగుతోందని తెలిపారు. నడికుడ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్థులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహరావు, తహసీల్దార్ రాంచందర్, సర్వేయర్ కుమారస్వామి, సర్పంచ్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కోరుట్ల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే అంతిమ లక్ష్యం

### కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



**కోరుట్ల, జూలై 20(నినాదం):** కోరుట్ల పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడమే అంతిమ లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నామని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల పట్టణ 9వ వార్డులో రూ. 3లక్షల 50 వేల నిధులతో నిర్మించనున్న మురికి కాల్వ నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, స్థానిక వార్డు కౌన్సిలర్ ఎడ్ల జలజ రమేష్ లతో కలిసి భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పట్టణంలోనే ప్రతి వార్డులో సిసి రోడ్లతో పాటు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, వార్డు ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల నమ్మకాన్ని నిలబెట్టేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### కట్టరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్, జూలై20(నినాదం):** పేదల నమ్మకాన్ని నిలబెట్టేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచన కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు సోమవారం కట్టరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వైద్యులతో సమావేశమై రోజువారీ రోగుల సంఖ్య, ప్రధానంగా వస్తున్న ఆరోగ్య సమస్యలు, డెంగ్యూ,



మలేరియా, కుక్క, కోతి కాట్లు, వైరల్ జ్వరాల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో అప్రమత్తంగా ఉండి, ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన చికిత్స అందించాలని సూచించారు. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసంతో వస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా సమయపాలనతో సేవలు అందించాలని వైద్య సిబ్బందిని సూచించారు. ఆసుపత్రి నిర్వహణలో లేదా వైద్య సేవల అందింపులో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా సేవలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సాయిరాజ్, వైద్య సిబ్బంది సాగర్, పావని, శ్వేత, సుమతి, చల్మెడ ఆసుపత్రి శిక్షణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## 30 రోజులు దాటిన వినతులకు తక్షణ పరిష్కారం చూపాలి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జులై20(నినాదం):** ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 313 దరఖాస్తులు అందగా, అందులో గృహ నిర్మాణ శాఖకు అత్యధికంగా 100 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 30 రోజులు దాటిన పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. న్యాయస్థాన కేసులు, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులు, సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా అందిన ఫిర్యాదులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను సంబంధిత నమోదులో వెంటనే నవీకరించాలని అధికారులకు సూచించారు.

## వాతావరణ అనుకూల వ్యవసాయంపై రైతులకు అవగాహన

### మాలపల్లిలో వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యక్రమం



**హుస్నాబాద్ జులై 20 (నినాదం):** హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు వాతావరణ అనుకూల వ్యవసాయం, స్థిరమైన సాగు పద్ధతులు, కార్బన్ క్రెడిట్ అవకాశాలపై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత, కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు వెన్న రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెన్న రాజు మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావంతో వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని, అలాంటి పరిస్థితుల్లో రైతులు ఆధునిక, పర్యావరణ హిత సాగు విధానాలను అవలంబిం చడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించి, సాగు ఖర్చులను నియంత్రించవచ్చని అన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ వ్యవసాయ పద్ధ తులు, భవిష్యత్తులో అందుబాటు లోకి వచ్చే అవకాశాలపై అవగాహన కల్పించి ఆదాయ వృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులు పాటించడం వల్ల నేల సారం మెరుగుపడ టంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించే అవకాశం ఉంటుందని వివరించారు. పంట అవశేషాల నిర్వహణ, సేంద్రియ పదార్థాల వినియోగం, నీటి సంరక్షణ, చెట్ల పెంపకం వంటి పర్యావరణహిత విధానాలను అనుసరించడం ద్వారా రైతులు స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయవచ్చని తెలిపారు. అలాగే కార్బన్ క్రెడిట్‌కు సంబంధించిన ప్రాథమిక అవగాహన, అర్హత ప్రమాణాలు, నమోదు ప్రక్రియ, భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశాలపై రైతులకు వివరించారు. రైతులు ఏ ప్రాజెక్టు లేదా ఒప్పందంలో చేరే ముందు నిబంధనలు పూర్తిగా చదివి, అవగా హనతో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ రాష్ట్ర ఇన్‌చార్జి పల్లె వెంకటేష్ గౌడ్, దేవాన్, హుస్నాబాద్ ఫీల్డ్ కోఆర్డినేటర్ చిట్యాల ఇసాక్, వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఢిల్లీ మేనేజర్ దేవాన్ష్, వార్డు సభ్యులు సొల్లు రజినీకాంత్, బత్తుల వీరస్వామి, బత్తుల కవితతో పాటు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకుని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## వార్డు ప్రజల సంక్షేమమే లక్ష్యం...

### 20వ వార్డు బిజెపి కౌన్సిలర్ గుర్రం కావ్య పరశురాం
### ప్రజల దాహార్తి తీర్చడానికి చేతి పంపు ప్రారంభం



**జమ్మికుంట, జులై 21 (నినాదం) :** ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం అని 20వ వార్డు బిజెపి కౌన్సిలర్ గుర్రం పరశురాం అన్నారు. సోమవారం వార్డులో నెలకొన్న నీటి ఎద్దడిని తీర్చడానికి చేతి పంపును ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్డు ప్రజలు మాపై నమ్మకంతో కౌన్సిలర్ గా గెలిపించారని వారి సమస్యలను పరిష్కరించడం మా బాధ్యత అని అన్నారు. ఇప్పటికే కాలనీలో నీటి ఎద్దడి ఉందని ప్రజలు నీటికి ఇబ్బంది పడకుండా ఉండడానికి చేతి పంపును ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు నాలుకల ధోరణితో విద్యుత్ ఉద్యోగులకు ఇక్కట్లు...

### భద్రాచలం ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం: విద్యుత్ శాఖ జేఏసీ
### మెట్‌పల్లి డివిజన్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన

**మెట్ పల్లి, జూలై 20 : ( నినాదం):** విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని విద్యుత్ శాఖ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో విధంగా వ్యవహరించే రెండు నాలుకల ధోరణి వల్ల విద్యుత్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జేఏసీ నాయకులు విమర్శించారు. ఈ విధానం విద్యుత్ రంగ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భద్రాచలం థర్మల్ విద్యుత్ ప్లాంట్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే యత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. విద్యుత్ రంగం ప్రజల జీవితాలతో ముడిపడిన కీలకమైన సేవా రంగమని, దీనిని ప్రైవేటీకరిస్తే వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా ఉద్యోగుల భద్రత కూడా ప్రమాదంలో పడుతుందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వాలు విద్యుత్ సంస్థలను ప్రైవేటు చేతుల్లోకి నెట్టే బదులు, వాటి నిర్వహణ బాధ్యతలను ఉద్యోగులకే అప్పగిస్తే ఏడాది వ్యవధిలోనే లాభాల బాట పట్టించి చూపిస్తామని సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రం నీళ్లు--నిధులు--నియామకాల లక్ష్యాలతో ఏర్పడిందని గుర్తు చేసిన వారు, రాష్ట్ర యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. స్థానిక నిరుద్యోగులకు ప్రాధాన్యం కల్పించాల్సిన చోట ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖలో ఆర్టిజన్, ఏఎన్ఎం, పీఏ, పీసీసీ వంటి విభాగాల్లో



ఉద్యోగుల మధ్య వేతనాలు, హోదాలు, సౌకర్యాల్లో అసమానతలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పదోన్నతుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం విద్యుత్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. విద్యుత్ రంగ పరిరక్షణ ఉద్యోగులకే కాకుండా ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్నారు. నిరసనలో విద్యుత్ శాఖ జేఏసీ జిల్లా చైర్మన్ ఎండి హాజీజ్, డివిజన్ చైర్మన్ మునుగురి లక్ష్మణ్, జేఏసీ కార్యదర్శి జరుపుల హరిప్రసాద్, సామల్ల రవీందర్, బోయినపల్లి అశోక్, జిందం శంకర్, కో-కన్వీనర్ పి. రవి, బొంబాయి రఘుపతి, ఎండి కరీం, జిందం ప్రసాద్, మహేష్, గసికంటి రాము, రాజశేఖర్, జిందం శరణ్య, సాంబరి రష్మిత, లక్ష్మి తదితర విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తపాల బీమా జీవితాలకు ధీమా

### చిన్న ముత్తాల పొదుపుతో కుటుంబాలకు భరోసా
### అవగాహన సదస్సులో సీనియర్ సైంటిస్ట్ వెంకటేశ్వరరావు



**జమ్మికుంట, జులై 21 (నినాదం) :** తపాలా బీమా జీవితాలకు భీమా అని కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న పోస్ట్ ఆఫీస్ లలో చిన్న మొత్తాలను పొదుపు చేస్తే భవిష్యత్తు తరాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ వెంకటేశ్వరరావు జమ్మికుంట పోస్టుమాస్టర్ యు మహేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ, పోస్ట్ ఆఫీస్ లో కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని చిన్న మొత్తాలతో కుటుంబాలకు ఆర్థికపరచ లభిస్తుందని అంతేకాకుండా తపాలా కార్యాలయంలో యాక్సిడెంట్ పాలసీలు తీసుకుంటే భవిష్యత్తులో అన్ని రకాలుగా ఆ కుటుంబానికి అండగా ఉంటుందని వారు తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష జీవన బీమా పథకాల పైన యువ శాస్త్రవేత్తలు వ్యవసాయ క్షేత్ర సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి అవగాహన కల్పించారు. చిన్న ముత్తాల పొదుపు పథకాలు తపాల జీవిత గ్రామీణ తపాల జీవిత బీమా లాంటి పథకాలను ప్రజలకు వివరించి వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. నమ్మకానికి మారుపేరుగా పోస్ట్ ఆఫీస్ సేవలు అందిస్తుందని పోస్ట్ ఆఫీస్ లో సైతం ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో కె వి కే సైంటిస్ట్ ప్రశాంతి పోస్టల్ సిబ్బంది ఎం వినయ్ పి వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## కేసీయూబీ నిర్వహణపై హైకోర్టు కీలక ఆదేశాలు

### సాధారణ సర్వసభ్య సమావేశం చెల్లుబాటుపై దాఖలైన రిట్ పిటిషన్‌లో విచారణ



**కరీంనగర్, జులై 20(నినాదం ):** కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (కేసీయూబీ) మాజీ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్ (నం. 19339/2026)పై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. వి. శ్రవణ్ కుమార్ 2026 జూన్ 23న కీలక ఆదేశాలు జారీ చేశారు. 2026 మార్చి 29న నిర్వహించిన కేసీయూబీ సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో జరగలేదని, అయినప్పటికీ ప్రస్తుత నిర్వహణ కమిటీ కొనసాగుతుండడాన్ని సవాల్ చేస్తూ గడ్డం విలాస్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. నిర్వహణ కమిటీ కొనసాగింపు చట్టబద్ధతపై స్పష్టత ఇవ్వడంతో పాటు, తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964లోని సెక్షన్ 21-ఏఏ ప్రకారం బ్యాంకు వ్యవహారాల నిర్వహణకు ప్రత్యేక అధికారిని (స్పెషల్ ఆఫీసర్) లేదా బాధ్యతల నిర్వాహకుడిని (పర్సన్-ఇన్-చార్జ్) నియమించాలని కోరుతూ ఆయన 2026 మే 6న సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు.

## సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను 100 శాతం విజయవంతం చేయాలి

### ఆగస్టు 3లోపు లక్ష్యం పూర్తి చేసిన కార్యకర్తలకు రాహుల్ గాంధీతో ఫోటో దిగే అవకాశం
### కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి


**కరీంనగర్, జూలై 20(నినాదం):** కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కొనసాగుతున్న సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, ఎస్ఐఆర్ సూపర్వైజర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సమీక్షలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ పురోగతిపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. జూలై 31 నాటికి నియోజకవర్గంలో 90 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. అలాగే ఆగస్టు 3లోపు లక్ష్యాన్ని పూర్తి చేసిన కార్యకర్తలకు రాహుల్ గాంధీతో ఫొటో దిగే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఓటరికి ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలని అన్నారు. బూత్ స్థాయి ప్రతినిధులు ప్రతి ఇంటిని సందర్శించి ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, గణన ఫారాలు నింపడంలో ఓటర్లకు సహకరించాలని, కార్యకర్తలకు ఎలాంటి సందేహాలు




ఉన్నా తమను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎస్ఐఆర్ రిటర్నింగ్ అధికారి మడుపు మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, కార్పొరేటర్లు, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ అలీ, ప్రధాన కార్యదర్శి కంకణాల అనిల్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఎస్ఐఆర్ సూపర్వైజర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముద్దసాని దామోదర్‌రెడ్డికి ఘన నివాళి

### జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు సమర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న



**కరీంనగర్, జులై20 (నినాదం):** కరీంనగర్ పరిధిలోని సదాశివ పల్లిలో మాజీ మంత్రి స్వర్గీయ ముద్ద సాని దామోదర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కరీం నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, కార్పొరేటర్లు ఆకుల నందిని ఉదయ్, గుమ్మడి రాజ్ కుమార్, పడాల శ్రీజ అజయ్ తో పాటు పలువురు నాయకులు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆకుల నరసన్న మాట్లాడుతూ, ముద్దసాని దామోదర్ రెడ్డి పేదల సంక్షేమానికి అంకితభావంతో పనిచేశారని, కమలాపూర్ ప్రాంత అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. కరీంనగర్ జిల్లాలో "టైగర్"గా గుర్తింపు పొందిన ఆయన జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమం సీనియర్ నాయకుడు కొత్తూరు జగన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ముద్దసాని కృష్ణా రెడ్డి, ఆడెపు కమలాకర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెరుకు రైతుల కోసం మరో పోరాటానికి బీజేపీ సిద్ధం

### కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ.. త్వరలో భారీ రాస్తారోకో: బిజెపి మండల అధ్యక్షులు గోపిడి శ్రీనివాస్ రెడ్డి

**మల్లాపూర్, జూలై 20 (నినాదం):** మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వద్ద భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాదగిరి బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చెరుకు రైతులను మభ్యపెడుతుందని, చిత్తశుద్ధి ఉంటే చెరుకు ఫ్యాక్టరీ ని తెరిపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం చక్కెర కర్మాగారం తెరిపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తో చక్కెర కర్మాగారం తెరిపించే అంత లేకపోతే కేంద్రానికి లేఖ రాయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తెరిపిస్తారని తెలిపారు. బిజెపి మండల అధ్యక్షులు గోపిడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం చెరుకు రైతుల సమస్యల పరిష్కారం కోసం



మల్లాపూర్ నుంచి ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర చేపట్టామని గుర్తు చేశారు. ఆ పాదయాత్ర ముగిసి ఏడాది గడిచినా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ సమక్షంలో పెద్ద ఎత్తున రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనూప్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వద్దేపల్లి శ్రీనివాసన్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు నరేందర్ రెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ కో-కన్వీనర్ గుంటుక సదాశివ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, మారంపల్లి తిరుపతి, వేల్పుల రాజు వివిధ బీజేపీ మోర్చా అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గం నియామకం

**కరీంనగర్, జూలై 19(నినాదం):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ స్టేడియంలో ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండారి రాజ్‌కుమార్‌ను ముఖ్య సంరక్షకుడిగా, డాక్టర్ కృష్ణప్రియను మహిళల బాక్సింగ్ విభాగం ఇన్‌చార్జిగా, ముదారి ప్రవీణ్ కుమార్‌ను ఉపాధ్య క్షుడిగా, ముదారి గణేష్, గీస పృథ్వీ రాజ్‌లను సంయుక్త కార్యదర్శు లుగా, అడ్వకేట్, నోటరీ నాగుల నరేందర్‌ను న్యాయ సలహా దారుగా నియమిం చారు. అలాగే కటకోజుల కిరణ్‌ను కరీంనగర్ పట్టణ ఇన్‌చార్జిగా, మాణిక్యం శ్రీకాంత్‌ను కరీం నగర్ పట్టణ కార్య దర్శిగా, వికాస్‌ను జిల్లా నిర్వహణ కార్య దర్శిగా, ముదారి ప్రదీప్, రాజేందర్ లను కార్యవర్గ సభ్యులుగా నియమించారు. నూతనంగా నియమితులైన పదాధికారులను కరీంనగర్ డివిజన్ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గడప సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి



కొత్తకొండ సంపత్‌కుమార్, సీనియర్ ఉపాధ్యక్షులు మోసం అంజయ్య, మడిపల్లి కాళీచరణ్ గౌడ్, సీనియర్ సంయుక్త కార్యదర్శి జి. మురళి, నిర్వహణ కార్యదర్శి రామకృష్ణ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంజీఎంను సందర్శించిన వరంగల్ సీపీ



**హన్మకొండ, జూలై 20, (నినాదం):** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపిఎస్ సోమవారం వరంగల్ యం.జి.యం హాస్పటల్ ను సందర్శించారు. ముందుగా పోలీస్ అవుట్ పోస్ట్ ను సందర్శించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, ఇక్కడికి వచ్చే మెడికో లీగల్ కేసులకు సంబంధించిన విషయాలపై ఏవిధమైన చర్యలు చేపడుతున్న వివరాల రికార్డులను కమిషనర్ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువతకు చికిత్స అందిస్తున్న డీ అడిక్షన్ కేంద్రాన్నిసందర్శించారు. ఈ కేంద్రంలో మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువతను సాధరణ స్థితికి తీసుకవచ్చేందుకు వైద్యులు అందిస్తున్న చికిత్స విధానాన్ని అక్కడే ఉన్న వైద్యులు కమిషనర్ కు వివరించారు. ఈసందర్భంగాయం.జి.యం పరిసరాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ హాస్పటల్ కు సంబందించి ప్రధాన మార్గంతో పాటు, వాహన పార్కింగ్ ప్రదేశాలు,ముఖ్యమైన స్థలాల్లోసిసి కెమెరాల ఏర్పాటుపైసంబందించిన అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు, యం.జి.యం లో పార్కింగ్ ఏర్పాట్లు, హాస్పిటల్ సంబందించి ప్రధాన మార్గం నుండి హాస్పటల్ కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హాస్పటల్ ప్రధాన ద్వారంలో ఆటోలను నిలపకుండాతీసుకోవాల్సిన చర్యలపై సిపి ట్రాఫిక్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత,యం.జి.యం సూపరింటెండెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్.యం. ఓ, ఏసీపీలు జితేందర్ రెడ్డి, సదయ్య, సత్యనారాయణ,ప్రశాంత్ రెడ్డి ఇన్స్ స్పెక్టర్లు కరుణాకర్, రాఘువేందర్ తో పాటు ఆర్.ఎస్.ఐలు పూర్ణ చందర్ రెడ్డి, మనోజ్, నాగరాజు వున్నారు.

## హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థికసాయం



**కాటారం, జూలై 20( నినాదం):** కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన టి. సమ్మయ్య కుటుంబానికి జిల్లా హెల్త్ అసిస్టెంట్లు, మలేరియా విభాగ సిబ్బంది, రాష్ట్రవ్యాప్తంగా జి.ఓ. 1207 కింద పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ల ప్రతినిధులు కలిసి రూ. 60 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భూపాలపల్లి జిల్లా ఏఎంఓ సుధాకర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో సమ్మయ్య కుటుంబాన్ని పరామర్శించిన వారు, ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు కాపర్తి రాజు, పరమేశ్వర్, సతీష్, బిక్షపతి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జిలను త్వరతగతిన పరిష్కరించాలి

• జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 20(నినాదం):** ప్రజావాణిలో ప్రజలు అందజేసిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 78 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. అధికారులు ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, బాధితులకు తగిన న్యాయం జరిగేలా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డితో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### బూత్ ఇన్‌చార్జీల పనితీరును పరిశీలించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు కరుణాకర్



**భూపాలపల్లి, జులై 20 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులకు పట్టణంలోని వివిధ బూత్‌లకు ఇన్‌చార్జీలుగా బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా బూత్‌లలో ఇన్‌చార్జీలు నిర్వహిస్తున్న పనితీరును జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్యతో కలిసి పలువురు బూత్‌లను సందర్శించి, ఇంటింటికీ వెళ్లి చేపడుతున్న సర్వే, ఫారాల సేకరణ, ప్రజలకు అందిస్తున్న అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. బూత్ ఇన్‌చార్జీలతో మాట్లాడి, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకొని, ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ, పార్టీ అప్పగించిన బాధ్యతలను ప్రతి ఇన్‌చార్జి అంకితభావంతో నిర్వహించాలని, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రతి ఇన్‌చార్జి సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఆదర్శంగా నిలపాలని ఆకాంక్షించారు.

# ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**మహాముత్తారం, జూలై 20(నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విజయాలకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. మహాముత్తారం గ్రామానికి చెందిన ఆతుకూరి భాస్కర్, కవిత దంపతులు తమ నలుగురు పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, వివిధ విద్యా అవకాశాలు సాధించడంలో విశేష కృషి చేసిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతగా శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆతుకూరి భాస్కర్ మాట్లాడుతూ, తమ పెద్ద కుమార్తెకు 2023--24, మొదటి కుమారుడు మరియు రెండో కుమార్తెకు 2024--25, చిన్న కుమారుడు హర్షవర్ధన్‌కు 2025--26 విద్యా సంవత్సరంలో విద్యా అవకాశాలు (సీట్లు) లభించాయని తెలిపారు. ఈ విజయాల వెనుక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నిరంతర శ్రమ, మార్గదర్శకత్వమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. తమ పిల్లలను విద్యలో ముందుకు నడిపించిన ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారిని ఘనంగా సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆతుకూరి కవిత, వారి కుమారులు శ్రీరామ్, హర్షవర్ధన్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన బోధనా విధానాలపై ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ



**పాలకవీడు, జూలై 20 (నినాదం):** పాలకవీడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంఈఓ ఇంజమూరి కాటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నిరంతర అభ్యసకులై నూతన బోధనా పద్ధతులను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను పెంపొందించేలా బోధన నిర్వహించాలని కోరారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో సమర్థంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్ వితరణ



**పాలకవీడు జూలై 20( నినాదం):** పాలకవీడు మండలం హనుమయ్యగూడెం అంగన్‌వాడి కేంద్రంలో ఫ్యాన్ లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అంగన్‌వాడి టీచర్ కత్రోజు మణెమ్మ ఉపసర్పంచ్ ఒంటెద్దు సైదిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సైదిరెడ్డి రూ. 2 వేల విలువైన సీలింగ్ ఫ్యాన్‌ను అందించారు. స్థానిక సర్పంచ్ బాణవత్ మంగమ్మ, సోమ్లా నాయక్ చేతుల మీదుగా ఫ్యాన్‌ను అంగన్‌వాడి కేంద్రానికి అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి సిబ్బంది, చిన్నారులు సైదిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సందీప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గోలి తిరుపతి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మలేరియా కేసుతో అప్రమత్తమైన వైద్యశాఖ

### హాస్టల్‌లో వైద్య శిబిరం




**కాటారం, జూలై 20(నినాదం):** మండల కేంద్రంలోని టిటిడబ్ల్యూయూఆర్‌జేసీ బాలికల హాస్టల్‌లో ఓ విద్యార్థినికి మలేరియా నిర్ధారణ కావడంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సీహెచ్ మధుసూదన్, జిల్లా మలేరియా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సందీప్ ఆదేశాల మేరకు స్థానిక వైద్యాధికారి డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో జిల్లా మలేరియా అధికారి ఏ. సుధాకర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, జిల్లా ఎపిడెమిక్ బృందం హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో విద్యార్థినులందరికీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అవగాహన కల్పించారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా హాస్టల్‌లోని అన్ని గదుల్లో ఆల్ఫా సైఫాన్ మిత్రీన్ మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పంతకాని సడవలి వార్డు సభ్యులు అక్కపాక మల్లయ్య, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు మున్వర్, జిల్లా ఎపిడెమిక్ బృందం సభ్యులు కపర్తి రాజు, ఉరుగొండ గోపీకృష్ణ, తలకోటి పరమేశ్వర్, సతీష్, హెల్త్ అసిస్టెంట్ బిక్షపతి, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించడానికి బీఆర్ఎస్ సిద్ధం

### నాగరాజ్ గౌడ్ సవాల్ ను స్వీకరించిన నాయకులు



**అమరచింత, జూలై 20 (నినాదం):** కొత్త నియోజకవర్గం అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు నాగరాజు గౌడ్ చేసిన సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు అక్కల నరసింహులు గౌడ్, ప్రధాన కార్యదర్శి చిన్న బాలరాజు, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ఏ మాజీ చైర్మన్ ఎస్ ఏ రాజు, మాజీ కౌన్సిలర్ రాజ్ కుమార్, రాష్ట్ర నాయకులు అబ్రహం అన్నారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు దేశం నాగరాజు గౌడ్ మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం అమరచింత పట్టణంలోని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు అక్కల నరసింహులు గౌడ్ నివాస వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ ను ఉద్దేశించి వారు మాట్లాడుతూ హైదరాబాదులో ఉంటూ మక్తల్ అభివృద్ధిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపాలిటీలో తన వార్డులో కౌన్సిలర్ ను గెలిపించుకోలేని నాయకుడు తమ మాజీ ఎమ్మెల్యే పై అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వచ్చిన ప్రొసీడింగ్స్ పనులను చేస్తూ వాటికి టెంకాయలు కొట్టి తమ పనులుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మక్తల్ అభివృద్ధి పై చర్చించేందుకు కాంగ్రెస్ నాయకులు వేదికను వాళ్లు చెప్పిన చోటికి వచ్చి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చిట్టెం రామ్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు తెలుసని అన్నారు. అమరచింత మునిసిపాలిటీకి 15 కోట్లు వచ్చాయని కాగితాల మాత్రమే చూపిస్తున్నారని అమలులో ఎక్కడా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలను నాగరాజు గౌడ్ వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇకనుంచి ప్రజాక్షేత్రంలో ఆ పార్టీ చేస్తున్న వసూళ్ల రాజ్యాన్ని ప్రజల ముందు ఉంచుతామన్నారు. పామిరెడ్డిపల్లి లో ఇందిరమ్మ ఇంటికి లంచం అడిగింది ప్రజలకు తెలుసన్నారు. వైన్ షాపులో ఆ పార్టీ నాయకులే గుండా గిరి చేసింది ప్రజలంతా చూశారని గుర్తు చేశారు. ఇకనుంచి అయినా అభివృద్ధి పై దృష్టి పెట్టాలని లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ కోఆప్షన్ సభ్యులు షానవాజ్ ఖాన్, తెలుగు రమేష్, గోపాల్, డిజె శేఖర్, ఆటో రఘు తో పాటు పలువురు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి దేవాలయ భూములు ఆక్రమిస్తే కఠినచర్యలు

### ఆత్మకూర్ తహసీల్దార్ మోహన్



**అమరచింత, జూలై 20 (నినాదం):** ఆత్మకూరు మున్సిపాలిటీ శివారులోని వెంకటేశ్వర స్వామి ఆలయ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ జేకే మోహన్ హెచ్చరించారు. జూరాల రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 430 లోని ఎండోమెంట్ భూములను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ భూములను కొందరు ఆక్రమించినట్లు తనకు సమాచారం ఉందని తహసిల్దార్ అన్నారు. ఎవరైనా ఎలాంటి పత్రాలు లేకుండా భూములను కబ్జా చేస్తే అటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎవరైనా కబ్జా చేసిన వ్యక్తులు స్వచ్ఛందంగా భూములను వదిలివేయాలని లేకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ హెచ్చరించారు.

## వరి నారుమడికి వినూత్న రక్షణ



**కాటారం, జూలై 20( నినాదం):** వ్యవసాయంలో సృజనాత్మకతకు నిదర్శనంగా ఓ రైతు తన వరి నారుమడిని పక్షులు, కోళ్లు, ఇతర జంతువుల బారి నుంచి కాపాడేందుకు వినూత్న పద్ధతిని అనుసరించాడు. నారుమడి చుట్టూ పాత చీరలు, వలలను కట్టి రక్షణ కంచె ఏర్పాటు చేశాడు. ఈ విధానం వల్ల నారు దెబ్బతినకుండా ఉండటంతో పాటు, తక్కువ ఖర్చుతో పంటను సంరక్షించుకోవచ్చని రైతులు చెబుతున్నారు. వర్షాకాలంలో నారు పెంపకానికి ఇది ఉపయోగకరమైన పద్ధతిగా పలువురు అభిప్రాయపడుతున్నారు. పెరుగుతున్న వ్యవసాయ ఖర్చుల నేపథ్యంలో ఇలాంటి స్వల్ప వ్యయంతో కూడిన వినూత్న పద్ధతులు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు.

## పోలీసు గ్రీవెన్స్ డే ఫిర్యాదుల పరిశీలన



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 20 (నినాదం):** సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్ డే లో భాగంగా బాధితుల ఫిర్యాదులను జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. ఫిర్యాదుదారుల నుండి స్వయంగా వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ గ్రీవెన్స్ డే ప్రజల సమస్యల పరిష్కారం కోసమే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా వారి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శాంతి భద్రతల విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, జూలై 20 (నినాదం):** కరాటే పోటీలలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన చిన్నారులను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అభినందించారు. ఇటీవల గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో బీరంగూడకు చెందిన క్రేజీ క్రూ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. అద్భుతమైన ప్రదర్శనలతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో చిన్నారులను జిఎంఆర్ అభినందించారు. విద్యార్థి స్థాయి నుండి క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, గురువులు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లేష్, శివా రెడ్డి, వెంకటేష్, మేరాజ్ ఖాన్, రామచందర్, రామకృష్ణ, అకాడమీ నిర్వాహకులు సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# పీడీఎస్ బియ్యం పట్టివేత..

### ఘనపూర్‌లో డెన్‌పై ప్రత్యేక అధికారుల బృందం దాడి

### సుమారు 200 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం



**భూపాలపల్లి బ్యూరో / భూపాలపల్లి ప్రతినిధి, జూలై 20(నినాదం):** గత కొన్ని రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా జోరుగా కొనసాగుతున్న పీడీఎస్ రేషన్ బియ్యం దందా పై అధికారులు దృష్టి సారించారు. భూపాలపల్లి జిల్లాలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం దందా సాగుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న రేషన్ బియ్యం డెన్ పై ప్రత్యేక అధికారుల బృందం సోమవారం మెరుపు దాడి నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన సుమారు 200 క్వింటాళ్ల బియ్యంను అధికారులు గుర్తించారు. గ్రామాల్లో రేషన్ దుకాణాలు, లబ్ధిదారుల నుండి సేకరించిన సన్నబియ్యంను మహారాష్ట్రకు తరలించడానికి సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తేల్చారు. బియ్యంతో పాటు రావాణకు ఉపయోగించే అశోక్ లీలాండ్ వాహనాన్ని స్వాధీనపర్చుకున్నట్లు అధికారులు తెలిపారు. బియ్యం నిల్వ చేసిన ఘనపూర్ కు చెందిన సారంగపాణి, వాహనం డ్రైవర్ రంగాపురంకు చెందిన కిషన్ పై కేసు కేసు నమోదు చేసి పట్టుకున్న బియ్యంను స్థానిక పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# గ్రామ కంఠం భూమిని కాపాడాలని నిరసన



**అమరచింత, జూలై 20, (నినాదం):** ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలోని సంత బజారు వద్ద గల సర్వే నంబర్ 421 పక్కన గ్రామ కంఠానికి సంబంధించిన దేవర్ల భూమి 1500 గజాలను కొందరు కబ్జా చేశారని.. ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సోమవారం ఎల్లమ్మ దేవర్ల కులస్థులు ఆత్మకూర్ సబ్ రిజిస్ట్రార్ ప్రకాష్ కు ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజులుగా దేవర్ల కు సంబంధించిన గ్రామ కంఠం భూమిని కాపాడాలని తహసిల్దార్ మున్సిపల్ కార్యాలయ చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామ కంఠం భూమిని కొందరు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు నిర్ధారణ కావడంతో అట్టి రిజిస్ట్రేషన్ రద్దు చేసి గ్రామ కంట భూమిని దేవర్ల కులస్తులకు అప్పజెప్పాలని సబ్ రిజిస్టర్ తో వాదనకు దిగారు. స్పందించిన సబ్ రిజిస్టర్ రెండు రోజుల సమయం కావాలని సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు గ్రామ దేవల ఇతర కులస్తులు వివిధ గ్రామాలకు చెందిన కులస్తులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు బిజెపి వ్యతిరేకి : ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సృజన




**అమరచింత, జూలై 20, (నినాదం):** మహిళా రిజర్వేషన్ బిల్లుకు భారతీయ జనతా పార్టీ పూర్తి వ్యతిరేకి అని ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన ఆరోపించారు. భారత జాతీయ మహిళా సమాఖ్య వనపర్తి జిల్లా మూడవ మహాసభలు సోమవారం అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని సిపిఐ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షురాలు సృజన హాజరై ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ జండాను ఎగరవేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డీలిమిటేషన్ లింకుతో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేసేందుకు బిజెపికి ఏమాత్రం ఇష్టం లేదని ఆమె స్పష్టం చేశారు. భారతదేశంలో మహిళలపై అనేక అఘాయిత్యాలు దౌర్జన్యాలు హత్యలు జరుగుతున్న మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరు ఇచ్చినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి నేతలపై అనేక కేసులు ఉన్నాయని ఆరోపించారు. మహిళా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టినందుకు బిజెపి ప్రభుత్వానికి ఇష్టం లేక డీలిమిటేషన్ తీసుకొచ్చిందని ఆరోపించారు. మహిళలు లేనిదే దేశంలో ఏ కార్యక్రమంలో లేదని మహిళలకు సమాన హక్కులు ఇవ్వాలని ఇది బిజెపి ప్రభుత్వం గ్రహించాలన్నారు. దేశవ్యాప్తంగా ఆ పార్టీకి వ్యతిరేక పవనాలు వీసన్నాయని త్వరలో ఆ పార్టీ పతనం కావడం ఖాయమని ఆమె అన్నారు. బిజెపి వ్యతిరేక శక్తులన్నీ ఏకమై ఆ పార్టీని గద్దెదించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలమూరు జిల్లా అధ్యక్షురాలు పద్మ, వనపర్తి జిల్లా అధ్యక్షురాల కృష్ణవేణి జిల్లా కార్యదర్శి సీతమ్మ నాయకురాలు జయమ్మ కళావతమ్మ పద్మ సత్యమ్మ పద్మ సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు నాయకులు రవీందర్ అబ్రహం భాస్కర్ శ్యాంసుందర్ ఎర్రన్న కుమార్ లక్ష్మీనారాయణ బాలస్వామి కుతుబ్ పాల్గొన్నారు.



## రైతులకు నీళ్లు ఇవ్వడంలో సర్కారు విఫలం

**తక్షణమే డి-83,డి-86 కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలి**

**రైతుల సమస్యలపై బీజేపీ ఆగ్రహం**

పెద్దపల్లి రూరల్,జూలై 20(నినాదం): పెద్దపల్లి జిల్లాలోని డి-83,డి-86 కాలువల ద్వారా రైతులకు సకాలంలో సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సాగునీటితో పాటు రైతులకు అవసరమైన వ్యవసాయ విద్యుత్‌ను కూడా నిరంతరంగా సరఫరా చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. జిల్లా మంత్రి శ్రీధర్ బాబు,ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు.వెంటనే డి-83,డి-86 కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయడంతో పాటు వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని,రైతులకు అండగా నిలుస్తుందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం,జిల్లా ఉపాధ్యక్షుడు శనిగరం రమేష్, జిల్లా నాయకులు కంకణాల జ్యోతి బాస్, భూషణ్,వేణి శ్రీనివాస్ గౌడ్,తూడి రవీందర్,మనోహర్,కొమ్మరిశెట్టి రమేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## భూగర్భ గనుల్లో ఆర్కే న్యూటెక్ గని నెంబర్ వన్

మంచిర్యాల, జులై 20 (నినాదం): శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గని రెండు సార్లు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడంతో పాటు 2024 2025 సంవత్సరానికి గాను దేశంలోనే భూగర్భగనుల్లో నెంబర్ వన్ గా నిలిచిందని జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆర్కే న్యూటెక్ గనిలో అధికారులు, మైనింగ్ స్టాఫ్ , సూపర్వైజర్ల లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. 2024 2025లో ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడంతోపాటు ఏకంగా 99 శాతం మార్కులతో భూగర్భగనులలో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిన సందర్భంగా గని అధికారులు, ఉద్యోగులను అభినందించారు . రక్షణ , ఉత్పత్తి , ఉత్పాదకతలో సింగరేణిలోనే ఆర్కే న్యూటెక్ గనికి ప్రత్యేక గుర్తింపు ఉంది... వరుసగా రెండు సార్లు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించటమే కాదు 2024-2025 సంవత్సరానికి గాను దేశంలోనే భూగర్భగనుల్లో నెంబర్వన్ గా నిలవటం శ్రీరాంపూర్ ఏరియాకే గర్వ కారణం అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం సంస్థ నిర్దేశిత లక్ష్య సాధనకు రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి , ఉత్పాదకతకు కృషి చేయాలని పేర్కొన్నారు. గనిలో రెండు యాక్సిడెంట్లు చోటుచేసుకోవటం దురదృష్టకరం వాటి ప్రభావాన్ని అధిగమిస్తూ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధనకు అందరూ కలిసికట్టుగా కృషిచేయాలని ఆదేశించారు. చిన్న ప్రమాదం ఉత్పత్తి, ఉత్పాదకతపై ఎంతో ప్రభావం చూపుతుంది అన్నారు. మళ్లీ అలాంటివి పునరావృతం కాకుండా గతంలో ఎంతో మంచి ఉత్పత్తి , ఉత్పాదకత చరిత్ర ఉన్న ఈ గని ఈసారి కూడా రక్షణతో కూడిన ఉత్తత్తి లక్ష్యాన్ని సాధించాలని కోరారు .ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, గని మేనేజర్ కూరపాటి శ్రీనివాస్ , గ్రూప్ ఇంజనీర్ శ్రీనివాస భట్టాచార్య, పిట్ ఇంజనీర్ మద్దెల కృష్ణ, సేఫ్టీ ఆఫీసర్ కొట్టె రమేష్, సంక్షేమ అధికారి సృజన్ పాల్, అసిస్టెంట్ మేనేజర్లు , అండర్ మేనేజర్లు, మైనింగ్ స్టాఫ్, సూపర్వైజర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్ ఎంపీడీవో ని ఘనంగా సన్మానించిన ముదిరాజ్ సంఘం నాయకులు

నిర్మల్ ప్రతినిధి, జులై 20 (నినాదం): నిర్మల్ ఎంపీడీవో గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సలేంద్ర సుధాకర్ ఎంపీడీవోకి ముదిరాజ్ సంఘ నాయకులు, సర్పంచ్ , ఉప సర్పంచ్ లు జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. వారికి శాలువాతో సన్మానం చేసి పూల బుక్కెను అందజేసి , మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరిన్ని పదోన్నతులు పొందాలని వారు కోరడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాతర్ల హరీష్ ముదిరాజ్, జిల్లా గౌరవ అధ్యక్షులు బర్మా చిన్నయ్య ముదిరాజ్ , సుంకరి రాజేష్ ముదిరాజ్ , అడ్వకేట్ గొడుగు గంగాధర్ ముదిరాజ్ , నిలాయి పేట్ సర్పంచ్ గొట్టం సుమలత భీమేష్ , ఎల్లపల్లి గ్రామ ఉపసర్పంచ్ రామన్ కిషన్ ముదిరాజ్ , అనంత పేట్ ఉప సర్పంచ్ నలిమెల రాములు ముదిరాజ్ , వెంగ వాపేట్ గ్రామ ఉపసర్పంచ్ రాజేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు

# గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయి ఏర్పాట్లు: డీసీపీ భాస్కర్



మంచిర్యాల, జులై 20(నినాదం): రానున్న గోదావరి పుష్కరాలకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అధికారులను ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్, మంచిర్యాల సబ్ డివిజన్‌లోని లక్షెట్టిపేట,దండేపల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న గూడెం దేవాలయం ఘాట్‌ను మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, సీఐ రమణ మూర్తి, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ప్రత్యక్షంగా సందర్శించారు. గోదావరి తీర ప్రాంతాల్లో పుష్కరాల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి,సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ,వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే విస్తృత స్థాయిలో ఏర్పాట్లు ప్రారంభించిందని తెలిపారు. మంచిర్యాల టౌన్ ఘాట్,గూడెం దేవాలయం ఘాట్, చెన్నూరు ఉత్తరవాహిని గోదావరి ఘాట్‌లను ప్రధాన ఘాట్‌లుగా గుర్తించినట్లు చెప్పారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్ర డీజీపీ ఘాట్‌లను స్వయంగా పరిశీలించి,భక్తుల భద్రతకు అవసరమైన వాచ్ టవర్ల ఏర్పాటు, వాటి పరిమాణం, నిర్మాణం,ఘాట్‌ల అభివృద్ధి తదితర అంశాలపై సంబంధిత శాఖలకు అవసరమైన సూచనలు చేసినట్లు తెలిపారు.పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని పోలీస్ శాఖ సమగ్ర భద్రతా ప్రణాళికను సిద్ధం చేస్తోందన్నారు. ఘాట్‌ల వద్ద కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థ, సీసీటీవీ కెమెరాలు, వీడియో అనలిటిక్స్ సాంకేతికతను వినియోగించి భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు.ఏ మార్గం ద్వారా ఎంతమంది భక్తులు వస్తున్నారు, ఘాట్ సామర్థ్యం ఎంత ఉంది,రద్దీ పెరిగితే ఎక్కడి నుంచి ట్రాఫిక్‌ను మళ్లించాలి వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు.పరిశీలనలో గుర్తించిన అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి,పుష్కరాల సందర్భంగా భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని డీసీపీ తెలిపారు.ఈ పర్యటనలో మండల రెవెన్యూ అధికారి, తహసీల్దార్,ఇరిగేషన్ శాఖ ఏఈ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,సీఐ రమణమూర్తి,ఎస్ఐ సురేష్, రాజవర్ధన్ , ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రూ.20 లక్షలతో బస్తీ దవాఖానకు శంకుస్థాపన

**ప్రజలకు మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం**

**ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు**



సుల్తానాబాద్, జూలై 20 (నినాదం): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన బస్తీ దవాఖానకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయరమణరావు సోమవారం స్థా నిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశా రు.ఈసందర్భంగావార్డుకౌన్సిలర్ఊట్లవర ప్రదీప్‌తో పాటుస్థానికనాయకులుఎమ్మెల్యేకుఘనస్వాగతం పలికిసన్మానించారు. అనంతరంఆయన మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చే రువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బస్తీ, పల్లె దవాఖానలను ఏర్పాటు చేస్తోందన్నారు. కొ త్త దవాఖానకు అవసరమైన బోర్‌వెల్, ప్రహరీ గో డతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కోసం మరో రూ.5 లక్షలు మంజూరు చేయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మున్సిపల్ పరిధిలోని సుగ్లంపల్లి, పూసాల, సుల్తానాబాద్ ప్రాంతాల్లో మ హిళా భవనాల నిర్మాణానికి నిధులు మంజూ రు చేస్తామని, సుల్తానాబాద్ మహిళల కోసం 10 గుం టల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి సహ కరిస్తామని తెలిపారు.యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించిన ఆ యన, ఎల్-నోవా ప్రభావం నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపాలని సూచించారు. భూగర్భ జలాలను దృష్టిలో ఉంచుకుని సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచి దిగుబడులు సాధించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జి ల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సిం గిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, కౌన్సిలర్లు, వైద్యు లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ వడ్డీ వ్యాపారులపై ఉక్కుపాదం

తొర్రూరు, జులై 20 (నినాదం): తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలో తొర్రూరు, దంతాలపల్లి మరియు నర్సింహులపేట్ మండలాల పరిధిలో నమ్మదగిన సమాచారం మేరకు పలువురు అక్రమ వడ్డీ వ్యాపారులపై (20) ప్రాంతాల్లో ఏక కాలం లో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో ప్రామిసరీ నోట్లు, ఖాళీ చెక్కులు మరియు ఇతర సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత పత్రాల పరిశీలన వాటి చట్ట బద్ధత ను పరిశీలించిన అనంతరం వారి మీద చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అక్రమ వడ్డీ వ్యాపారాలు, అధిక వడ్డీల తో అమాయక ప్రజలను దోచుకొనే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం ప్రజలు చట్టవిరుద్ధ వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అధిక వడ్డీలు, అక్రమ వడ్డీ వ్యాపారుల గురించి సమాచారం పోలీసులకు అందించాలని, అట్టి వారి వివరాలు గోప్యం గా ఉంచుతామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ఉద్యమకారులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి

**ఉద్యమకారుల ఫోరం నాయకుల డిమాండ్**

మంథని, జులై 20 (నినాదం): తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలం, ఉపాధి, వైద్యం, పెన్షన్‌తో కూడిన సమగ్ర సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ మంథని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న అమరుల జ్యోతి వద్ద కేకే కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమకారులతో సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల ఉద్యమకారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేకే కమిటీ సభ్యులు కేకే, ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. మంథనికి చెందిన ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు కమిటీ ముందు హాజరై పలు సూచనలు చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని వారు కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు 25 వేల రూపాయల పెన్షన్, 1000 కోట్ల రూపాయలతో ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు, ఉచిత వైద్యం, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాల్లో 20% వాటా కల్పించాలని, ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య వంటి సంక్షేమ పథకాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం కమిటీ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు ఉద్యమకారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి ఎక్కేటి అనంతరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేల్పుల గట్టయ్య, ఉద్యమకారులు దేవళ్ళ విజయ్ కుమార్, కంకణాల తిరుపతిరెడ్డి, మట్ట రాజయ్య, పంతకాని రవి, పోరెడ్డి వెంకటరెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి

**అటవీ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే హరీష్ బాబు**

కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూలై 20 (నినాదం): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పోడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో సోమవారం ఆమెను కలిసి జిల్లాలోని పోడు రైతుల పరిస్థితిని వివరించారు. అటవీ శాఖ అధికారులు పోడు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, గతంలో ప్రభుత్వమే పట్టాలు మంజూరు చేసిన భూముల్లో కూడా 'భూములు స్వాధీనం చేసుకుంటాం' అంటూ మొక్కలు నాటడం అన్యాయమని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి కొండా సురేఖ అటవీ శాఖ కన్జర్వేటర్‌కు ఫోన్ చేసి పోడు రైతులను ఇబ్బంది పెట్టవద్దని, సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. రైతుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.




## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ...**

**జిల్లా కలెక్టర్ వినతి పత్రం అందజేత...**

**టి.ఆర్.పి జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్**

పెద్దపల్లి రూరల్ జూలై 20 (నినాదం): జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో వందలాది ఇటుక బట్టీలు ఎటువంటి అనుమతులు లేకుండా,కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించకుండా నడుస్తున్నాయని టి.ఆర్.పి పార్టీ నాయకులు ఆరోపించారు.వీటి వల్ల వెలువడే పొగ, దుమ్ము, బూడిదతో గ్రామ ప్రజలు, విద్యార్థులు,రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.వ్యవసాయ భూముల్లో నాలా అనుమతులు లేకుండా బట్టీలు నిర్వహిస్తుండటం వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం వాటిల్లుతుందని వారు పేర్కొన్నారు.రాబోయే 15 రోజుల్లోపు సమగ్ర విచారణ చేసి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,చేసిన చర్యలపై ఎ.టి.అర్ సమర్పించాలని వారు జిల్లా కలెక్టర్ ను కోరారు



## రైతు సేవే లక్ష్యం

**చిన్నకల్వల సింగిల్ విండో పీఠంపై గౌరవెల్లి మురళీధర్‌రావు**

సుల్తానాబాద్, జూలై 20 (నినాదం): రైతు సేవే తన లక్ష్యమని చిన్నకల్వల సింగిల్ విం డో అధ్యక్షుడు గౌరవెల్లి మురళీధర్ రావు హామీ ఇ చ్చారు. సోమవారం సుల్తానాబాద్ మండలం చి న్నకల్వల సింగిల్ విండో అధ్యక్షుడిగా గౌరవెల్లి మురళీధర్‌రావు సోమవారం పాలకవర్గ సభ్యుల తో కలిసి ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పాలకవర్గ సభ్యులు, రైతు లు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేసి పూ ల మాలలతో సత్కరించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాన్ని ముందుకు తీసుకె ళ్తానని, రైతులకు నాణ్యమైన సేవలు అందేలా కృ షి చేస్తానని మురళీధర్‌రావు తెలిపారు. సహకార సంఘం అభివృద్ధికి పాలకవర్గ సభ్యులందరి సహ కారంతో పారదర్శకంగా పనిచేస్తామని ఆయన పే ర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నకల్వల సర్పం చ్ [illegible]



ఏరుకొండ స్రవంతి రమేష్ గౌడ్,సీఈవో వల్లకొం డరమేష్,పాలకవర్గసభ్యులుమ్యాకలసాయిలు,మావురపు శ్యామసుందర్ రెడ్డి, పోలవేణి కుమార్, వే ల్పుల సందీప్,అన్నమనేని లక్ష్మి ,దేవరనేని సుధా కర్ రావు,ఐత రాజేశ్వరి ,బండి ఎల్లయ్య గౌడ్, బు షనవేని రాజా గౌడ్,కలువల శంకర్,కల్లే పల్లి మి నమ్మ, మానుపటి రాజు, రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలే భవిష్యత్తు...





**పుట్టినరోజుకు పచ్చని కానుక**

**పర్యావరణానికి ప్రాణం పోసిన సుధీర్ రావు**

**150 మొక్కలు నాటిన లయన్స్ క్లబ్**

**లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జూపల్లి తిరుమ లరావు**

సుల్తానాబాద్, జూలై 20 (నినాదం): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సందేశమిస్తూ సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో మండలంలోని గర్రెపల్లి గ్రామంలోని మో డల్ హైస్కూల్, జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, డాక్టర్ జూపల్లి తిరుమల రావు, లైన్స్ క్లబ్ ప్రతి నిధులతో కలిసి 150 మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎర్రబెల్లి సు ధీర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని సు మారు రూ.20 వేల వ్యయంతో కరీంనగర్ నర్సరీ నుంచి తెప్పించిన మొక్కలను పాఠశాల ఆవరణ లో నాటడం విశేషం అని, పర్యావరణానికి ఆయ న ప్రాణం పోశారని కొనియాడారు. అనంతరం వారు మాట్లాడుతూ పుట్టిన రోజులు, వివాహ వా ర్షికోత్సవాలు వంటి శుభ సందర్భాల్లో ప్రతి ఒక్క రూ కనీసం ఒక మొక్క నాటి పర్యా వరణ పరిరక్ష ణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలు పు నిచ్చారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డి స్ట్రిక్ట్ చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, కార్యదర్శి ఎర్రబెల్లి సుధీర్‌రావు, కోశాధికారి తమ్మనవేని స తీష్ కుమార్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ పూసాల సాం బమూర్తి, గర్రెపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన పాఠశాల ప్రిన్సిపాల్‌కు లయన్స్ క్లబ్ ప్రతినిధులు కృతజ్ఞత లు తెలిపారు.

## మొక్కజొన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ

గద్వాల బ్యూరో జులై 20 (నినాదం): జిల్లాలోని రైతుల నుంచి యాసంగి కాలానికి సంబంధించి మొక్కజొన్నను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించగా, కొంతమంది రైతుల అకౌంటు నెంబర్లు తప్పులుగా ఉండడం వలన సకాలంలో వారి ఖాతాల్లో జమ కాని రూ.56 లక్షల డబ్బులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ వారంలో జమ చేయడం జరుగుతుందని మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 2025-26 యాసంగి కాలంలో రైతులు పండించిన మొక్కజొన్నను మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సహకారంతో ఆయా మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి సేకరించమన్నారు. మొత్తం 9845 మంది రైతుల నుంచి 599185 క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేయగా, దీనికి సంబంధించిన రూ.143 కోట్లు వారి ఖాతాల్లో ఇప్పటివరకు జమ చేసామన్నారు. అకౌంట్ నెంబర్ తప్పులుగా ఉన్న మిగిలిన రైతులకు మాత్రమే ఈ వారంలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.





## పరిశుభ్ర సుల్తానాబాద్‌కు మరో అడుగు

**సాయిబాబా ఆలయ మార్గంలో భారీ కాలువకు చెత్త తొలగింపు**

**స్వయంగా పర్యవేక్షించిన మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ**

సుల్తానాబాద్, జూలై 20 (నినాదం): సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణంలోని నాలుగో వార్డు పూసాల రోడ్డులో ఉన్న సాయిబాబా ఆల యానికి వెళ్లే మార్గంలోని భారీ కాలువలో పేరు కుపోయిన చెత్తాచెదారం, మొలిచిన చెట్లు, కలు పు మొక్కలను సోమవారం మున్సిపల్ సిబ్బం దితో తొలగింపజేశారు. ఈ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ స్వయంగా పరిశీలి స్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశా రు. కాలువల్లో చెత్త పేరుకుపో వడం వల్ల వర్షాకా లంలో నీటి ప్రవాహానికి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ప్రత్యేక పారిశు ద్ధ్య కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స హకరించాలని, చెత్తను కాలువల్లో వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చే శారు. మున్సిపాలిటీని పరిశుభ్రంగా, ఆరోగ్యవం తమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి పా రిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతా యని ఆయన పేర్కొన్నారు.



### క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగానే
# ఎల్‌నినోను ఎదుర్కోవాలి

**వర్షపాతం లోటుపై ప్రతి రైతుకు స్పష్టమైన సమాచారం చేరాలి**
**త్రాగునీటి అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలి**
**రైతు వేదికల ద్వారా వాస్తవ పరిస్థితులను వివరించాలి**

**ఖమ్మం, జూలై 20 (నినాదం ):** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను శాస్త్రీయ అంచనాలు, క్షేత్రస్థాయి వాస్తవాలు, శాఖల సమన్వయంతోనే సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులు, వర్ష పాతం, త్రాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరా, పంటల ప్రణాళికలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ ఎల్‌నినో పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. జూలై 15 నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, రైతులు ప్రస్తుతం పత్తి అధికంగా సాగు చేశారని, వర్షాలు వస్తే వరి పంట వేద్దామని చూస్తున్నారని, భూగర్భ జలాలు గలవారు వరి పంట సాగుకు ముందుకు వెళ్తున్నారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ భూగర్భ జలాలు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రాబోయే రెండు నెలల్లో మరింత తగ్గిపోతాయని, రైతులు ఎవరు వరి పంట సాగు చేయవద్దని ఆయన కోరారు. గత ఏడాది, ఈ ఏడాది నీటి వనరుల లభ్యత, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిపై వివరాలతో ప్రణాళిక శాఖ సమగ్ర నివేదిక సిద్ధం చేసి మీడియాకు, క్షేత్రస్థాయి అధికారులకు, రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించిన మేరకు రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లా అవసరాలకు ఎలా వినియోగించుకోవచ్చో అన్ని సాంకేతిక అవకాశాలను పరిశీలించి తక్షణమే సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వర్షపాతం పరిస్థితులు, నీటి వనరుల లభ్యత, భూగర్భ జలాల పరిస్థితిపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి మాత్రమే రైతులు పంటల ఎంపిక చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఈ ఖరీఫ్‌లో సాగునీరు వచ్చే పరిస్థితి లేదని, పాలేరు ఆయకట్టుకు కూడా సాగునీరు అందుబాటులో ఉండదని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. వాస్తవ పరిస్థితులను దాచకుండా అధికారులు నేరుగా రైతులతో మాట్లాడాలని సూచించారు.ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో త్రాగునీటి అవసరాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. భూగర్భ జలాల లభ్యత ఆధారంగా మాత్రమే పంటల ప్రణాళిక రూపొందించాలని, వరి వంటి నీటి అధిక అవసరమున్న పంటలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు. రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం వైరా, లంకా సాగర్ జలాశయాలను త్రాగునీటి అవసరాల కోసమే నింపుతున్నా మని, పాలేరు జలాశయంలో కూడా సెప్టెంబర్-2026 వరకు మాత్రమే తాగునీటి నిల్వలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఉమ్మడి ఖమ్మం జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ముందస్తు చర్యలతో ఎల్-నినో ప్రభావాన్ని
# సమర్థవంతంగా ఎదుర్కొందాం

**ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి ... మంత్రి వివేక్ వెంకటస్వామి**

**మెదక్, సంగారెడ్డి జిల్లాల ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై మంత్రి సమీక్ష**







**సంగారెడ్డి బ్యూరో, జూలై 20 (నినాదం):** ఎల్-నినో ప్రభావం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలలో ఎల్-నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు, జిల్లాల వారీ అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎల్-నినో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్-నినో ఒక సహజ ప్రకృతి విపత్తు అని, దీని ప్రభావాన్ని అర్థం చేసుకొని నష్టాన్ని వీలైనంత తగ్గించే దిశగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. లోటు వర్షపాతం, నీటి కొరత, పంటలపై ప్రతికూల ప్రభావం వంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ లేదా ఎనిమిది ఎకరాల కంది పంట సాగు చేయవచ్చని పేర్కొన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, అంతర్ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు వీడియో రీల్స్, నాటక ప్రదర్శనలు, కళాజాతాలు, అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. జిల్లాలలో పలుచోట్ల కోతుల బెడద ఉన్నందున దానిని నివారించే చర్యలు చేపడితే రైతులు పంటల మార్పిడి వైపు మరింతగా మొగ్గు చూపే అవకాశం ఉంటుందని అన్నారు. ఎల్-నినో ప్రభావం తీవ్రత పెరిగితే భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున నీటి వృథాను అరికట్టడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బోర్‌వెల్‌ల రీచార్జ్, వర్షపు నీటి సంరక్షణ, నీటి వినియోగంలో పొదుపు వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు మేత కొరత ఏర్పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అలాగే ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నివారణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి, ఎ. వాణి ప్రసాద్ మాట్లాడుతూ, ఎల్-నినోను ముందస్తుగా అంచనా వేసి ప్రభుత్వం ప్రతి శాఖను సమాయత్తం చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే ఈ ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. అనంతరం మంత్రి "జల సిరి" ప్రచార పోస్టర్లను, జిల్లా కంటింజెన్సీ ప్లాన్ ను ఆవిష్కరించారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షపాత పరిస్థితులు, పంటల సాగు, భూగర్భ జలాల స్థితి, జల వనరులలో నీటి లభ్యత, విద్యుత్, తాగు నీటి సరఫరా, ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి ఎ. వాణి ప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సంజీవరెడ్డి, మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, వివిధ మున్సిపాలిటీల ఛైర్మన్లు, ప్రజాప్రతినిధులు, మెదక్, సంగారెడ్డి జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధి కారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఆత్మ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్య ప్రయత్నంలో వ్యక్తి ప్రాణాలను కాపాడిన కామారెడ్డి పోలీసులు

**డయల్-100కు సమాచారం అందగానే మెరుపు వేగంతో స్పందించిన పోలీసు సిబ్బంది**
**కేవలం 10 నిమిషాల్లో రైల్వే ట్రాక్‌పై గుర్తించి సురక్షితంగా రక్షించిన పోలీసులు**

కామారెడ్డి రూరల్ జూలై 20 (నినాదం): కామారెడ్డి పట్టణంలో ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లిపోయిన ఓ వ్యక్తిని పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి సురక్షితంగా రక్షించారు.నిన్న రాత్రి ఆ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే డయల్-100కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే కామారెడ్డి పోలీసు సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా మెరుపువేగంతో స్పందించారు.బీసీ కానిస్టేబుల్ అరుణ్‌తో పాటు పోలీసు బృందం వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించి,అందిన సమాచారాన్ని సమర్థంగా విశ్లేషిస్తూ కేవలం 10 నిమిషాల్లోనే రైల్వే ట్రాక్‌పై ఉన్న వ్యక్తిని గుర్తించింది.ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకముందే అతడిని సురక్షితంగా అదుపులోకి తీసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించింది. పోలీసుల తక్షణ స్పందన,అప్రమత్తత,వేగవంతమైన చర్యల వల్ల ఒక విలువైన ప్రాణం నిలిచింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర మాట్లాడుతూ "ప్రతి ప్రాణం అమూల్యమైనది.సమస్య ఏదైనా ఆత్మహత్య పరిష్కారం కాదు.ఆపదలో ఉన్నవారు వెంటనే కుటుంబ సభ్యులు,స్నేహితులు లేదా పోలీసులను సంప్రదించాలి.అత్యవసర పరిస్థితుల్లో డయల్-100కు సమాచారం అందిస్తే పోలీసులు వెంటనే స్పందిస్తారు,"అని తెలిపారు.మానసిక ఒత్తిడి లేదా నిరాశతో బాధపడుతున్న వారు ఒంటరిగా మౌనంగా ఉండకుండా కుటుంబ సభ్యులు,స్నేహితులు లేదా మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం పొందాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.





## సోషల్ మీడియాకు దూరంగా ఉంటే..
# హాయిగా ఉంది

**నటి ఐశ్వర్య లక్ష్మి వెల్లడి**

సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వల్ల ప్రాణం హాయిగా ఉందని కేరళ సోయగం ఐశ్వర్య లక్ష్మి అన్నారు. తాజా ఇంటర్వ్యూలో తాను చేస్తున్న సినిమాల గురించి, సోషల్ మీడియా గురించి ఆసక్తికరంగా మాట్లాడారామె. 'ఒకప్పుడు సోషల్‌మీడియాలో చురుగ్గా ఉండేదాన్ని. కానీ నా ఫొటోలు మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన కామెంట్లు పెట్టి కొందరు నన్ను బాధపెట్టారు. వాళ్ల వల్ల అంతా నన్ను ద్వేషిస్తున్నట్టు అనిపించేది. ఇప్పుడు సోషల్‌మీడియాకు దూరంగా, ప్రేక్షకులకు దగ్గరగా ఉంటున్నా. వందకోట్లు ఇచ్చినా మళ్లీ సోషల్ మీడియా జోలికి మాత్రం పోను' అంటూ తెగేసి చెప్పింది ఐశ్వర్య లక్ష్మి తన తాజా సినిమా 'గట్టాకుస్తీ 2' గురించి మాట్లాడుతూ 'గట్టాకుస్తీ 2' మంచి విజయం సాధించిందని అంతా అంటుంటే ఆనందంగా ఉంది. సమానత్వాన్ని ప్రతిబింబించే సినిమా అది. అందుకే అది నా మనసుకు దగ్గరైన సినిమా.' అంటూ ఐశ్వర్య ఆనందం వెలిబుచ్చింది. ప్రస్తుతం ఓ ఫీమేల్ సెంట్రిక మూవీలో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నది ఐశ్వర్య లక్ష్మి తీవియన్ పొట్రు', 'లవ్' అనే వెబ్ సిరీస్‌లు కూడా ఈ అమ్మడి చేతిలో ఉన్నాయి.

NINADAM CINEMA

### జాతీయ అవార్డు రావడం
# మెగా విజయం

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా రూపొందించిన 'కమిటీ కుర్రోళ్ళు' చిత్రం జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యంతో, కొత్త నటీనటులతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రతిష్టాత్మక 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో రెండు అవార్డులు గెలుచుకుని తెలుగు సినీ పరిశ్రమకు మరోసారి గర్వకారణంగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం ప్రత్యేక సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మాట్లాడిన నిర్మాత నిహారిక కొణిదెల తన ఆనందాన్ని భావోద్వేగంతో పంచుకున్నారు. తమ కుటుంబానికి జాతీయ అవార్డులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ.. సరిగ్గా 36 ఏళ్ల క్రితం మా నాన్న నాగబాబు నిర్మాతగా రూపొందించిన తొలి చిత్రం 'రుద్రవీణ' మూడు జాతీయ అవార్డులు అందుకుంది. ఇప్పుడు నేను నిర్మాతగా పూర్తి బాధ్యతతో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' కూడా రెండు జాతీయ అవార్డులు గెలుచుకోవడం ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. మా కుటుంబ చరిత్ర మరోసారి పునరావృతమైనట్టుగా అనిపిస్తోంది' అని తెలిపారు. నేషనల్ అవార్డు సాధించాలనే లక్ష్యంతో ఈ సినిమాను ప్రారంభించలేదని, అయితే దర్శకుడు యదు వంశీ చెప్పిన కథ విన్న తర్వాత ఈ చిత్రాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే బలమైన కోరిక తనలో కలిగిందని నిహారిక వెల్లడించారు. ఇప్పుడు ఆ కల నిజం కావడం ఎంతో సంతృప్తినిస్తోందని చెప్పారు. ఈ అరుదైన విజయంపై మెగాస్టార్ చిరంజీవి కూడా ఎంతో సంతోషం వ్యక్తం చేశారని, ఆయన నుంచి వచ్చిన ప్రశంసలు తనకు మరింత ప్రేరణనిచ్చాయని నిహారిక తెలిపారు.



# పివి సింధుకు రాజమౌళి శుభాకాంక్షలు

**మీ మూవీలో పరిచయ నటిగా ఛాన్స్ ఇమ్మంటూ షట్లర్ రిప్లై**



జపాన్ ఓపెన్ టైటిల్ విజేతగా నిలిచి భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తెలుగు తేజంపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో అగ్ర దర్శకుడు రాజమౌళి పోస్ట్‌కు సింధు ఇచ్చిన రిప్లై అందరినీ ఆకర్షిస్తూనే నెట్టింట ఆసక్తికర చర్చకు దారి తీసింది. సింధును అభినందిస్తూ రాజమౌళి ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. జపాన్ ఓపెన్ గెలిచిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించావు. మంచి కమ్ బ్యాక ఇచ్చావు. కంగ్రాట్స్ సింధు. నిన్ను చూసి దేశం గర్విస్తోందని శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందించిన ఆమె.. ధన్యవాదాలు రాజమౌళి సర్. మీ వారణాసి కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఒకవేళ మీరు తెరకెక్కించే ఏ సినిమాలో అయినా



బ్యాడ్మింటన్ ప్లేయర్ పాత్ర ఉంటే.. మీ పరిచయ నటిగా మారడానికి నేను ఎంతో సంతోషిస్తాను' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పంచుకున్నారు. ప్రస్తుతం సింధు రిప్లై నెట్టింట వైరల్ అవుతుండగా.. త్వరలోనే సినిమాల్లోకి రానుందా అనే చర్చ మొదలైంది. రాజమౌళికి క్రీడాకారుల నుంచి ఈ తరహా రిక్వెస్ట్‌లు రావడం ఇదేం తొలిసారి కాదు. గతంలో ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ కూడా జక్కన్నకు ఇలాంటి రిప్లై ఇచ్చారు. తెలుగు సినిమా పాటలకు తనదైన స్టైల్‌లో డ్యాన్స్ వేస్తూ పోస్టులు పెట్టే వార్నర్‌కు.. మన దర్శకధీరుడు 'బాహుబలి' కిరీటాన్ని కూడా పంపారు. ఇక 'వారణాసి' విషయానికొస్తే.. దీని షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. అక్టోబర్ నాటికి పూర్తి చేసి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిలీజ్ చేయనున్నారు

### వరుస సినిమాలతో
# మమతా బైజు బిజీ

'ప్రేమలు' సినిమాతో సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన అందాలభామ మమితాబైజు ఇప్పుడు అన్ని భాషల్నీ కవర్ చేస్తూ వరుసపెట్టి సినిమాలు చేస్తున్నది. అగ్రహీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తో కలిసి ఆమె నటించిన 'జననాయగన్' చిత్రం ఈ నెల 23న విడుదలకానున్న విషయం తెలిసిందే. ఇక సూర్యతో ఆమె నటించిన తెలుగు సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఆగస్ట్ 14న విడుదల కానున్నట్టు తెలుస్తున్నది. దర్శకుడు వెంకీ అట్లూరి ఫ్యామిలీ, లవ్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక మలయాళంలో మమితా నటించిన 'బెత్లెహం కుటుంబ యూనిట్' ఆగస్ట్ 21న రిలీజ్ కానుంది. ఫహాత్ ఫాజిల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మమత సరికొత్త పాత్రలో కనిపించనున్నది. నివిన్ పౌలీ హీరో. ఈ విధంగా విజయ్, సూర్య, నివిన్‌పౌలీ వంటి ప్రముఖ నటుల సినిమాల్లో నటిస్తూ అద్భుతమైన కెరీర్‌ని కొనసాగిస్తున్నది మమితా బైజు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028
Published at 6-3-439, Kisannagar, Karimnagar-505001(TS) Editor: B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787